




త్వరలో ఏపీఆర్ఈడీసీ

2

ఏర్పాటుకానున్న రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

ఒడిశా, జార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటున్న ఏపీఎండీసీ

గనుల శాఖపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షలో వెల్లడి

ఏపీఎండీసీ ఐపీవోకు వెళ్లేందుకు ముఖ్యమంత్రి ఆమోదం



రాష్ట్ర ఖనిజ సంపదను భవిష్యత్ తరాలకు విలువైన ఆస్తిగా మలచడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఏపీఎండీసీని ఎన్ఎండీసీ తరహాలో అత్యున్నత స్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని సూచించారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనకు పరిమితం చేయకుండా.. వాటి విలువను పెంచి రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి వినియోగించాలని స్పష్టం చేశారు.



ఉద్యాన పంటలకు తుఫాన్ల దెబ్బ


- **ఏపీలో ఉద్యాన పంటల నష్టం రూ.1,092 కోట్లు**
- **అర్నబ్, మురసు తుఫానులతో నష్టపోయిన ఉద్యాన రైతాంగం**
- **పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల అదనపు సాయం**
- **కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం చంద్రబాబు లేఖ**

3

*రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫానుల ధాటికి ఏపీలోని **18** జిల్లాల్లో **29,960** హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల **71,576** మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు.*

నిత్యావసర ధరల నియంత్రణకు

ఏడాది కాల ప్రణాళిక!



- **నిరంతర మార్కెట్ పర్యవేక్షణ, అగ్రి-వాచ్ ద్వారా ధరల కట్టడికి చర్యలు**
- **రైతులకు నష్టం రాకూడదు.. వినియోగదారులకు ఇబ్బంది కలగకూడదు**
- **మార్కెట్ జోక్యానికి నెలకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నాం: సీఎం చంద్రబాబు**

3

నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ధరల తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో మార్కెట్‌లో జోక్యం చేసుకోవాలని సూచించారు.



భీమవరం ఆక్వాకల్చర్ క్లస్టర్ అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం –ఐస్‌లాండ్ ఓషన్ క్లస్టర్ మధ్య ఎంవోయూ కుదిరింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమక్షంలో ఈ ఎంవోయూను కుదుర్చుకున్నారు. చేపలు, రొయ్యల సంపూర్ణ వినియోగం, సముద్ర ఉత్పత్తుల ద్వారా అదనపు విలువ సృష్టించేందుకు ఇది దోహదపడనుంది. ఆధునిక ప్రాసెసింగ్ టెక్నాలజీ, మెరైన్ బయోటెక్నాలజీ, వ్యర్థాల నుంచి విలువైన ఉత్పత్తుల తయారీలో పరస్పర సహకారం అందించుకోనున్నాయి. పరిశోధన, సాంకేతిక పరిజ్ఞాన మార్పిడి, శిక్షణ, స్టార్టప్‌ల ప్రోత్సాహానికి ఐస్‌లాండ్ క్లస్టర్ సహకారం అందించనుంది. ఈ అంతర్జాతీయ భాగస్వామ్యంతో ఆంధ్రప్రదేశ్ ఆక్వాకల్చర్ రంగంలో సుస్థిర అభివృద్ధి, ఎగుమతులు, అదనపు ఆదాయ అవకాశాలకు బాటలు పడనున్నాయి.

ఏపీ మెప్మాకు

జాతీయ గుర్తింపు

- మూడు విభాగాలలో అవార్డులు కైవసం
- అధికారులకు మంత్రి నారాయణ విషెస్



- వివరాలు 2 లో..

పథకం ప్రకారమే

వైసీపీ అల్లర్లు

- ఎన్నికలు ముగిసేవరకూ వైసీపీని బహిష్కరించాలి
- ఎమ్మెల్సీ వర్ల ఆగ్రహం: ఎస్ఈసీకి టీడీపీ ఫిర్యాదు



- వివరాలు 5 లో..

మేం చెప్పిందే

చేసి చూపాం

- జెడ్పీ, ఎంపీపీ పదవుల్లో వాళ్లకే పెద్దపీట
- గొడ్డలిపార్టీ చిరునామా గల్లంతు: అశోక్‌బాబు



- వివరాలు 7 లో..

జగన్‌వి

కాకి లెక్కలు!

- అతను ఇచ్చింది గోరంత.. లోకేష్ ఇస్తున్నది కొండంత
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై బయోడైవర్సిటీ ఛైర్మన్ వ్యాఖ్య



- వివరాలు 6 లో..

త్వరలో ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్

- ఒడిశా, జార్ఖండ్ బొగ్గు బ్లాకుల వేలంలో పాల్గొంటున్న ఏపీఎండీసీ
- గనుల శాఖపై అధికారులతో సీఎం చంద్రబాబు సమీక్షలో వెల్లడి
- ఏపీఎండీసీ ఐపీవోకు వెళ్లేందుకు ముఖ్యమంత్రి ఆమోదం



అమరావతి (చైతన్య రథం): ఎన్ఎండీసీ తరహాలో ఏపీఎండీసీని అత్యున్నతస్థాయి మైనింగ్ సంస్థగా తీర్చిదిద్దేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులకు సూచించారు. ఇందుకోసం అవసరమైతే ప్రైవేట్ ఏజెన్సీల సాయం తీసుకోవాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో గనుల శాఖపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో కొత్త ఖనిజ నిక్షేపాల గుర్తింపు, సమర్థ వినియోగం, ఆదాయార్జన అవకాశాలు తదితర అంశాలపై చర్చించారు. అలాగే, రాష్ట్రంలో ఖనిజ వనరుల విలువ పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని, మన వనరులు... మన రాష్ట్రంలోనే వినియోగంలోకి తెచ్చేలా ప్రయత్నించాలని సీఎం అన్నారు. ఖనిజ వనరులను కేవలం ఆదాయార్జనగా చూడకుండా... భవిష్యత్ ఆస్తిగా మార్చడమే లక్ష్యం కావాలన్నారు.

రాష్ట్రంలో 209 క్లస్టర్లుగా ఖనిజ నిక్షేపాలు

రాష్ట్రంలో 74,860 చ.కి.మీ. పరిధిలో మొత్తం 582 మినరల్ పొటెన్షియల్ ఏరియాలను గుర్తించి, 209 క్లస్టర్లుగా విభజించినట్టు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే ఏడాది డిసెంబర్ లక్ష్యంగా ఏపీఎండీసీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేలా ఐపీవో కార్యాచరణ ప్రతిపాదనలకు ముఖ్యమంత్రి అంగీకరించారు. ఏపీఎండీసీ ఈక్విటీ విలువ ఆధారంగా ఐపీవోకు వెళ్లేలా సీఎం నిర్దేశించారు. ఖనిజ నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఏపీ రేర్ ఎర్త్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం ఆమోదం తెలిపారు. రేర్ ఎర్త్ మినరల్స్ అన్వేషణ, వాటికి విలువ పెంచడమే లక్ష్యం కావాలన్నారు. వచ్చే ఐదేళ్లలో ఖనిజ అన్వేషణ, వేలం ప్రక్రియను వేగవంతం చేసేలా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న 6,500 క్వారీ లీజు దరఖాస్తులు, 223 రెన్యువల్స్ పరిష్కారానికి గడువు పొడిగింపు ప్రతిపాదనలపై సమీక్షలో చర్చించారు. పెండింగ్ దరఖాస్తులు, రెన్యువల్స్ పరిష్కారంతో ప్రభుత్వానికి సుమారు రూ.400 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

అలాగే, థర్మల్ విద్యుత్ కేంద్రాలకు బొగ్గు సరఫరా కోసం ఒడిశా, జార్ఖండ్‌లో మూడు బొగ్గు బ్లాకుల వేలంలో ఏపీఎండీసీ పాల్గొంటున్నట్టు అధికారులు ముఖ్యమంత్రికి వెల్లడించారు. మూడు బొగ్గు బ్లాకుల్లో మొత్తం 1,774.6 మిలియన్ టన్నుల మేర బొగ్గు నిల్వలున్నాయి. సమీక్షలో సీఎస్ సాయిప్రసాద్, గనుల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేష్ కుమార్ మీనా, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పీఎం స్వనిధి అమలులో ఏపీకి ఏడు అవార్డులు

మూడు రాష్ట్రస్థాయి, నాలుగు పట్టణ స్థానిక సంస్థలకు జాతీయ పురస్కారాలు

న్యూఢిల్లీ (చైతన్య రథం): పీఎం స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో గుర్తింపు సాధించింది. ఈ పథకం కింద రాష్ట్రానికి మూడు రాష్ట్రస్థాయి అవార్డులతో పాటు, వివిధ పట్టణ స్థానిక సంస్థలకు (యూఎల్‌బీ) నాలుగు జాతీయ అవార్డులు లభించాయి. మొత్తంగా ఏడు జాతీయ పురస్కారాలను ఆంధ్రప్రదేశ్ కైవసం చేసుకుంది. న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన జాతీయ అవార్డుల ప్రదానోత్సవంలో రాష్ట్రం తరఫున మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) మిషన్ డైరెక్టర్ జి బాలకృష్ణ, అదనపు మిషన్ డైరెక్టర్ ఎన్ వెంకటేశ్వరరావు, ఎస్ఎంఎం-బీఎల్, పీఎం స్వనిధి విభాగానికి చెందిన ప్రభావతి అవార్డులను స్వీకరించారు. అవార్డులు సాధించిన జిల్లాలు, పట్టణ స్థానిక సంస్థల ప్రతినిధులు



కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయిలో మూడు అవార్డులు

పీఎం స్వనిధి పథకం కింద రుణాల పంపిణీలో ఆంధ్రప్రదేశ్ జాతీయస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. ప్రత్యేక ప్రచార కార్యక్రమాల (స్పెషల్ క్యాంపెయిన్స్) నిర్వహణలో దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది. పథకం అమలులో సమగ్ర పనితీరు (ఓవరాల్ పెర్ఫార్మెన్స్) విభాగంలో మూడో ర్యాంకు దక్కించుకుంది.

పట్టణ స్థానిక సంస్థలకు నాలుగు అవార్డులు

పట్టణ స్థానిక సంస్థల విభాగంలో కడప మున్సిపల్ కార్పొరేషన్ రుణాల పంపిణీలో జాతీయస్థాయిలో రెండో ర్యాంకు సాధించింది. 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమం అమలులో రామచంద్రాపురం మున్సిపాలిటీ మొదటి ర్యాంకు, అమలాపురం మున్సిపాలిటీ రెండో ర్యాంకు పొందాయి. డిజిటల్ లావాదేవీల నిర్వహణలో విజయనగరం పట్టణ స్థానిక సంస్థ జాతీయ స్థాయిలో రెండో ర్యాంకును కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ సురేష్ కుమార్ మెప్మా బృందాన్ని, అవార్డులు సాధించిన పట్టణ స్థానిక సంస్థలను అభినందించారు.

పీఎం స్వనిధి పథకం అమలులో ఏపీ మెప్మాకు జాతీయస్థాయిలో గుర్తింపు

- మూడు విభాగాల్లో జాతీయ అవార్డులు..
- అధికారులను అభినందించిన మంత్రి నారాయణ
- ఇప్పటివరకు 4.94 లక్షల మంది వీధి వ్యాపారులకు రూ.1,016.88 కోట్ల రుణాలు
- 2025-26 ఆర్థిక సంవత్సరంలో 1.34 లక్షల మందికి రూ.284.66 కోట్ల రుణాలు పంపిణీ

అమరావతి (చైతన్య రథం): పీఎం స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ) జాతీయ స్థాయిలో పలు అవార్డులు సాధించడం పట్ల రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ హర్షం వ్యక్తం చేశారు. వీధి వ్యాపారులకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు, పట్టణ పేదల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు ఈ అవార్డులు నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధతో పట్టణ ప్రాంతాల్లోని పేదలు, మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. మెప్మా ఆధ్వర్యంలో పీఎం స్వనిధి పథకం ద్వారా వీధి వ్యాపారులకు తక్కువ వడ్డీకే రుణాలు మంజూరు చేయిస్తూ, వారి వ్యాపారాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటునందిస్తోందని వివరించారు.

పీఎం స్వనిధి పథకం ద్వారా ఇప్పటివరకు రాష్ట్రంలో 4,94,000 మంది వీధి వ్యాపారులకు రూ.1,016.88 కోట్ల రుణాలు మంజూరు చేయించినట్లు మంత్రి తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలోనే 1,34,000 మంది వీధి వ్యాపారులకు రూ.284.66 కోట్ల రుణాలు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. వీధి వ్యాపారులకు ఆర్థిక చేయూత అందించడంలో ప్రభుత్వం చూపుతున్న చొరవకు ఈ గణాంకాలు నిదర్శనమన్నారు.

పీఎం స్వనిధి పథకం అమలులో ఆంధ్రప్రదేశ్ మెప్మా జాతీయ స్థాయిలో మూడో స్థానాన్ని సాధించగా, అత్యధిక సంఖ్యలో వీధి వ్యాపారులకు రుణాలు మంజూరు చేయడంలో రెండో స్థానంలో నిలిచింది. అలాగే ప్రత్యేక రుణ మేళాలు (స్పెషల్ క్యాంపులు) నిర్వహించడంలో దేశంలోనే ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకుంది. వీధి వ్యాపారుల కుటుంబాలకు వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అందించే 'స్వనిధి సే సమృద్ధి' కార్యక్రమం అమలులోనూ రాష్ట్రంలోని పలు మున్సిపాలిటీలు విశేష పురోగతి సాధించాయి. ఈ విభాగంలో రామచంద్రాపురం మున్సిపాలిటీ జాతీయ స్థాయిలో మొదటి స్థానంలో, అమలాపురం మున్సిపాలిటీ రెండో స్థానంలో నిలిచి అవార్డులు అందుకున్నాయి. అదేవిధంగా, డిజిటల్ లావాదేవీల నిర్వహణలో విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్



జాతీయ స్థాయిలో రెండో స్థానాన్ని సాధించడం విశేషమని మంత్రి పేర్కొన్నారు.

జాతీయ స్థాయిలో రాష్ట్రానికి గుర్తింపు తీసుకొచ్చిన మెప్మా అధికారులు, సంబంధిత మున్సిపాలిటీల కమిషనర్లు, సిబ్బందిని మంత్రి నారాయణ ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా పనిచేయాలని సూచించారు. రాబోయే రోజుల్లో మెప్మా ద్వారా పట్టణ ప్రాంత మహిళలను ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అదనపు చర్యలు చేపడుతుందని మంత్రి తెలిపారు. మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రోత్సహించడం, పట్టణ పేదరిక నిర్మూలనకు కృషి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి నారాయణ స్పష్టం చేశారు.



తుఫాన్లతో ఏపీలో
ఉద్యాన పంటల నష్టం రూ.1,092 కోట్లు

- **అర్నబ్, మురసు తుఫానులతో నష్టపోయిన ఉద్యాన రైతాంగం**
- **ఉద్యాన పంటల పునరుద్ధరణకు రూ.96 కోట్ల అదనపు సాయానికి వినతి**
- **కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు సీఎం లేఖ**

అమరావతి (చైతన్య రథం): రెండు వరుస తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటల పునరుద్ధరణకు వివిధ కేంద్ర పథకాల కింద అదనపు సాయం అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు లేఖ రాశారు. ఇటీవల సంభవించిన అర్నబ్, మురసు తుఫానుల కారణంగా రాష్ట్రంలో ఉద్యాన పంటలకు భారీ నష్టం వాటిల్లిందని లేఖలో ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబర్ 28, నవంబర్ 2 తేదీలలో వరుసగా ఏపీని తాకిన రెండు తుఫానుల ధాటికి 18 జిల్లాల్లోని 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, దీనివల్ల 71,576 మంది రైతులు నష్టపోయారని పేర్కొన్నారు.

అర్నబ్ తుఫాను కారణంగా 215 మండలాల్లోని 23,211 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నట్లు వివరించారు. ఒక్క అరటి పంటే 15,549 హెక్టార్లలో దెబ్బతిందని వివరించారు. మురసు తుఫాను ప్రభావంతో 108 మండలాల్లోని 6,748 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని సీఎం తెలిపారు. దెబ్బతిన్న తోటల పునరుద్ధరణ, రైతులను ఆదుకునేందుకు వివిధ కేంద్ర పథకాల కింద అదనంగా రూ.96.33 కోట్ల సాయం అందించాలని సీఎం కోరారు.

అత్యధికంగా అరటి పంట తీవ్రస్థాయిలో దెబ్బతిందని, దానిని పునరుద్ధరించేందుకు మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ స్కీమ్ కింద హెక్టారుకు రూ.44 వేల చొప్పున నిధులు అందించాలని కోరారు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద ఎండుమిర్చి, కూరగాయల పంటలను ఆదుకోవాలని లేఖలో విజ్ఞప్తి చేశారు. అలాగే కోనసీమ, కాకినాడ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, బాపట్ల తదితర జిల్లాల్లో మొవ్వ విరిగిన కొబ్బరి చెట్లకు కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు నుంచి ఆర్థిక సహకారం అందించాలని కోరారు. తోటల పునరుద్ధరణ, దీర్ఘకాలిక ఆర్థిక నష్టాలను తగ్గించేందుకు త్వరితగతిన సాయం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తన లేఖలో విజ్ఞప్తి చేశారు.

నిత్యావసర ధరల నియంత్రణకు
ఏడాది కాల ప్రణాళిక!

- **నిరంతర మార్కెట్ పర్యవేక్షణ, అగ్రి-వాచ్ ద్వారా ధరల కట్టడికి చర్యలు**
- **రైతులకు నష్టం రాకూడదు.. వినియోగదారులకు ఇబ్బంది కలగకూడదు**
- **మార్కెట్ జోక్యం కోసం ప్రస్తుతం నెలకు రూ.100 కోట్ల వరకు ఖర్చు చేస్తున్నాం: సీఎం చంద్రబాబు**



అమరావతి (చైతన్య రథం): నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ధరల తీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, అవసరమైన సమయంలో మార్కెట్‌లో జోక్యం చేసుకోవాలని సూచించారు. ధరల నియంత్రణపై ప్రతి వారం సమీక్షలు నిర్వహించాలని స్పష్టం చేశారు. శుక్రవారం క్యాంపు కార్యాలయంలో నిత్యావసర వస్తువుల ధరలపై నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి ఈ మేరకు అధికారులకు దిశానిర్దేశం చేశారు. ధరలను అదుపులో ఉంచేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆరా తీశారు.


డిసెంబర్ 1నుంచి రేషన్ షాపుల ద్వారా కందిపప్పు, గోధుమ పిండి, పామాయిల్ పంపిణీ ప్రారంభించనున్నట్టు మంత్రి నాదెండ్ల మనోహర్ ముఖ్యమంత్రికి వివరించారు. కిలో కందిపప్పు రూ.100, కిలో గోధుమ పిండి రూ.25, లీటర్ పామాయిల్ రూ.125 చొప్పున అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. రైతు బజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ.35కు విక్రయిస్తున్నట్లు చెప్పారు. ధరణి బ్రాండ్‌తో రైతు బజార్లలో సరసమైన ధరలకు విక్రయిస్తున్న బియ్యానికి మంచి ఆదరణ లభిస్తోందని వివరించారు. బహిరంగ మార్కెట్‌లోనూ బియ్యం ధరలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఇందుకోసం హోల్‌సేల్ బియ్యం వ్యాపారులు, మిల్లర్లతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు వెల్లడించారు. మొబైల్ వాహనాల ద్వారా కూడా సరసమైన ధరలకు బియ్యం సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

ద్రవ్యోల్బణాన్ని అరికట్టేందుకు వ్యవసాయ, మార్కెటింగ్, పౌరసరఫరాల శాఖలు, రైతు బజార్లు సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి సూచించారు. సమస్యలు తలెత్తినప్పుడు మాత్రమే ధరల నియంత్రణపై సమీక్షలు నిర్వహించే విధానం కాకుండా, నిరంతర ప్రక్రియగా కొనసాగించాలని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది కాలానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, ప్రతి వారం సమీక్షించాలని ఆదేశించారు. ధరల నియంత్రణ చర్యల్లో ఎలాంటి అలసత్వం ఉండకూడదని స్పష్టం చేశారు. పంటలు పండించే రైతులకు నష్టం రాకూడదని, వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. అవసరాలకు అనుగుణంగా, సరైన సమయంలో ప్రణాళికాబద్ధంగా ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకుంటే బహిరంగ మార్కెట్‌లోనూ ధరలను తగ్గించవచ్చన్నారు. మార్కెట్ డిమాండ్, ధరల సరళిని బట్టి వివిధ పంటల సాగును ప్రోత్సహించాలని సూచించారు. వ్యవసాయ ఉత్పత్తులు సకాలంలో మార్కెట్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కందిపప్పు ధరలు అధికంగా ఉన్న నేపథ్యంలో వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వ జోక్యాన్ని కొనసాగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. అదే సమయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని రైతులు కందిపప్పు సాగు చేపట్టేలా ప్రోత్సహించాలని సూచించారు. నాసిక్ రకం ఉల్లిపాయల సాగుకు ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ప్రాంతాలు ఎంతవరకు అనుకూలంగా ఉంటాయో అధ్యయనం చేయాలని అధికారులను ఆదేశించారు. అనుకూలమైన ప్రాంతాల్లో రైతులు ఈ రకం ఉల్లిపాయలను సాగు చేసేలా అవగాహన కల్పించాలని సూచించారు. ధరల నియంత్రణ కోసం మార్కెట్ జోక్యానికి ప్రభుత్వం ఖర్చు చేసేందుకు వెనుకాడకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రస్తుతం మార్కెట్ జోక్యం కోసం ప్రభుత్వం నెలకు సుమారు రూ.100 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని బియ్యం నిల్వలు అక్రమ మార్గాల్లో ఇతర ప్రాంతాలకు తరలిపోకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

ధరలను అదుపులో ఉంచేందుకు నిరంతర మార్కెట్ పర్యవేక్షణతో పాటు అగ్రి-వాచ్ ద్వారా వ్యూహాత్మక జోక్యాలు చేపట్టాలని ముఖ్యమంత్రి సూచించారు. నిత్యావసర వస్తువులతోపాటు కూరగాయల ధరలు కూడా పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో రైతు బజార్లు కీలక పాత్ర పోషించాలని స్పష్టం చేశారు. ధరల నియంత్రణ చర్యలపై జిల్లా కలెక్టర్లతో జిల్లాల వారీగా సమీక్షా సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

టీడీపీ సీనియర్ నేత ముత్యాల నాయుడు మృతి
- ముఖ్యమంత్రి సంతాపం
-విశాఖ మేయర్ ముక్కా శ్రావణికి ఫోన్లో సీఎం పరామర్శ



అమరావతి (చైతన్య రథం): విశాఖ మేయర్ ముక్కా శ్రావణి తండ్రి, టీడీపీ సీనియర్ నాయకులు ముక్కా ముత్యాల నాయుడు గుండెపోటుతో మరణించడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణ వార్త తెలుసుకున్న సీఎం చంద్రబాబు.. ముక్కా శ్రావణికి ఫోన్ చేసి పరామర్శించారు. కార్పొరేటర్‌గా ముత్యాలనాయుడు విశాఖ ప్రజలకు, పార్టీకి అందించిన సేవలను సీఎం గుర్తు చేసుకున్నారు. శ్రావణి కుటుంబ సభ్యులతోనూ మాట్లాడిన ముఖ్యమంత్రి, ఈ కష్ట సమయంలో ధైర్యంగా ఉండాలన్నారు. ముత్యాలనాయుడు ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ముత్యాలనాయుడు సేవలు చిరస్మరణీయం: లోకేష్

కార్పొరేటర్‌గాను, తెలుగుదేశం పార్టీకి ముక్కా ముత్యాల నాయుడు సేవలు చిరస్మరణీయమని విద్య, ఐటీ మంత్రి నారా లోకేష్ అన్నారు. జివిఎంసీ నూతన మేయర్‌గా ఎంపికైన ముక్కా శ్రావణి తండ్రి ముక్కా ముత్యాల నాయుడు మృతిపట్ల సంతాపం వ్యక్తం చేశారు. ముత్యాలనాయుడు ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ.. కుటుంబ సభ్యులకు మంత్రి లోకేష్ ప్రగాఢ సానుభూతి ప్రకటిస్తూ.. ఎక్స్‌లో ట్వీట్ చేశారు.

కొనకళ్ల కోలుకోవాలి: లోకేష్

అస్వస్థతకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ త్వరగా కోలుకోవాలని మంత్రి లోకేష్ ప్రార్థించారు. కొనకళ్లకు అందుతున్న వైద్యం, ఆరోగ్య పరిస్థితి వైద్యుల ద్వారా తెలుసుకున్నారు.



కూటమి ప్రభుత్వంలో జలజీవన్ మిషన్‌కు జీవం

● వైసీపీ పాలనలో ఈ పథకానికి ఉరి ● జేజేఎం-2.0తో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికీ కుళాయి కనెక్షన్

గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడం కేవలం ఒక సంక్షేమ కార్యక్రమం మాత్రమే కాదు... ప్రజారోగ్యం, జీవన ప్రమాణాలు, గ్రామీణాభివృద్ధితో ముడిపడిన కీలక అంశం. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, చిన్నారులు తాగునీటి కోసం ఇబ్బందిపడకుండా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించడం ద్వారా వారి కష్టాలను తగ్గించవచ్చు. ఈ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో జలజీవన్ మిషన్ 2.0 అమలుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోంది. గతంలో నిలిచిపోయిన పనులను పూర్తి చేయడంతో పాటు కొత్తగా అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది.

వైసీపీ పాలనలో జల్‌జీవన్ మిషన్‌కు ఉరి

2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం జలజీవన్ మిషన్‌ను నీర్వర్యం చేసింది. 2019-24 మధ్య కేంద్రం ప్రభుత్వం రాష్ట్రానికి రూ.26,823 కోట్లు కేటాయించింది. అయితే రాష్ట్రం రూ.2,254 కోట్ల కేంద్ర నిధులను మాత్రమే డ్రా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద రూ.2,250 కోట్లు విడుదల చేసి కేవలం రూ.4,504 కోట్లు మాత్రమే ఖర్చు చేసి జల్‌జీవన్ మిషన్‌కు ఉరి వేశారు. ఫలితంగా అనేక గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ అందించాలనే లక్ష్యం నెరవేరకుండా పోయింది.

జేజేఎం 2.0తో పనులకు వేగం

జల్‌జీవన్ మిషన్-1.0 గడువు 2024 మార్చినాటికి ముగిసిపోవడంతో కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం సహకారంతో 2028 డిసెంబరు వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం జలజీవన్ మిషన్-2.0 కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.30,156 కోట్లతో పనులు చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ అందించడంతో పాటు నీటి సరఫరా వ్యవస్థను పటిష్ఠం చేయడం, ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైపులైన్ నెట్‌వర్క్ విస్తరణకు ప్రాధాన్యత ఇస్తోంది.

94.82 లక్షల కుటుంబాలకు కుళాయి నీరు లక్ష్యం

రాష్ట్రవ్యాప్తంగా 94.82 లక్షల గ్రామీణ కుటుంబాలకు ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా 13,075 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, 24,601 ఆవాసాలకు నీటి సరఫరా వ్యవస్థల ఏర్పాటు, 77,243 కిలోమీటర్ల పైపులైన్ నెట్‌వర్క్ పనులను చేపట్టింది. సింగిల్ విలేజ్ స్కీమ్, మల్టీ విలేజ్ స్కీమ్‌ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలను విస్తరిస్తోంది. మొత్తంగా 41,809 పనులను చేపట్టగా, ఇప్పటి వరకు 27,301 పనులు పూర్తయ్యాయి. మరో 14,508 పనులు వివిధ దశల్లో పురోగతిలో ఉన్నాయి. ప్రతీ గ్రామానికీ నిరంతర నీటి సరఫరా, ప్రతీ ఇంటికీ కుళాయి కనెక్షన్, భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా తాగునీటి వనరుల అభివృద్ధి వంటి అంశాలపై దృష్టి సారిస్తోంది. గతంలో నిర్లక్ష్యంతో నిలిచిపోయిన జలజీవన్ మిషన్‌కు ఇప్పుడు కొత్త ఊపిరి పోస్తూ.. గ్రామీణ ప్రజల దాహార్తి తీర్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోంది.

ప్రభుత్వాల పనితీరును అంచనా వేయాల్సింది మాటలతో కాదు... ప్రజలకు అందిన ఫలితాలతో... కాబట్టి గత ఐదేళ్లలో ఏం జరిగింది? ప్రస్తుతం ఏం జరుగుతోంది? భవిష్యత్తులో గ్రామీణ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాబోతోంది? అనే అంశాలను ప్రజలు బేరీజు వేసుకోవాలి. తాగునీరు వంటి కనీస అవసరాలను నిర్లక్ష్యం చేసే పాలనకు, అభివృద్ధి పనుల పురోగతికి మధ్య ఉన్న తేడాను గుర్తించి, ప్రజా సంక్షేమం, జవాబుదారీతనం, అభివృద్ధికి ప్రాధాన్యతనిచ్చే కూటమి ప్రభుత్వ పాలనను ప్రజలు కోరుకుంటున్నారు.





స్థానిక ఎన్నికల్లో కూటమికి ప్రజల బ్రహ్మరథం

● రెండున్నరేళ్ల పాలనకు ఫలితాలే నిదర్శనం.. 2029లోనూ కూటమిదే అధికారం
● ప్రజల కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తాం: మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి

ఒంగోలు (చైతన్యరథం): స్థానిక ఎన్నికల్లో కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని, ఈ ఫలితాలు కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనకు నిదర్శనమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. శుక్రవారం ఒంగోలులోని టీడీపీ కార్యాలయం వద్ద మీడియాతో మాట్లాడుతూ, ప్రజలు ప్రభుత్వ పనితీరును గుర్తించి కూటమికి మద్దతు తెలిపారని పేర్కొన్నారు.

తాము దౌర్జన్యాలకు పాల్పడి ఉంటే రాష్ట్రంలో వైసీపీ ఒక్క ఎంపీటీసీ స్థానంలో కూడా గెలిచేది కాదని మంత్రి వ్యాఖ్యానించారు. కూటమి కార్యకర్తలపై దాడులకు పాల్పడిన వారే తిరిగి తమపై దాడులు జరిగాయని ఆరోపిస్తూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా, సంతృప్తిగా ఉన్నారని అన్నారు.

సూపర్ సిక్స్ హామీలతో పాటు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ రెండున్నరేళ్లలోనే అమలు చేశామని మంత్రి తెలిపారు. తాజా ఎన్నికల ఫలితాలతో తమ బాధ్యత మరింత పెరిగిందని, ప్రజల కోసం రెట్టింపు ఉత్సాహంతో పనిచేస్తామని చెప్పారు. ప్రజల ఆశీస్సులతో 2029లోనూ కూటమి అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.



నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించండి

- **అనంతపురం జెడ్పీ నూతన పాలకవర్గానికి మంత్రి కేశవ్ సూచన**
- **జెడ్పీ చైర్‌పర్సన్‌గా గంజి నాగరాజు, వైస్ చైర్‌పర్సన్‌గా వెన్నపూస లలిత ఏకగ్రీవం**



అనంతపురం(చైతన్యరథం): ప్రజాసేవను బాధ్యతగా స్వీకరించి నిష్పక్షపాతంగా విధులు నిర్వర్తించాలని అనంతపురంజిల్లా పరిషత్ నూతన పాలకవర్గానికి రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఉద్బోధించారు. అనంతపురం నగరంలోని జిల్లా ప్రజాపరిషత్‌లో శుక్రవారం జెడ్పీ చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక జరిగింది. ఇందుకోసం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఇందులో జిల్లా కలెక్టర్, ప్రిసైడింగ్ అధికారి ఓ.ఆనంద్, అసిస్టెంట్ కలెక్టర్ సుయాష్‌కుమార్, జిల్లా పరిషత్ సీఈఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. ఆయా మండలాల నుంచి ఎన్నికల్లో గెలుపొందిన జెట్పీటీసీసభ్యుల చేత జిల్లా కలెక్టర్ ప్రమాణ స్వీకారం చేయించి చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక గురించి విధివిధానాలు జడ్పి సిఈఓ వివరించారు.

ఈ కార్యక్రమంలో ఎక్స్ అఫిషియో సభ్యుడు, మంత్రి కేశవ్‌తోపాటు ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, ఎంపీ అంబికా లక్ష్మీ నారాయణ, ఎమ్మెల్సీ దళవాయి రమాదేవి, అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, సింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ పూల నాగరాజు, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో గార్లదిన్నె జెడ్పీటీసీ గంజి నాగరాజును జిల్లా పరిషత్ చైర్ పర్సన్‌గా యాడికి మండల జెడ్పీటీసీ ప్రతిపాదించారు. ఒకే వ్యక్తి చైర్మన్‌గా పోటీ చేయడంతో చైర్ పర్సన్‌గా గంజి నాగరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వైస్ చైర్మన్ పోస్టుకు వెన్నపూస లలితను బ్రహ్మసముద్రం మండలం జెడ్పీటీసీ పాలకొండ శ్రీరాములు ప్రతిపాదించారు. యల్లనూరు మండలం జెడ్పీటీసీ దీనిని బలపరిచారు. రెండవ అభ్యర్థి లేకపోవడంతో వెన్నపూస లలితను వైస్ చైర్‌పర్సన్‌గా డిక్లేర్ చేశారు.అనంతరం చైర్ పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకారం చేశారు. నూతన జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్ పర్సన్‌లను మంత్రి కేశవ్ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. నిష్పక్షపాతంగా ప్రజలకు సేవ చేయాలని మంత్రి సూచించారు. అనంతరం జెడ్పీటీసీలను వారి స్థానాల వద్దకే వెళ్లి మంత్రి అభినందించారు.

పథకం ప్రకారమే సింహాద్రిపురంలో

వైసీపీ మూకల అల్లర్లు

- **హౌస్ అరెస్ట్ నోటీసులను ధిక్కరించి 35 కార్లతో ఎంపీ అవినాష్‌రెడ్డి స్వైరవిహారం**
- **ఎన్నికలు ముగిసే వరకు రాష్ట్రం నుండి బహిష్కరించాలన్న ఎమ్మెల్సీ వర్ల రామయ్య**
- **సొంత ఛానల్‌లో జగన్‌రెడ్డి అసత్య ప్రచారం**
- **తాడిపత్రి రాళ్లదాడి, పల్నాడు హింస, గుంటూరు జైలు ఘటనలపై కఠిన చర్యలు తీసుకోవాలి**
- **అన్నమయ్య జిల్లాలో టీడీపీ నేత చెవి కొరికిన దుశ్చర్యపై సమాధానం చెప్పాలి**
- **ఎన్నికల కోడ్ ఉల్లంఘించి, దాడులకు పాల్పడిన వైసీపీపై ఎస్ఈసీకి టీడీపీ నేతల ఫిర్యాదు**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు ఓటమి భయంతో ఎన్నికల కోడ్‌ను యథేచ్ఛగా ఉల్లంఘిస్తూ దాడులకు తెగబడుతున్నారని తెలుగుదేశం పార్టీ ఆరోపించింది. ఈ మేరకు ఎమ్మెల్సీ వర్ల రామయ్య నేతృత్వంలోని టీడీపీ ప్రతినిధి బృందం శుక్రవారం రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యదర్శి ఏ. మల్లిఖార్జున, ఐజీ రాజకుమారిలను కలిసి సమగ్రమైన లిఖితపూర్వక ఫిర్యాదును అందజేసింది. ఈ బృందంలో మాజీ ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు, ఏపీఈడబ్ల్యూఐడీసీ చైర్మన్ ఎస్. రాజశేఖర్, ఏపీ బయోడైవర్సిటీ చైర్మన్ నీలాయపాలెం విజయ్‌కుమార్, బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ బుచ్చి రాంప్రసాద్ ఉన్నారు. కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురంలో 144 సెక్షన్, హౌస్ అరెస్ట్ నోటీసులను సైతం లెక్కచేయకుండా ఎంపీ అవినాష్ రెడ్డి 50 వాహనాల కాన్వాయ్‌తో హల్‌చల్ చేశారని టీడీపీ పేర్కొంది. సింహాద్రిపురం, అంకాలమ్మ గూడూరు నామినేషన్ కేంద్రాల వద్ద ఉద్రిక్తతలు సృష్టించి, ఎంపీ అవినాష్‌రెడ్డి, దుష్యంత్ రెడ్డిల ఆధ్వర్యంలో టీడీపీ శ్రేణులపై ముందస్తు ప్రణాళికతో దాడి చేశారని ఆరోపించింది. తొండూరు మండలం ఆగూడూరులో జరిగిన దాడిలో సింహాద్రిపురం మార్కెట్ యార్డ్ చైర్మన్ బండి రామసూరా రెడ్డి, నేత తులసీనాథ్ రెడ్డిలకు తీవ్ర గాయాలయ్యాయని తెలిపింది. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో వైసీపీ మూకలు రెచ్చిపోయి, కేతిరెడ్డి పెద్దారెడ్డి ఇంటి పైనుంచి టీడీపీ కార్యకర్తలపై రాళ్ల దాడికి పాల్పడ్డాయని, ఈ ఘటనలో పలువురికి గాయాలయ్యాయని టీడీపీ ఆరోపించింది. అంతేకాకుండా, టీడీపీపై నెపం నెట్టే కుట్రతో వైసీపీ వారే వాహనాలకు నిప్పు పెట్టి, ఇళ్లపై దాడులు చేస్తూ విధ్వంసం సృష్టించారని ఫిర్యాదులో పేర్కొంది. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం తూముకుంటలో నామినేషన్ వేసేందుకు వెళ్లిన టీడీపీ నేత రఘుపతి నాయుడిపై వైసీపీ నేత రామ్మోహన్ నాయుడు దాడి చేశారని టీడీపీ నేతలు తెలిపారు. రఘుపతి నాయుడి నామినేషన్ పత్రాలను చించేయడమే కాకుండా, ఆయన కుడి చెవిని కొరికి తీవ్రంగా గాయపరిచారని, ఇంత జరిగినా నిందితుడిపై పోలీసులు ఇప్పటికీ కేసు నమోదు చేయలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపీ అవినాష్ రెడ్డిపై పెట్రోల్ బాంబులు విసిరారంటూ 'సాక్షి' టీవీలో తప్పుడు ప్రచారం చేస్తూ ప్రజలను, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని టీడీపీ నేతలు మండిపడ్డారు. నామినేషన్లు వేయకుండా అడ్డుకునేందుకే ఇలాంటి కుట్రలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కడప, రాజంపేట, అన్నమయ్య, కర్నూలు, అనంతపురం వంటి సమస్యాత్మక జిల్లాల్లో నిఘాను మరింత పెంచాలని, ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వైసీపీ నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ బృందం విజ్ఞప్తి చేసింది. ఈ దాడులకు సంబంధించిన వీడియో ఆధారాలతో కూడిన పెన్ డ్రైవ్‌లను ఎన్నికల సంఘం అధికారులకు అందజేసింది.

దాడి జరిగిందంటూ డ్రామాలు

ఎస్ఈసీని కలిసిన అనంతరం ఎమ్మెల్సీ వర్ల రామయ్య మీడియాతో మాట్లాడుతూ..స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో ఆ పార్టీ శ్రేణులు రాష్ట్రవ్యాప్తంగా అరాచకాలు, స్టేజ్ మేనేజ్డ్ డ్రామాలకు తెరలేపాయని తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. స్థానిక ఎన్నికల్లో ఎలాంటి ప్రమేయం లేనందున ఇంటి నుంచి బయటకు రావద్దని తెల్లవారుజామునే పోలీసులు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డికి హౌస్ అరెస్ట్ నోటీసులు జారీ చేశారు. సంతకం చేసి నోటీసు తీసుకున్న ఆయన, ఆ తర్వాత పోలీసుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ 35 కార్ల కాన్వాయ్‌తో బయటకు వచ్చారు. మా పార్టీ నాయకుడు బీటెక్ రవి స్వగ్రామమైన సింహాద్రిపురం దాటి వెళ్తున్న సమయంలో కావాలనే కాన్వాయ్ ఆపి.. తమపై పెట్రోల్ బాంబులు, రాళ్లు, సోడా సీసాలు, ఐరన్ రాడ్లతో దాడి జరిగిందంటూ ఒక కట్టుకథ అల్లారు. అక్కడ టీడీపీ నాయకులు ఎవరూ లేకపోయినా, ఎలాంటి దాడి జరగకపోయినా 'సాక్షి' ఛానల్ ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు. చట్టాలను తయారు చేసే ఒక పార్లమెంటు సభ్యుడిగా ఉండి, అవినాష్ రెడ్డి పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారుల పట్ల అత్యంత అమర్యాదకరంగా, అన్ పార్లమెంటరీ భాషలో మాట్లాడారు. దీనికి సంబంధించిన వీడియోలను ఎన్నికల కమిషన్‌కు సమర్పించాం. ఒక ఎంపీ వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అంటూ దీనికి జగన్ మోహన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

పల్నాడు జిల్లా పెద్దకూరపాడులో వైసీపీ మహిళలతో మా కార్యకర్తల కళ్లలో కారం చల్లించి దాడులు చేయించారు. అలాగే, పోలింగ్ స్టేషన్ వద్ద మా పార్టీ నాయకుడిపై వైసీపీ నేత ఒకరు 'పుష్ప-2' సినిమా తరహాలో విచక్షణారహితంగా దాడి చేసి చెవి కొరికేశారు. ఇవి రాజకీయాలా లేక మృగాల ప్రవర్తనా? పల్నాడు దాడిలో తల పగిలి ఆసుపత్రిలో చావుబతుకుల మధ్య ఉన్న మా కార్యకర్తపై దాడి కేసును హత్యాయత్నం (307) కింద మార్చాలి.

గుంటూరు జైల్లో ఉన్న లేళ్ల అప్పిరెడ్డిని పరామర్శించడానికి వెళ్లిన సమయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి అనుచరులతో కలిసి దౌర్జన్యంగా, దొమ్మీగా లోపలికి ప్రవేశించారు. వారిపై తక్షణమే కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలి. ప్రభుత్వ ఉత్తర్వులను, పోలీసుల నోటీసులను ధిక్కరించి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ఎంపీ అవినాష్ రెడ్డిని తక్షణమే ప్రివెంటివ్ డిటెన్షన్ కింద అదుపులోకి తీసుకోవాలి.

జిల్లా కలెక్టర్ తన మెజిస్ట్రేట్ అధికారాలను ఉపయోగించి, ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు (డిసెంబర్ 3 వరకు) ఆయనను కడప జిల్లాలో, అవసరమైతే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే ఉండకుండా ఢిల్లీకి పంపించేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఎన్నికల కమిషన్‌ను కోరాం.

ఈ అంశంపై న్యాయ నిపుణులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని కమిషన్ సానుకూలంగా స్పందించింది. 40 ఏళ్ల వైఎస్ కుటుంబ అరాచకాలకు చరమగీతం పాడుతూ పులివెందుల ప్రజలు తీర్పు ఇచ్చినా జగన్ మోహన్ రెడ్డిలో మార్పు రాలేదని వర్ల రామయ్య విమర్శించారు. ఇప్పటికైనా జగన్ మోహన్ రెడ్డి ఆత్మపరిశీలన చేసుకొని, ఈ హత్య రాజకీయాలకు, దౌర్జన్యాలకు స్వస్తి పలకాలని, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని ఆయన హితవు పలికారు. వైసీపీ చేస్తున్న ఈ స్టేజ్ మేనేజ్డ్ డ్రామాలను, హింసాత్మక రాజకీయాలను రాష్ట్ర ప్రజలందరూ గమనించాలని కోరారు.



చైతన్యరథం

ప్రజా తీర్పును జీర్ణించుకోలేక పులివెందులలో

గొడ్డలి పార్టీ అలజడి

- ఈవీఎంలైనా, బ్యాలెట్టైనా ప్రజా మద్దతు కూటమికే
- అల్లర్లు సృష్టించి.. టీడీపీపై నిందలు నెట్టేందుకు వైసీపీ కుట్ర
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు



అమరావతి (చైతన్యరథం): ఇటీవల జరిగిన నగరపాలక సంస్థలు, మున్సిపాలిటీలు, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీలకు ప్రజలు అండగా నిలిచి సుమారు 95 శాతం విజయాలను అందించారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఈ ప్రజా తీర్పును జీర్ణించుకోలేక గొడ్డలి పార్టీ నేతలు గ్రామ పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పులివెందులలో కావాలనే అలజడి సృష్టిస్తూ, ఆ నెపాన్ని టీడీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాస్వామ్యబద్ధంగా సాగుతుంటే, పులివెందులలో మాత్రమే వివాదాలు, ఘర్షణలకు ఎందుకు తెరలేపుతున్నారని ప్రశ్నించారు.

గత నాలుగు దశాబ్దాలుగా భయాందోళనల కారణంగా పోలింగ్ కేంద్రాలకు రావడానికి వెనుకాడిన పులివెందుల ప్రజలు, కూటమి ప్రభుత్వంలో తొలిసారిగా ధైర్యంగా పోలింగ్ కేంద్రాలకు చేరుకుని స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవడం ప్రజాస్వామ్యానికి నిదర్శనమన్నారు. ప్రజలు భయాన్ని వీడి ఓటు వేయడాన్ని కూడా గొడ్డలి పార్టీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. 2024లో ఈవీఎంల ద్వారా జరిగిన ఎన్నికల్లో కూటమికి మద్దతు తెలిపిన ప్రజలు, ప్రస్తుతం బ్యాలెట్ ద్వారా జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ అదే మద్దతును కొనసాగిస్తున్నారని పేర్కొన్నారు.

సింహాద్రిపురంలో ప్రశాంతంగా సాగుతున్న గ్రామ పంచాయతీ నామినేషన్ల ప్రక్రియలో కడప ఎంపీ, వైసీపీ నేత వైఎస్ అవినాష్ రెడ్డి అనవసరంగా జోక్యం చేసుకోవడం ఏమిటని పల్లా ప్రశ్నించారు. సుమారు 50-70 వాహనాలతో నామినేషన్ల కేంద్రం వద్దకు చేరుకుని అలజడి సృష్టించాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. సింహాద్రిపురం పరిధిలోని ఆరు గ్రామ పంచాయతీల ఎన్నికల వ్యవహారాల్లో స్థానిక ఓటరు కాని ఎంపీ అవినాష్ రెడ్డి జోక్యం చేసుకోవడం ఎందుకని ప్రశ్నించారు. స్థానికులెవరూ మద్దతు కోరని పరిస్థితుల్లో గ్రామస్థులు పరస్పరం చర్చించుకుని తీసుకునే నిర్ణయాలను అడ్డుకునే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు. ఏకగ్రీవాలను అడ్డుకునేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం, హైకోర్టు, ఫిర్యాదుల పేరుతో రాజకీయాలు చేయడం తగదని వ్యాఖ్యానించారు.

హత్యాయత్నం కేసులో నిందితులుగా ఉన్నవారిని వెంటబెట్టుకుని సింహాద్రిపురానికి రావాల్సిన అవసరం ఏమిటని ప్రశ్నించారు. అగుడూరు దాడి ఘటనలో పాల్గొన్నవారినే వెంట తీసుకొచ్చి సింహాద్రిపురంలోనూ అలజడి సృష్టించేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలపై పల్లా ఆందోళన వ్యక్తం చేశారు. డీఎస్పీని సైతం బెదిరించే ధోరణి ప్రదర్శించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. వైసీపీ నేత దుష్యంత్ రెడ్డి ప్రోద్బలంతోనే ఈ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయని, ఇలాంటి దౌర్జన్యాలు, ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని పల్లా శ్రీనివాసరావు హెచ్చరించారు.

పులివెందులలో ఎవరైనా స్వేచ్ఛగా నామినేషన్లు వేసుకోవచ్చని, ఎన్నికల్లో పోటీ చేసే హక్కును అడ్డుకోవాలన్న ఉద్దేశం టీడీపీకి లేదని పల్లా స్పష్టం చేశారు. అయితే గ్రామాల్లో ప్రశాంతతను చెడగొట్టి ఫ్యాక్షన్ రాజకీయాలకు తెరలేపాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రశాంతంగా ఎన్నికలు జరుగుతుంటే పులివెందులలో మాత్రమే గొడవలు సృష్టించి, తిరిగి టీడీపీపై నిందలు వేయడం గొడ్డలి పార్టీ నేతల ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ప్రజలు ప్రతి పరిణామాన్ని నిశితంగా గమనిస్తున్నారని, ఎవరు ప్రశాంత ఎన్నికలను కోరుకుంటున్నారు.. ఎవరు అలజడులు సృష్టిస్తున్నారో వారికి స్పష్టంగా తెలుసన్నారు. ఈవీఎంలైనా, బ్యాలెట్టైనా ప్రజల తీర్పు కూటమికే అనుకూలంగా ఉంటోందని, ప్రజాస్వామ్యాన్ని అడ్డుకోవాలని, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తే ప్రజలే తగిన సమాధానం చెబుతారని పల్లా శ్రీనివాసరావు స్పష్టం చేశారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై..

కాకి లెక్కలతో జగన్ రాద్ధాంతం

- నాడు జగన్ ఇచ్చింది గోరంత.. నేడు లోకేష్ ఇస్తున్నది కొండంత
- నాలుగు క్వార్టర్ల నిధులు పూర్తిగా ఎగ్గొట్టి, దొంగ బటన్లు నొక్కారు
- జగన్ బకాయిల భారం మొత్తం రూ.3,300 కోట్లు
- అవి చెల్లిస్తూనే.. వ్యవస్థను గాడిలో పెట్టిన కూటమి ప్రభుత్వం
- ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్



అమరావతి (చైతన్యరథం): బెంగళూరులో పని లేక ఖాళీగా కూర్చున్న వైఎస్ జగన్మోహన్ రెడ్డి, సాక్షి పత్రికను అడ్డుపెట్టుకుని ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై అంకెల గారడీతో విషప్రచారం చేస్తున్నారని ఏపీ బయోడైవర్సిటీ బోర్డు ఛైర్మన్ నీలాయపాలెం విజయ్ కుమార్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... డీఎస్సీ నియామకాలపై బురద చల్లాలని చూసి భంగపడ్డ జగన్, నేడు విద్యార్థులు, తల్లిదండ్రులలో లేనిపోని అపోహలు సృష్టించి కూటమి ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలని చూస్తున్నారని మండిపడ్డారు. 2014-19 మధ్య టీడీపీ హయాంలో 16 లక్షల మంది విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందిస్తే, జగన్ అధికారంలోకి వచ్చాక నిబంధనల పేరుతో కోతలు పెట్టి లబ్ధిదారుల సంఖ్యను 9 లక్షలకు కుదించారని, దాదాపు 7 లక్షల మంది పేద విద్యార్థులకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. ఉన్నత చదువులు చదివే పేద విద్యార్థుల పొట్టకొడుతూ పీజీ కోర్సులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దు చేసిన దుర్మార్గ చరిత్ర జగన్‌దేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్ కన్నా ఎక్కువే ఇస్తున్నాం

వైసీపీ ఎమ్మెల్యేలు శాసనసభలో అడిగిన ప్రశ్నకు ఆర్థిక శాఖ ఇచ్చిన అధికారిక సమాధానమే జగన్ అసమర్థతకు నిలువెత్తు నిదర్శనమని విజయ్ కుమార్ గణాంకాలతో సహా వివరించారు. 2019-24 మధ్య ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం విడుదల చేసింది కేవలం రూ. 10,149.63 కోట్లు మాత్రమేనని, అంటే నెలకు సగటున రూ. 169 కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రతినెలా రూ. 250 కోట్ల నుంచి రూ. 300 కోట్ల వరకు క్రమం తప్పకుండా విడుదల చేస్తోందని, గత ప్రభుత్వంతో పోలిస్తే నెలకు కనీసం రూ. 80 కోట్లకు పైగా అదనంగా చెల్లిస్తోందని స్పష్టం చేశారు. విద్యా సంవత్సరానికి, ఆర్థిక సంవత్సరానికి తేడా తెలియని జగన్.. అధికారం నుంచి దిగిపోతూ రూ. 2,832 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలతో పాటు పీజీ కళాశాలలకు చెల్లించాల్సిన రూ. 450 కోట్లు కలిపి మొత్తం రూ. 3,300 కోట్ల బకాయిల భారాన్ని కూటమి ప్రభుత్వంపై మోపి వెళ్లారని మండిపడ్డారు.

కేటాయింపుల్లో చూపించి మొండిచేయి

2019-20 బడ్జెట్‌లో రూ. 3,241 కోట్లు కేటాయించినట్లు గొప్పలు చెప్పి, వాస్తవంగా ఖర్చు చేసింది కేవలం రూ. 834.13 కోట్లు మాత్రమే. 2020-21లో రూ. 3,120 కోట్లు చూపించి రూ. 1,862.25 కోట్లు, 2021-22లో రూ. 2,540 కోట్లు కేటాయించి రూ. 2,102 కోట్లు మాత్రమే విడుదల చేశారని వివరించారు. పీజీ కళాశాలల యాజమాన్యాలను ఉన్నత విద్యా మండలి ద్వారా బెదిరించి వన్ టైమ్ సెటిల్మెంట్ పేరుతో 75 శాతమే తీసుకుంటామని బలవంతపు లేఖలు రాయించుకుని, చివరకు ఆ మొత్తాన్ని కూడా ఎగ్గొట్టారని ఆరోపించారు.

తప్పుడు లెక్కలు కట్టిపెట్టాలి

గత వైసీపీ పాలనలో తల్లుల ఖాతాల పేరిట పెట్టిన తిరకాసు వల్ల కాలేజీలకు ఫీజులు అందక విద్యార్థులు తీవ్ర వేధింపులకు గురయ్యారని విజయ్ కుమార్ గుర్తుచేశారు. శ్రీకాకుళంలో ఫీజు బకాయిల కోసం ఒక యువతి పోలీస్ స్టేషన్ ముందే కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నం చేయడం, విజయవాడ, చిత్తూరులో విద్యార్థులకు కాలేజీలు లీగల్ నోటీసులు ఇవ్వడం, నెల్లూరు జిల్లా కావలిలో 30 మంది నర్సింగ్ విద్యార్థులను బయటకు పంపేయడం వంటి ఘటనలు జగన్ పాలనా వైఫల్యాలకు సాక్ష్యాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గత ప్రభుత్వ పాపాల వల్ల కళాశాలల్లో నిలిచిపోయిన 10 లక్షల మంది విద్యార్థుల సర్టిఫికెట్లను విడుదల చేయించిందని తెలిపారు. నేడు నేరుగా కళాశాలల ఖాతాలకే ఫీజులు జమ చేస్తూ విద్యార్థులపై ఎలాంటి ఒత్తిడి లేకుండా విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పారదర్శక పాలన అందిస్తున్నారని కొనియాడారు. ఇటీవల జరిగిన మున్సిపల్, జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజలు కూటమికి ఘనవిజయం కట్టబెట్టారని, ఇకనైనా జగన్ తప్పుడు రాతలు, దొంగ లెక్కలు మానుకుని ప్రశాంతంగా చదువుకుంటున్న విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దని నీలాయపాలెం విజయ్ కుమార్ హితవు పలికారు.

మళ్లీ జగన్.. క్రెడిట్ చోరీ ఏడుపులు

- రామాయపట్నం పోర్టుకు కస్టమ్స్ గుర్తింపుపై సోషల్ మీడియాలో స్పందన
- తన హయాంలోనే పోర్టుల నిర్మాణం జరిగిందని పచ్చి అబద్ధాలు
- పోర్టుల ఆలోచనకు తానే ఆద్యుడినంటూ గొప్పలు
- జగన్ నిర్వాకంవల్లే మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట పోర్టుల నిర్మాణంలో జాప్యం
- అది మరిచి గొడ్డలిపార్టీ అధినేత సొంత డప్పు

అమరావతి (చైతన్యరథం): అధికారంలో ఉన్నప్పుడు విధ్వంసం తప్ప అభివృద్ధి లేదు. ప్రజలిచ్చిన అధికారాన్ని కక్ష సాధింపులకు వాడుకున్న పైశాచికత్వం. దోపిడీ తప్ప రాష్ట్ర ప్రయోజనాలు పట్టని విచ్చలవిడి బరితెగింపు. కొత్త పరిశ్రమలు తేకపోగా ఉన్నవాటినీ తరిమేసిన శాడిజం. ఐదేళ్ల పాటు పంటిబిగువున బాధల్ని భరించిన ప్రజలు గత సార్వత్రిక ఎన్నికల్లో చెప్పిన గుణపాఠంతో గొడ్డలిపార్టీ భూస్థాపితం. జగన్ రెడ్డి పాలనలో కనీవినీ ఎరుగని విధ్వంసానికి గురైన రాష్ట్ర పునర్నిర్మాణానికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ఒక్కో ఇటుకా పేర్చుకుంటూ వస్తోంది. జగన్ హయాంలో తరలిపోయిన ప్రాజెక్టులే కాకుండా.. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన విధానాలతో కొత్త పెట్టుబడులను భారీగా ఆకర్షిస్తోంది. అంతే కాకుండా రాష్ట్రంలో భారీస్థాయిలో అభివృద్ధి పనులు చేపట్టి, శరవేగంతో పూర్తిచేసి ప్రారంభిస్తోంది.

తన హయాంలో పాతాళంలోకి కూరుకుపోయిన రాష్ట్రం తిరిగి పుంజుకుని తలెత్తుకుని సగర్వంగా నిలబడుతుంటే జగన్ రెడ్డి లోని సైకో నిద్ర లేస్తున్నాడు. ఏ భారీ పెట్టుబడి వచ్చినా... ఏ భారీ ప్రాజెక్ట్ ప్రారంభించినా అదంతా తన ఘనతే అని చెప్పుకుంటూ డప్పు కొట్టుకుంటూ... సొంత మీడియాలో పుంఖానుపుంఖాలుగా అసత్య కథనాలు వండివారుస్తున్నాడు. విశాఖలో గూగుల్ డేటా సెంటర్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, కడప స్టీల్ ఫ్యాక్టరీ తన వల్లే సాధ్యమయితే.. సీఎం చంద్రబాబు క్రెడిట్ చోరీ చేశాడంటూ ఏడ్పులతో గగ్గోలు పెట్టాడు. మొన్నటికి మొన్న యాక్సెస్ ఇన్ క్వాలిటీ ఇండెక్స్‌లో రాష్ట్రం 10వ స్థానం నుండి 3వ స్థానానికి ఎగబాకితే అది కూడా తన ఘనతే అంటూ జగన్ పిచ్చి ప్రేలాపనలు

ఇక ఇప్పుడు రామాయపట్నం పోర్టు వంతు వచ్చింది. కేంద్ర పరోక్ష పన్నులు, కస్టమ్స్ బోర్డు అధికారికంగా 'కస్టమ్స్ పోర్టు' హోదా కల్పిస్తూ నోటిఫికేషన్ జారీ చేయడంతో మరోసారి క్రెడిట్ వార్ మొదలెట్టాడు. దీనిపై సోషల్ మీడియా వేదికగా జగన్ రెడ్డి స్పందిస్తూ.. ఆంధ్రప్రదేశ్ సుదీర్ఘ తీరప్రాంతాన్ని సద్వినియోగం చేసుకునే 'పోర్ట్-లెడ్ ఇండస్ట్రియలైజేషన్' విజన్ తమదేనని, తాము ప్రారంభించిన 4 పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్ల వల్లే నేడు బీపీసీఎల్ రిఫైనరీ, ఇండోసోల్ సోలార్ వంటి భారీ పెట్టుబడులు వస్తున్నాయని ట్వీట్ చేశారు. అంతే కాకుండా దావోస్, సీఐఐ సదస్సుల్లో ప్రస్తుత కూటమి ప్రభుత్వం తాము నిర్మించిన పోర్టులనే చూపించి పెట్టుబడులు ఆకర్షిస్తోందంటూ ఆయన వ్యాఖ్యానించారు.

జగన్‌లో ఫ్రస్ట్రేషన్ పీక్స్‌కు చేరిందని, ఏదో భ్రమాలోకంలో ఉండి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని సామాన్య ప్రజలు కూడా సెటైర్లు వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు 974 కిలోమీటర్ల సుదీర్ఘ తీరప్రాంతం ఉందన్న విషయాన్ని ఏదో ఇప్పుడే తానే కొత్తగా కనిపెట్టినట్లుగా, రాష్ట్రంలో పోర్టుల ఆలోచనకు తానే ఆద్యుడినన్నట్లుగా జగన్ రెడ్డి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేస్తున్నారు.

వాస్తవానికి రామాయపట్నం, మచిలీపట్నం, భావనపాడు (మూలపేట) పోర్టుల ప్రతిపాదనలు దశాబ్దాల నాటివని, 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలోనే రామాయపట్నం పోర్టుకు, మచిలీపట్నం పోర్టుకు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు.

2019లో అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అప్పటికే ఉన్న ప్రతిపాదనలను, టెండర్లను రద్దు చేసి, పోర్టుల స్థలాలను, నిర్మాణ రీతులను మార్చడం వల్లే ప్రాజెక్టులు ఏళ్ల తరబడి ఆలస్యమయ్యాయని విమర్శకులు ఎత్తిచూపుతున్నారు. ఐదేళ్ల పాలనలో అరకొరగా పనులు చేయించి, కనీసం మౌలిక సదుపాయాలు కూడా పూర్తి చేయకుండా వదిలేసి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం కేంద్రంతో సమన్వయం చేసుకుంటూ అనుమతులు సాధిస్తుంటే, ఆ ఘనత అంతా తమదేనని చెప్పుకోవడం 'క్రెడిట్ చోరీ'కి పరాకాష్ట అని టీడీపీ నేతలు విమర్శిస్తున్నారు. ఏదేమైనా ఎగుమతులు, దిగుమతులకు మార్గం సుగమం చేస్తూ రామాయపట్నం పోర్టుకు కస్టమ్స్ హోదా లభించడం రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధికి శుభపరిణామమే.

తిరుమల శ్రీవారి ఆశీస్సులతో

నెల్లూరు అభివృద్ధికి శ్రీకారం

- కార్పొరేషన్ నూతన విజేతలతో కలిసి స్వామివారి దర్శనం: మంత్రి నారాయణ



తిరుమల (చైతన్యరథం): నెల్లూరు కార్పొరేషన్ నూతన విజేతలతో కలిసి తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని దర్శించుకోవటం ఎంతో సంతోషంగా ఉందని రాష్ట్ర పురపాలకశాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. వచ్చే సోమవారం జరగబోయే నెల్లూరు కార్పొరేషన్ కొత్తపాలక వర్గం ప్రమాణ స్వీకారానికి ముందు విజేతలతో కలిసి శుక్రవారం మంత్రి నారాయణ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఎన్ని కల్లో గెలుపొందిన విజేతలంతా కలిసి ఇలా దైవదర్శనం చేసుకోవడం ఎంతో ఆహ్లాదక రంగా,వారినూతన ఆరంభానికి శుభసూచ కంగా నిలిచింది. అందరూ కలిసికట్టుగా శ్రీవారి సన్నిధికి చేరుకోవడం అందరినీ ఆకట్టుకుంది.ఈ పవిత్ర సందర్భం కాబోయే పాలకవర్గంలో నూతనఉత్సాహాన్ని నింపింది. ప్రజా సేవలో పూర్తి అంకితభావంతో ముందుకు సాగడా నికి ఈ ఆధ్యాత్మిక అనుభూతి తమకు ఎంతో తోడ్పడుతుందని విజేతలు పేర్కొ న్నారు. స్వామివారి దివ్యాశీస్సులతో నగర అభివృద్ధిని మరింత వేగవంతం చేస్తామని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని వారు స్పష్టం చేశారు.

జెడ్పీ, ఎంపీపీ నియామకాల్లో...

మహిళలు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు పెద్దపీట

- 95% స్ట్రైక్ రేట్‌తో కూటమి ప్రభంజనం..
- బీసీలకు 35 శాతం సీట్లతో సామాజిక న్యాయం
- జనరల్ స్థానాల్లో సైతం బీసీలకు, ఎస్టీలకు అవకాశం
- 2021ఎన్నికల్లో వైసీపీ అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదు
- పులివెందుల, పుంగనూరులలోనూ స్వేచ్ఛగా ఎన్నికలు జరగడంతో వైసీపీని తిరస్కరించిన ప్రజలు
- రాష్ట్రంలో గొడ్డలిపార్టీ చిరునామా గల్లంతు
- మాజీ ఎమ్మెల్సీ పర్చూరి అశోక్ బాబు

అమరావతి (చైతన్యరథం): ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలు ప్రజాస్వామ్య చరిత్రలో ప్రత్యేకంగా నిలిచిపోతాయని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పర్చూరి అశోక్ బాబు పేర్కొన్నారు. మున్సిపాలిటీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తులు, గ్రామ పంచాయతీలు.. ఇలా స్థానిక పాలనకు సంబంధించిన అన్ని వ్యవస్థల్లో ప్రజాస్వామ్య బద్ధమైన ఎన్నికలు జరిగితేనే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అన్నారు. స్థానిక సంస్థలు సమర్థంగా పనిచేసినప్పుడే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గతంలో 2020-21లో జరిగిన ఎన్నికలకు, ఈసారి జరిగిన ఎన్నికలకు ఎంతో వ్యత్యాసం ఉందని, ఈ ఎన్నికలు స్వేచ్ఛాయుతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరగడం పట్ల తెలుగుదేశం పార్టీ గర్విస్తోందన్నారు. మహిళలకు గౌరవం, రాజకీయాల్లో సముచిత స్థానం కల్పించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని చెప్పారు. సామాజిక న్యాయం అంటే కేవలం పేదలకు ఆర్థిక సాయం చేయడం కాదని, అణగారిన, వెనుకబడిన వర్గాలకు రాజకీయ అధికారం, నిర్ణయాధికారం కల్పించడమే నిజమైన సామాజిక న్యాయమని స్పష్టం చేశారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 35 శాతం ప్రాతినిధ్యం కల్పిస్తామని ప్రకటించడమే కాకుండా, చట్టపరమైన రిజర్వేషన్లు లేని జనరల్ స్థానాల్లోనూ వారికి అవకాశాలు కల్పిస్తామని ఇచ్చిన మాటను తెలుగు దేశం పార్టీ నిలబెట్టుకుందని తెలిపారు. మహిళలకు గౌరవం, బీసీలకు రాజకీయ అధికారం కల్పించడం ద్వారా కూటమి ప్రభుత్వం సామాజిక న్యాయానికి కట్టుబడి ఉందని అశోక్ బాబు పేర్కొన్నారు.

మహిళలు, బీసీలకు పెద్దపీట

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం దాదాపు 95 శాతం స్ట్రైక్ రేట్‌తో ఘనవిజయం సాధించిందని తెలిపారు. మున్సిపల్, జిల్లా పరిషత్, ఎంపీపీ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వ విధానాలకు, సామాజిక న్యాయానికి ప్రజలు సంపూర్ణ ఆమోదం తెలిపారని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా మహిళలకు రాజకీయ పదవుల్లో పెద్దపీట వేశామని ప్రకటించారు. మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్లలో 10 కార్పొరేషన్లను (59 శాతం), 106 మున్సిపాలిటీలలో 58 మున్సిపాలిటీలను మహిళలకే కేటాయించామని తెలిపారు. మేయర్లుగా, మున్సిపల్ చైర్మన్లుగా ఎన్నికైన మహిళల్లో దాదాపు సగం మందికి పైగా ఎలాంటి రాజకీయ నేపథ్యం లేనివారేనని ఆయన స్పష్టం చేశారు. ప్రజాసేవ చేయాలనే ఉత్సాహంతో ముందుకు వచ్చిన సామాన్యులకే అవకాశాలు కల్పించి, వారసత్వ రాజకీయాలను తెలుగుదేశం పార్టీ దాదాపుగా పక్కన పెట్టిందని తెలిపారు. కేవలం ప్రజల ఆదరణ ఉన్న ఒకటి రెండు చోట్ల మాత్రమే వారసులకు అవకాశం ఇచ్చామన్నారు. జిల్లాల సంఖ్య 28కి పెరిగిన నేపథ్యంలో తీవ్ర పోటీ నెలకొన్నప్పటికీ, జిల్లా పరిషత్ చైర్మన్ పదవుల్లో 56 శాతం మహిళలకు, 8 స్థానాలను బీసీలకు కేటాయించామని చెప్పారు. పరోక్ష ఎన్నిక అయినప్పటికీ మహిళలను జెడ్పీటీసీలుగా గెలిపించి చైర్‌పర్సన్‌లుగా ఎన్నుకున్నామని వివరించారు. అలాగే 630ఎంపీపీ స్థానాల్లోనూ మెజారిటీ స్థానాలు మహిళలకు దక్కాయని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు వారి జనాభా ప్రాతిపదికన న్యాయం చేశామని తెలిపారు. బీసీలకు 34 శాతం కంటే తగ్గకుండా, వీలైతే ఒక శాతం ఎక్కువగా 35 శాతం సీట్లు ఇస్తామన్న మాటను నిలబెట్టుకున్నామని అశోక్ బాబు అన్నారు. 17 కార్పొరేషన్లలో 6 కార్పొరేషన్లను బీసీలకు ఇచ్చామని, కొన్నిచోట్ల ఓసీ స్థానాలను సైతం బీసీలకు కేటాయించామని తెలిపారు. ఇది కేవలం అంకెల గారడీ కాదని, బీసీలలోని అన్ని ఉపకులాలను సంప్రదించి వారి రాజకీయ అనుభవాన్ని బట్టి పదవులు ఇచ్చామని స్పష్టం చేశారు. అభ్యర్థుల ఎంపికలో వయసు, విద్య, సామాజిక ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. కార్పొరేషన్లలో ఇప్పటివరకు వెలువడిన 13 ఫలితాల్లో 12 మంది 30 నుండి 50 ఏళ్ల లోపు వారేనని, ఒక్కరు మాత్రమే 50 ఏళ్లు దాటిన వారు ఉన్నారని చెప్పారు. మున్సిపాలిటీల్లో 68 మంది 30-50 ఏళ్ల మధ్య వారు కాగా, 18 మంది 50 ఏళ్లు పైబడిన వారు ఉన్నారని, కౌన్సిలర్లు, కార్పొరేటర్లుగా 25 ఏళ్ల లోపు యువత, మహిళలు పెద్ద సంఖ్యలో గెలిచారని వివరించారు. పార్టీ గుర్తుపై జరగని సర్పంచ్ ఎన్నికల్లోనూ స్థానిక గ్రామ పరిస్థితులకు అనుగుణంగా, ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా బీసీలకు, మహిళలకు తగిన ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి ఎమ్మెల్యేలందరికీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కోర్టు తీర్పులను సాకుగా చూపి 34 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడం వల్ల బీసీలు వేలాది పదవులను కోల్పోయారని అశోక్ బాబు విమర్శించారు. రాజకీయ చిత్తశుద్ధి ఉంటే కోర్టు తీర్పులతో సంబంధం లేకుండానే బలహీన వర్గాలకు న్యాయం చేయవచ్చని కూటమి ప్రభుత్వం నిరూపించిందన్నారు. కేవలం సంక్షేమ పథకాలతో జేబులు నింపడమే కాకుండా, బలహీన వర్గాలకు రాజ్యాధికారం కల్పించి రాజకీయ బలం ఇవ్వడమే నిజమైన సామాజిక న్యాయమని ఆయన స్పష్టం చేశారు.



వైసీపీ అడ్రస్ గల్లంతు

కూటమి ప్రభుత్వ నిబద్ధతకు ఎన్టీఆర్ జిల్లా, మంగళగిరి ఫలితాలే నిదర్శనమని అశోక్ బాబు పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లా గొట్టిముక్కలలో జనరల్ స్థానాన్ని ఒక ఎస్టీ మహిళకు కేటాయించి, ఆవిడను నేడు జిల్లా పరిషత్ చైర్మన్‌గా చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని తెలిపారు. అలాగే రాజధాని పక్కనే ఉన్న తాడేపల్లి-మంగళగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ పీఠాన్ని ఎస్టీ వర్గానికి కేటాయించడంతో ఆ వర్గాల ప్రజల్లో ఎంతో ఉద్వేగం, ఆనందం కనిపించాయన్నారు. రాయలసీమలో కోయ, వాల్మీకి, తదితర వర్గాల ఓటర్ల శాతాన్ని పరిగణనలోకి తీసుకుని, రాజకీయ నిర్ణయంతో వారికి సీట్లు కేటాయించామని చెప్పారు. చట్టపరమైన అడ్డంకులు ఉన్నా బీసీలకు 34 శాతం, మహిళలకు అగ్రపీఠం వేయాలన్న మాట కోసం కొన్నిచోట్ల సర్దుబాట్లు చేసుకోవాల్సి వచ్చిందన్నారు. పార్టీ ఆదేశాలను గౌరవించి పోటీ నుండి తప్పుకున్న వందలాది మంది నాయకులకు పార్టీ ఎప్పుడూ రుణపడి ఉంటుందని, అదే సమయంలో పార్టీ విప్‌ను ధిక్కరించి రెబల్స్‌గా పోటీ చేసి గెలిచిన వారిని సైతం ఏమాత్రం ఉపేక్షించకుండా సస్పెండ్ చేశామని స్పష్టం చేశారు. గత 2020-21 ఎన్నికల్లో వైసీపీ నేతలు బ్యాలెట్ పేపర్లు చించడం, దొమ్మీలు చేయడం, లేళ్ల అప్పిరెడ్డి వంటి వారు ఏకంగా బ్యాలెట్ బాక్సులు ఎత్తుకుపోవడం వంటి అరాచకాలకు పాల్పడ్డారని అశోక్ బాబు గుర్తు చేశారు. కానీ కూటమి ప్రభుత్వం పోలీసులకు పూర్తి స్వేచ్ఛనిచ్చిందని, ఏ పార్టీ వారైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించిందన్నారు. ప్రతీకార చర్యలకు దిగకుండా టీడీపీ కార్యకర్తలను సైతం పార్టీ కట్టడి చేసిందని, అయితే వైసీపీ నేతలు పోలీసుల స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తూ టీడీపీ కార్యకర్తలపై దాడులు చేసి తిరిగి వారే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని మండిపడ్డారు. గత ఎన్నికల్లో వైసీపీ చేసిన అరాచకాలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని, అందుకే ఈ ఎన్నికల్లో వారికి ఘోర పరాభవం ఎదురైందని అశోక్ బాబు అన్నారు. రాష్ట్రంలోని కార్పొరేషన్లలో కేవలం అనంతపురం మాత్రమే (అదీ స్థానిక అంతర్గత విభేదాల వల్ల) వైసీపీకి దక్కిందని, 87 మున్సిపాలిటీలలో కేవలం నాలుగు మాత్రమే గెలిచిందని (అందులో రెండు బొటాబొటి మెజారిటీతో), 28 జిల్లా పరిషత్తులలో ఒక్క స్థానంతోనే సరిపెట్టుకుందని వివరించారు. 600 పైచిలుకు ఎంపీపీలు, జెడ్పీటీసీలు, 6 వేలకు పైగా ఎంపీటీసీ స్థానాల్లో వైసీపీ ఎక్కడా కనిపించకుండా పోయిందని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం, సంక్షేమ పథకాల అమలు, అన్ని వర్గాలకు రాజ్యాధికారం కల్పించడమే కూటమి ప్రభుత్వ ఘనవిజయానికి కారణమని అశోక్ బాబు పునరుద్ఘాటించారు.

కూటమి ధర్మానికి కట్టుబడిన టీడీపీ

రాష్ట్రంలో కూటమి ధర్మాన్ని కాపాడే విషయంలో తెలుగుదేశం పార్టీ పెద్దన్న పాత్ర పోషిస్తోందని, బలాబలాలతో సంబంధం లేకుండా మిత్రపక్షాలను గౌరవిస్తూ పదవులు కేటాయించామని అశోక్ బాబు స్పష్టం చేశారు. కూటమిలో ఓట్లు, సీట్ల లెక్కల కంటే పార్టీల మధ్య ఉన్న ఐక్యత, ఇచ్చిపుచ్చుకునే హుందాతనమే ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. అందుకే ఒక్క ఎంపీటీసీ గెలిచిన చోట కూడా బీజేపీకి ఎంపీపీ పదవి ఇచ్చామని, నాలుగు జెడ్పీటీసీలు మాత్రమే వచ్చిన చోట కూడా ముందుగా అనుకున్న దామాషా ప్రకారం బీజేపీకి జిల్లా పరిషత్ చైర్మన్ పదవి ఇచ్చి గౌరవించామని తెలిపారు. ఇందుకు సహకరించిన అన్ని స్థాయిల నాయకులకు అభినందనలు తెలిపారు. 2029లో తామే వస్తామని, 'రఫ్ ఆడిస్తాం' అని మాట్లాడే వారికి ఈ స్థానిక ఎన్నికల ఫలితాలు గట్టి చెంపదెబ్బ అని అశోక్ బాబు విమర్శించారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడం వల్లే జగన్ సొంత నియోజకవర్గం పులివెందులతో పాటు పుంగనూరులోనూ ప్రజలు వైసీపీని తిరస్కరించారని చెప్పారు. పుట్టినరోజు వేడుకల పేరుతో మేక తలలు నరికి, ఫోటోలపై రక్తం చల్లే 'రప్పా రప్పా' బ్యాచ్ ఆటవిక పోకడలను ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. ఇప్పటికైనా వైసీపీ తమ తీరు మార్చుకోకపోతే 2029లో ప్రజలు మరోసారి బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. ఒక జిల్లాలో ఒకే కులం పెత్తనం చెలాయించే సంస్కృతికి కూటమి ప్రభుత్వం పూర్తిగా తెరదించిందని ఆయన స్పష్టం చేశారు. కేవలం సంక్షేమ పథకాలు ఇస్తే ఆర్థిక న్యాయం మాత్రమే జరుగుతుందని, జనాభా ప్రాతిపదికన రాజకీయ పదవులు ఇచ్చినప్పుడే నిజమైన సామాజిక న్యాయం జరుగుతుందని అశోక్ బాబు వివరించారు. ఈ ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీలతో పాటు ముస్లిం, క్రిస్టియన్ మైనారిటీలకు కూడా రాజకీయ అధికారంలో పూర్తి భాగస్వామ్యం కల్పించామన్నారు. గతంలో మహిళలకు ఇన్ని సీట్లు కేటాయిస్తే అభ్యర్థులు దొరుకుతారా అన్న ఆలోచన ఉండేదని, కానీ నేడు ఉన్న సీట్లు సరిపోనంత ఉత్సాహంగా మహిళలు రాజకీయాల్లోకి వస్తున్నారని అశోక్ బాబు హర్షం వ్యక్తం చేశారు. మహిళలకు ఆర్థిక, సామాజిక, భావ స్వాతంత్ర్యం లభించినప్పుడే వారు తమ సొంత శక్తిపై నిలబడగలుగుతారని పేర్కొన్నారు. జిల్లాల వారీగా స్థానిక అవసరాలను గుర్తించి అభివృద్ధి చేస్తూ, మరోవైపు అన్ని వర్గాలకు రాజకీయ అధికారం కల్పిస్తూ కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఆయన తెలిపారు. 2029 ఎన్నికల్లోనూ ఇదే ఉత్సాహం, ఇదే ఓటు శాతంతో కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వస్తుందని అశోక్ బాబు ధీమా వ్యక్తం చేస్తారు.

ప్రాథమిక దశలోనే
రొమ్ము క్యాన్సర్ గుర్తింపు

- **అందుబాటులోకి ఆధునిక పరీక్షా విధానం**
- **మంత్రి సత్యకుమార్ యాదవ్**



అమరావతి (చైతన్యరథం): రొమ్ము క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు సెన్సార్ల ఆధారంగా పనిచేసే ఆధునిక పరీక్షా విధానాన్ని అందుబాటులోకి తీసుకురానున్నారు. త్వరలో ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాలతో మహిళలకు రొమ్ము పరీక్షలు నిర్వహించనున్నారు. దేశంలోనే తొలిసారిగా రాష్ట్రవ్యాప్తంగా గ్రామస్థాయిలో లక్షలాది మంది మహిళలకు ఈ పరీక్షలు నిర్వహించేందుకు వైద్యారోగ్య శాఖ ఏర్పాట్లు చేస్తోంది. గ్రామాల్లోనే మహిళల ఇళ్ల వద్ద, విలేజ్ హెల్త్ క్లినిక్లలో ఈ పరీక్షలు నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు.

ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాల వినియోగంపై శిక్షణ పొందిన మహిళా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, అధికారులతో శుక్రవారం మంత్రి చర్చించారు. పరీక్షల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేపట్టాల్సిన చర్యలపై సమీక్షించారు. భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ సామాజిక బాధ్యత నిధుల కింద 750 ఐబ్రెస్ట్ ఎగ్జామ్ పరికరాలను వైద్యారోగ్య శాఖకు అందించేందుకు అంగీకరించింది. ఒక్కో పరికరం విలువ సుమారు రూ. 7.5 లక్షలు ఉంటుందన్నారు.

విశాఖ మేయర్ శ్రావణికి
పితృ వియోగం బాధాకారం

- ముత్యాల నాయుడు మృతి దిగ్భ్రాంతికి గురిచేసింది

- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా సంతాపం

విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖ నగర నూతన మేయర్ ముక్కా శ్రావణి తండ్రి, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాల నాయుడు మృతి చెందారన్న వార్త తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సంతాపం వ్యక్తం చేశారు. కుమార్తె మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసే శుభతరుణాన్ని చూడకుండానే ఆయన కన్నుమూయడం హృదయవిదారకమ న్నారు. ఈ విషాద సమయంలో ముక్కా శ్రావణికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను. ఈ అపారమైన దుఃఖాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు వారి కుటుంబానికి ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను. ముక్కా ముత్యాల నాయుడు గారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నానన్నారు.

27 జెడ్పీ పీఠాలపై కూటమి నేతలు

- ఎన్నికల ప్రక్రియ పూర్తి

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో 28 జిల్లా పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులకు ఎన్నికలు పూర్తయ్యాయి. 28 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవుల్లో ఒక్క అల్లూరు జిల్లా మినహా మిగతా 27 పదవులు కూటమి పార్టీలు దక్కించుకున్నాయి. ఈ మేరకు ఎన్నికల ప్రక్రియ పూర్తయినట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది. జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవుల్లో తెలుగుదేశం పార్టీ 22, జనసేన పార్టీ 4, బీజేపీ ఒక స్థానాన్ని దక్కించుకున్నాయి. దీంతో మొత్తం 27 జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవులు కూటమి ఖాతాలో చేరాయి. మరోవైపు అల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్‌గా వైసీపీకి చెందిన వంతల శాంతి ఎన్నికయ్యారు. జిల్లా పరిషత్ ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పేర్లు,వారు ప్రాతినిధ్యం వహిస్తున్నపార్టీల వివరాలనుకూడా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించింది.దీంతోరాష్ట్రవ్యాప్తంగా జిల్లాపరిషత్ ఎన్నికలప్రక్రియ ముగిసింది.

ఎల్ నినో ప్రమాదఘంటికలు మోగిస్తుంటే...
నీళ్ల పేరుతో రాజకీయాలా?

- **వైసీపీ నేత కాకాణిపై ఎమ్మెల్యే సోమిరెడ్డి ఆగ్రహం**
- **ఇరిగేషన్ పనులు చేయకుండానే రూ.150 కోట్లు దోచేసిన కాకాణి**
- **రైతుల గురించి మాట్లాడటమా**
- **జిల్లా నాశనం కాకాణి ఉద్దేశమైతే... రాష్ట్ర నాశనం కోరుకుంటున్న జగన్‌రెడ్డి, సాక్షి పత్రిక**
- **ఉమ్మడి ఏపీ నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో కీలక సాగునీటి ప్రాజెక్టులన్నీ టీడీపీ పుణ్యమే**
- **బిడ్డ పెళ్లికి సీఎం చంద్రబాబుని ఆహ్వానించిన షర్మిలపై దారుణరాతలు సాక్షి**

పైశాచికత్వానికి పరాకాష్ట

నెల్లూరు (చైతన్యరథం): ఒకపక్క ఎల్ నినో ప్రభావం ప్రమాద ఘంటికలు మోగిస్తుంటే.. మరోపక్క ఇరిగేషన్, సాగునీటి యాజమాన్యంపై ఎలాంటి అవగాహన లేని వైసీపీ నాయకుడు కాకాణి గోవర్ధన్ రెడ్డి నోటికొచ్చినట్టు మాట్లాడటం దురదృష్టకరమని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ధ్వజమెత్తారు. నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం మీడియాతో సోమిరెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లా నాశనమైపోవాలని కాకాణి, రాష్ట్రం నాశనం కావాలని జగన్ రెడ్డితో పాటు ఆయన పత్రిక సాక్షి కోరుకుంటున్నాయని మండిపడ్డారు. వైసీపీ అధికారంలో లేదని ప్రజలు, రాష్ట్రం నాశనం కావాలని కోరుకోవడం దుర్మార్గమన్నారు.

నిత్యం అబద్ధాలను వండి వార్చడమేనా...

చంద్రబాబు నాయుడొస్తే కరువొస్తుందని కారుకూతలు కూస్తున్నారు..అయితే జగన్ రెడ్డి వస్తే కరోనా వస్తుందా? కరువు వచ్చినా దాని ప్రభావం తాత్కాలికం. కరోనాతో రాష్ట్రంలో ఎన్ని వేల మంది ప్రాణాలు కోల్పోయారో, లక్షల కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయో చూశాం. సోమశిల జలాయశంలో ప్రస్తుతం 19 టీఎంసీలు మాత్రమే నీటి నిల్వ ఉంది. ఎల్ నినో ప్రమాదఘంటికలు మోగిస్తున్న సమయంలో నీళ్ల గురించి కాకాణి చాలా దుర్మార్గం మాట్లాడాడు. రెండో పంటకు 1.80 లక్షల ఎకరాలకు 74 టీఎంసీలు వాడేశారని కాకాణి మాట్లాడటం దారుణం. అసలు ఆయన మంత్రిగా ఎలా పనిచేశాడు...వ్యవసాయం అంటే తెలుసా...నీటి యాజమాన్యం గురించి కనీస అవగాహన ఉందా? సోమశిల నుంచి కేవలం 33 టీఎంసీలు మాత్రమే ఖర్చుపెట్టాం...చెరువులతో పాటు సర్వేపల్లి, కనిగిరి రిజర్వాయర్లలో నీళ్లున్నాయి. అన్నింటినీ సద్వినియోగం చేసుకుని 4 లక్షల ఎకరాల్లో పంట పండించాం..16 లక్షల పుట్ల పంట పండింది. పుట్టిని రూ.25 వేల నుంచి రూ.40 వేల వరకు రైతులు అమ్ముకున్నారు..కనీస ధర రూ.25 వేలు లెక్క వేసుకున్నా రూ.4 వేలు కోట్ల విలువైన పంట రైతుల చేతికొచ్చింది. నేడు పుట్టి ధాన్యం రూ.40 వేలు పలుకుతుండటంతో వైసీపీ నేతలతో పాటు సాక్షి కడుపుమంటతో రగిలిపోతోంది. నిత్యం ఏడుపులు తప్ప ఏ రోజైనా ధాన్యానికి మంచి ధర వచ్చింది, నిమ్మకాయలు రికార్డు స్థాయిలో ధర పలుకుతున్నాయని సాక్షిలో వార్తలు రాసిన పాపానపోయారా అని సోమిరెడ్డి నిలదీశారు.

4 లక్షల ఎకరాలు బీడు పెట్టించిన కాకాణి

2023లో కాకాణి మంత్రిగా ఉన్నాడు. రెండో పంటకు సంబంధించి 1.15 లక్షల ఎకరాలకు 30 టీఎంసీలు నీటిని వాడేసి, ఆ తర్వాత సీజన్ లో మొదటి పంటకు 3 లక్షల ఎకరాలకు మాత్రమే నీరిచ్చి 4 లక్షల ఎకరాలను బీడు పెట్టించారు. కండలేరు కింద అసలు నీరు ఇవ్వకపోగా, మిగిలిన అన్ని కాలువల కింద సగానికి సగం ఆయకట్టుకు నీరు ఇవ్వని పరిస్థితి. వైసీపీ పాలనలో పనులు చేయకుండానే ప్యాకేజీల పేరుతో రూ.150 కోట్లు బిల్లులు చేసుకుని రైతులకు తీరని ద్రోహం చేశారు. మా ప్రభుత్వం వచ్చాక కూడా కోర్టు ఆర్డర్ల పేరుతో బిల్లులు తెచ్చుకుంటున్నారు . రైతులను గుండెలో పెట్టుకుని చూసుకునే ప్రభుత్వం మాది...అన్నదాతకు అన్యాయం జరిగితే ఊరుకోం. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో గూడూరు డివిజన్ లో పంటలు ఎండిపోయే పరిస్థితి వస్తే శ్రీశైలం నుంచి 5 టీఎంసీలను తీసుకొచ్చి పైర్లను కాపాడాం. 78



టీఎంసీల నీటి నిల్వసామర్థ్యంతో సోమశిల జలాశయం ఉందంటే ఎన్టీ రామారావు, చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ పుణ్యమే. 68 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద మట్టికట్ట కలిగిన కండలేరు రిజర్వాయర్ ను మనకు అందించిన ఘనత కూడా టీడీపీదే. మొత్తం 146 టీఎంసీల సామర్థ్యం కలిగిన రెండు జలాశయాలను మనకు వరంగా అందించారు..ఉమ్మడి ఏపీలోనే ఇటువంటి అరుదైన అవకాశం ఏ జిల్లాకు లేదని సోమిరెడ్డి చెప్పారు.

ప్రాజెక్టుల ఘనత టీడీపీదే

వైసీపీ పాలనలో అన్నమయ్య డ్యాం తెగిపోయి 50 మంది ప్రాణాలు కోల్పోయారు...అలువంటి పరిస్థితి సర్వేపల్లి రిజర్వాయర్ రాకూడాదని రూ.50 కోట్లు మంజూరు చేయించాం. రిజర్వాయర్ ఆధునికీకరణ పనులకు పన్నులు పోను రూ.35 కోట్లతో పనులు చేపట్టారు.. అసలు ఆ పనులు అవసరమే లేదని కాకాణి చెప్పడం సిగ్గుచేటు. 2015లో భారీవర్షాలకు సర్వేపల్లి రిజర్వాయర్ తెగిపోయే పరిస్థితి వచ్చింది...అప్పట్లోనూ సీఎంగా ఉన్న చంద్రబాబు నాయుడు స్వయంగా వచ్చి కట్ట పరిస్థితి చూశారు. ఆ వెంటనే ఆయన నిధులు మంజూరు చేయగా, వైసీపీ పాలనలో తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు చేసుకున్నారు. ఇప్పుడు పకడ్బందీగా టెండర్ ప్రక్రియ నిర్వహించి, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది లేకుండా సర్వేపల్లి రిజర్వాయర్ ను ఆధునికీకరిస్తున్నాం. ఆల్తూరుపాడు రిజర్వాయర్ పనులు రూ.500 కోట్లతో చేపట్టారు..ఇలాంటి పనులన్నీ సాక్షికి, వైసీపీ నేతలకు కనిపించవా? చంద్రబాబు నాయుడు వస్తే ఇరిగేషన్ వ్యవస్థ నానశమైపోతుందంటూ కాకాణి దారుణంగా మాట్లాడాడు. నేడు పోలవరం ప్రాజెక్టును ఎవరు బతికిస్తున్నారు..వెలిగొండ ద్వారా నల్లమల సాగర్‌కు నీళ్లు ఎవరిస్తున్నారు... హంద్రీనీవా పనులు పూర్తి చేసి నీళ్లు ఇస్తున్నదెవరు...ఇవన్నీ చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమయ్యాయి. సంగం బ్యారేజీ 90శాతం మేం పూర్తి చేస్తే, వైసీపీ ప్రభుత్వంలో వాళ్లు విగ్రహాలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో కానీ, జిల్లాలో కానీ ఇరిగేషన్ పరంగా ఏం పనిచూసుకున్నా టీడీపీ హయాంలో చేసినవే. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి బనకచర్లకు డిశ్చార్జి కెపాసిటీని 44 వేల క్యూసెక్కుల నుంచి 80 వేలకు పెంచేందుకు రూ.1478 కోట్ల కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. ఇరిగేషన్ వ్యవస్థకే వైభవం తెస్తున్న చంద్రబాబు నాయుడు రైతు ద్రోహి అయితే...రూ.150 కోట్లు పనులు చేయకుండానే దోచుకున్న కాకాణి గోవర్ధన్ రెడ్డి రైతు బాంధవుడా? నిద్రలేస్తే మా గురించి అబద్ధాలు రాయడం తప్ప ప్రజల ముందు వాస్తవాలు ఉంచలేని సాక్షి వైఖరి సిగ్గుచేటని సోమిరెడ్డి మండిపడ్డారు.

కుమార్తె పెళ్లికి ఆహ్వానిస్తే రాద్ధాంతమా..

రాష్ట్రం నాశనమైపోవడమే కాదు.. తండ్రి ఇచ్చిన ఆస్తిలోని తన వాటా అడిగిన షర్మిలమ్మ కూడా నాశనమైపోవాలని సాక్షి కోరుకుంటోంది. మా రాజకీయ జీవితంలో ఇలాంటి పత్రికను ఎప్పుడూ చూడలేదు..ఇకపై చూడబోం. బిడ్డ పెళ్లికి ముఖ్యమంత్రిని ఆహ్వానించేందుకు వచ్చిన షర్మిలమ్మపై దారుణమైన రాతలు రాయడం దుర్మార్గమైన చర్య. ఇటీవల తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క ఏపీ అసెంబ్లీకి వచ్చారు...ఆయన రాగానే సీఎం చంద్రబాబు నాయుడు ఎమ్మెల్యేలందరినీ ఒకే దగ్గరకు పిలిపించి ఆహ్వాన పత్రికలు అందించారు. 2004 వరకు నేను మంత్రిగా ఉండగా, రాజశేఖర్ రెడ్డి ప్రతిపక్ష నేత..అసెంబ్లీలో చాలా అంశాలపై మా మధ్య వాగ్వాదాలు జరిగాయి. 2008లో నా కుమార్తె పెళ్లికి ఆహ్వానించేందుకు కుమారుడు రాజగోపాల్ రెడ్డితో కలిసి అప్పటి సీఎం రాజశేఖర్ రెడ్డిని కలిశాను. ఆయన మమ్మల్ని ఎంతో ఆత్మీయంగా రిసీవ్ చేసుకుని....రాజగోపాల్ రెడ్డి చదువు, భవిష్యత్ గురించి చాలా ప్రేమగా మాట్లాడారు. ఆనం వివేకానందరెడ్డితోనూ రాజకీయంగా చాలా కాలం పోరాడాను..నా బిడ్డ పెళ్లికి వచ్చి మనస్ఫూర్తిగా ఆశీర్వదించి వెళ్లారు. ఇవన్నీ సహజంగా మానవ సంబంధాల విషయంలో సహజంగా జరిగేవే. షర్మిలమ్మ విషయంలో ఆహ్వానపత్రిక ఇస్తేనే సాక్షి బరితెగించి వార్తలు రాసింది. ఇప్పటికైనా సాక్షిలో వార్తల తీరు మార్చుకోవాలని వైఎస్ భారతమ్మకు సోమిరెడ్డి హితవు పలికారు.

చైతన్యరథం

గ్రంథాలయాలకు పూర్వవైభవం..

డిజిటల్ హంగులతో ఆధునీకరణ

- పుస్తకాలతోనే విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం
- నా జీవితమే ఒక ఉదాహరణ
- సోషల్ మీడియా వద్దు.. పుస్తక పఠనమే ముద్దు
- జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో మంత్రి నారాయణ



నెల్లూరు (చైతన్యరథం): పుస్తక పఠనంతోనే విజ్ఞానవంతమైన సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ అన్నారు. నెల్లూరులో శుక్రవారం 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకల్లో మంత్రి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రంథాలయ ఉద్యమ మహనీయులకు ఘనంగా నివాళులర్పించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. డిజిటల్ యుగంలోనూ పుస్తక పఠనానికి ఉన్న ప్రాధాన్యత ఏమాత్రం తగ్గలేదని, యువత సోషల్ మీడియాకు కేటాయించే సమయంలో కొంతైనా గ్రంథాలయాలకు కేటాయించి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా చరిత్ర, సాహిత్యం, జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవాలని, చిన్నతనం నుంచే పిల్లల్లో పఠనాసక్తిని పెంచేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

కటిక పేదరికం నుంచి పట్టుదలతో చదివి యూనివర్సిటీ ప్రథమ స్థానంతో పాటు స్టాటిస్టిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించి, నారాయణ విద్యాసంస్థల స్థాయికి ఎదగడానికి పుస్తక పఠనమే కారణమని మంత్రి తన జీవిత ప్రస్థానాన్ని స్ఫూర్తిదాయకంగా వివరించారు.

పేద పిల్లలకు విద్యను ఆస్తిగా అందించాలన్న సంకల్పంతోనే రాజకీయాల్లోకి వచ్చానని, ఇప్పటికీ తాను నిరంతర విద్యార్థిగానే నిత్యం పుస్తకాలు చదువుతానని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి, గ్రంథాలయాల ఆధునీకరణకు, డిజిటల్ వనరుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ విజేత రూప్ కుమార్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శాంత కుమారి, కార్యదర్శి కె. కుమార్ రాజా, రచయిత చలంచర్ల భాస్కర్ రెడ్డి, అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాజధాని రాజసం!

మహోన్నత లక్ష్యంతో రూపుదిద్దుకుంటున్న అమరావతి రాజధాని ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చరిత్రలో ఒక ప్రత్యేక అధ్యాయం కానున్నది. ప్రపంచ నగరాలకు దీటుగా రూపుదిద్దుకుంటున్న అమరావతి ఇప్పుడు నవ్యాంధ్రప్రదేశ్ ఆశల సౌధంగా ఆవిష్కృతమవుతోంది. వేలాది మంది రైతుల త్యాగం, కోట్లాది మంది తెలుగువారి ఆకాంక్ష.. సీఎం చంద్రబాబు దార్శనిక సంకల్పం కల గలిసిన ఈ మహా నిర్మాణ యజ్ఞం రాష్ట్ర ప్రగతికి నూతన దిశానిర్దేశం చేయబోతోంది. కృష్ణమ్మ తీరాన కొలువుదీరుతున్న ఈ నవ్య నగరం కేవలం ఆంధ్రప్రదేశ్ పాలనా కేంద్రంగానే కాకుండా పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఉపాధికి నిలయంగా, ప్రపంచ పటంలో తెలుగుజాతి కీర్తిని చాటిచెప్పే మహా నగరంగా ఎదగనున్నది. ఎన్నో ఆటుపోట్లు, అవరోధాలు, అనిశ్చితులను అధిగమించి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, ఆధునిక సాంకేతికత, పచ్చదనం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలతో రాజధాని తనదైన రాజసాన్ని చాటుకునే దిశగా అడుగులు వేస్తోంది. చరిత్రను గౌరవిస్తూ ఆధునికతను ఆహ్వానించే ఈ మహానగర నిర్మాణం ఆంధ్రప్రదేశ్ ఆర్థిక ప్రగతికి, పారిశ్రామిక విస్తరణకు, ఉపాధి అవకాశాల కల్పనకు కీలక వేదిక కానున్నది. అమరావతి ఎదుగుదలలోనే ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు ఆశలు ప్రతిబింబించనున్నాయి. అత్యుత్తమ ఐదు నగరాల్లో ఒకటిగా అమరావతిని నిలబెట్టాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఏకకాలంలో రూ.60వేల కోట్ల బృహత్తర అంచనా వ్యయంతో 95కి పైగా ప్రధాన మౌలిక వసతుల ప్రాజెక్టులు వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. అమరావతి మహా నగరానికి మకుటాయమానంగా నగర నడిబొడ్డున ఆకాశాన్ని తాకేలా అత్యాధునిక సాంకేతికతతో పాటు ప్రాచీన చారిత్రక వైభవానికి, తెలుగువారి సాంస్కృతిక వారసత్వానికి అద్దంపట్టేలా డిజైన్ చేశారు. అసెంబ్లీ భవనాన్ని 'బౌద్ధ స్థూపం' ఆకృతిలో నిర్మిస్తుండగా, హైకోర్టు భవనాన్ని 'రాజహంస' రూపంలో నిర్మిస్తున్నారు. ఈ ఐకానిక్ భవనాలు, పర్యావరణహిత, అత్యాధునిక అండర్ గ్రౌండ్ డక్ట్ టన్నెల్ వ్యవస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత డిజిటల్ కమాండ్ నెట్‌వర్క్‌లతో అమరావతి రూపురేఖలు నభూతో నభవిష్యత్ అన్నట్లుగా తయారవుతున్నాయి.

900 మీటర్ల పొడవైన ఐకానిక్ 'గ్లాస్ స్కైబ్రిడ్జి

సాధారణ పరిపాలనా శాఖ, సీఎం కార్యాలయం, సచివాలయ ప్రాంగణంగా 49 అంతస్తులతో అతిపెద్ద జీఏడీ టవర్ రూపు దిద్దుకుంటోంది. వివిధ ప్రభుత్వ శాఖాధిపతుల కార్యాలయాల కోసం 39 అంతస్తుల చొప్పున మరొక నాలుగు భారీ టవర్లను నిర్మిస్తున్నారు.

ఈ ఐదు ఆకాశ హర్మ్యాలను పైభాగంలో అనుసంధానిస్తూ 900 మీటర్ల పొడవైన ఐకానిక్ 'గ్లాస్ స్కై బ్రిడ్జి' రూపకల్పన చేశారు. ఈ భారీ అద్దాల వంతెన భవనాల మధ్య రాకపోకలకే కాకుండా, రాజధానికే ప్రధాన పర్యాటక ఆకర్షణగా నిలవనున్నది. నిర్మాణ పనులను ప్రణాళికాబద్ధంగా నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రపంచస్థాయి ఇంజినీరింగ్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నారు. భవనాలకు లోపల ఎలాంటి పిల్లర్ల అడ్డంకి లేకుండా వెలుపలి వైపు స్టీల్ ఫ్రేమ్‌ల మద్దతుతో అసాధారణ దృఢత్వాన్ని అందించే 'డయాగ్రిడ్' సాంకేతికతను వాడుతున్నారు.వేగవంతమైన నిర్మాణాల కోసం 'జంపింగ్ ఫార్మ్ వర్క్', 'మివాన్ షట్టరింగ్' విధానాలను ప్రవేశపెట్టి ప్రతి 10 రోజులకు ఒక అంతస్తు చొప్పున పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా ఇంజినీర్లు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు. 2027 ఆగస్టు నాటికి ఐకానిక్ టవర్ల ప్రధాన నిర్మాణాలు పూర్తి చేసి 2028 మార్చి నాటికి మొత్తం ప్రాజెక్ట్‌ను పూర్తిస్థాయి ఆకృతికి తీసుకురావాలనే లక్ష్యం పనులు జరుగుతున్నాయి.

రాజధాని నగరాన్ని 27 టౌన్లుగా విభజన!

ఒక రాజధాని నిర్మాణమంటే కొన్ని ప్రభుత్వ భవనాలను, సచివాలయ టవర్లను నిర్మించడం కాదు. తరతరాల భవిష్యత్తుకు పునాదులు వేయడం, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడం, పరిపాలనను ప్రజలకు చేరువ చేయడం, పెట్టుబడులకు గమ్యస్థానంగా, ఉపాధికి కేంద్రంగా, ఆధునిక జీవనానికి చిరునామాగా ఒక నగరాన్ని తీర్చిదిద్దడమే లక్ష్యంగా అమరావతి నిర్మాణ ప్రస్థానం ముందుకు సాగుతోంది. సింగపూర్‌కు చెందిన ప్రపంచ ప్రసిద్ధ పట్టణ ప్రణాళిక, మౌలిక సదుపాయాల కన్సల్టెన్సీ సంస్థ 'సుర్బానా జురాంగ్' రూపొందించిన అంతర్జాతీయ ప్రమాణాల మాస్టర్ ప్లాన్ ఆధారంగా అమరావతిలో రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇచ్చి గ్రిడ్ పద్ధతిలో అభివృద్ధి చేసేలా రోడ్ల నెట్‌వర్క్‌ను రూపొందించారు. భవిష్యత్తులో నగరం ఎంతగా విస్తరించినా ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా, సులభమైన రవాణా వ్యవస్థ అందుబాటులో ఉండేలా ముందుచూపుతో ప్రణాళికలు సిద్ధం చేశారు.మాస్టర్ ప్లాన్ ప్రకారం రాజధాని నగరాన్ని 27 టౌన్లుగా విభజించారు. ఒక్కో టౌన్‌ను సుమారు 2 కిలోమీటర్ల పొడవు, 2 కిలోమీటర్ల వెడల్పుతో, దాదాపు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో రూపొందించారు. ప్రధాన రహదారులు ఒక్కో టౌన్‌కు సరిహద్దులుగా ఉండగా అంతర్గత రహదారులు ఆ ప్రాంతాన్ని నాలుగు భాగాలుగా విభజిస్తాయి.

ప్రతి టౌన్‌ను నాలుగు నైబర్ హుడ్‌లుగా, వాటిని మరింత చిన్న కమ్యూనిటీలుగా విభజించారు. తద్వారా నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, పార్కులు, ఇతర ప్రజావసరాలన్నీ ప్రజలకు చేరువలో ఉండేలా రూపకల్పన చేశారు. తద్వారా నివాస ప్రాంతాలు, వాణిజ్య కేంద్రాలు, విద్యాసంస్థలు, పార్కులు, ఇతర ప్రజావసరాలన్నీ ప్రజలకు చేరువలో ఉండేలా రూపకల్పన చేశారు. స్కూల్స్, హాస్పిటల్స్, పార్కులు, షాపులు అన్నీ ఇంటికి 5 నుంచి 10 నిమిషాల నడక దూరంలో ఉండేలా ప్రణాళిక. నగరం ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా, నాలుగు ప్రత్యేక అభివృద్ధి జోన్లుగా విభజించి ఉద్యోగ, వ్యాపార, నివాస సదుపాయాలను విస్తరించారు.

రహదారులకు ప్రత్యేక హోదాలు కేటాయింపు

నగరం భవిష్యత్తులో ఎంతగా విస్తరించినా ట్రాఫిక్ చిక్కులు లేకుండా స్మార్ట్ రవాణానే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేశారు. నగరంలో రాకపోకలను అత్యంత సులభతరం చేసేందుకు రోడ్ల నామకరణం, వర్గీకరణలో ప్రత్యేక పద్ధతిని రూపొందించారు. అమరావతిలో తూర్పు నుంచి పడమర దిశగా ప్రయాణించే రోడ్లకు ఈ-సిరీస్ అని, ఉత్తరం నుంచి దక్షిణానికి అనుసంధానించే రోడ్లకు ఎస్-సిరీస్ అని పేర్లు పెట్టారు. ఇందులో భాగంగా ఉత్తరం నుంచి దక్షిణం వరకు రవాణా అవసరాలను తీర్చేందుకు మొత్తం 34-ఎస్ సిరీస్ రోడ్లను ప్రాధాన్యత ప్రకారం నిర్మిస్తున్నారు. రాజధాని పరిధిలో మేజర్ ఆర్టీరియల్, సబ్ ఆర్టీరియల్, ఆర్టీరియల్, కలెక్టర్ రోడ్డు రూపంలో సుమారు 1,500 కిలోమీటర్లకు పైగా విస్తృతమైన రహదారుల అనుసంధానం చేస్తున్నారు. మొదటి ప్రాధాన్యత కింద 313 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్న 41 ప్రధాన రహదారుల నిర్మాణ పనులు క్షేత్రస్థాయిలో వేగవంతంగా జరుగుతున్నాయి. రవాణా వ్యవస్థలో ప్రధాన పాత్ర పోషించే కొన్ని రహదారులకు ప్రత్యేక హోదాలను కేటాయించారు. ఈ-1 రోడ్డును కరకట్ట రోడ్డు పేరుతో అభివృద్ధి చేస్తుండగా ఈ-3 రోడ్డును అత్యంత ప్రాధాన్యత కలిగిన సీడ్ యాక్సెస్ రోడ్డుగా పిలుస్తున్నారు. ఈ-5, ఈ-13, ఎన్-6, ఎన్-13 రహదారులను నగరంలో ప్రధాన రహదారులుగా నిలిచే మేజర్ ఆర్టీరియల్ రోడ్లు నిర్మిస్తున్నారు.

మరోవైపు సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి మణిపాల్ ఆస్పత్రి వరకు నిర్మించారు. రహదారులన్నీ 6 వరుసల విస్తీర్ణంలో అంతర్జాతీయ నగరాల ప్రమాణాలకు దీటుగా రూపుదిద్దుకుంటున్నాయి. ప్రతి రోడ్డుకు ఇరువైపులా ప్రత్యేక సైక్లింగ్, వాకింగ్ ట్రాక్‌లు నిర్మిస్తున్నారు. రోడ్ల పొడవునా అవెన్యూ ప్లాంటేషన్ చేపడుతున్నారు. విద్యుత్ లైన్లు, ఇంటర్నెట్ కేబుల్స్ భూగర్భంలోనే ప్రత్యేక యూటిలిటీ డక్ట్‌లను నిర్మిస్తున్నారు. తాగునీటి సరఫరా వ్యవస్థ, భూగర్భ డ్రైనేజీ, సీవరేజ్ నెట్‌వర్క్, శుద్ధి చేసిన నీటి వాడుకం కోసం రీయూజ్ వాటర్ లైన్లు, ఆధునిక వీధి దీపాలు, ప్రయాణికులు కూర్చోవడానికి ఆకర్షణీయమైన స్ట్రీట్ ఫర్నీచర్ వసతులను సమగ్రంగా అందుబాటులోకి తెస్తున్నారు.

తెలుగువారి కీర్తి కిరీటంలో కలికితురాయిగా

పర్యావరణ పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ వరద ముప్పును నివారించేందుకు 'స్పాంజ్ సిటీ' కాన్సెప్ట్ అమల్లోకి తెచ్చారు. వర్షపు నీరు ఎక్కడికక్కడ భూమిలోకి ఇంకిపోయేలా చర్యలు చేపట్టడమే కాకుండా, మొత్తం రాజధాని విస్తీర్ణంలో 51 శాతం భాగం కేవలం పచ్చదనం, జలాశయాలకే కేటాయించారు. నగరంలో ట్రాఫిక్ నియంత్రణ, వీధి దీపాలు, వ్యర్థాల నిర్వహణ, మున్సిపల్ సేవలు నిరంతర భద్రతా పర్యవేక్షణ అంతా పూర్తి డిజిటల్ విధానంలో సాగనున్నది. ల్యాండ్ పూలింగ్ విధానం ద్వారా 30వేల మందికి పైగా రైతులు 35 వేల ఎకరాలకు పైగా భూమిని ఇచ్చి ఈ నిర్మాణంలో భాగస్వామ్యులను చెయ్యడం. అమరావతిని కేవలం ప్రభుత్వ కార్యాలయాల నగరంగా కాకుండా, భారీ పెట్టుబడులు, ఉద్యోగాల ప్రధాన ఆర్థిక కేంద్రంగా మార్చడం.

2050 నాటికి 35 లక్షల జనాభా,15 లక్షల ఉద్యోగాల సృష్టి లక్ష్యంగా ఈ భారీ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధి చేయడమే లక్ష్యంగా అమరావతి మహా నగర నిర్మాణం జరుగుతున్నది. ఏది ఏమైనా వేలాది మంది రైతుల త్యాగం, కోట్లాది మంది తెలుగువారి ఆశీస్సులతో నిర్మాణమవుతోంది అమరావతి. సంప్రదాయానికి పెద్దపీట వేస్తూ ఆధునికత అందిపుచ్చుకుంటున్న అమరావతి నవ్యాంధ్రప్రదేశ్ ప్రగతికి రథసారథి. కృష్ణా నదీ తీరాన ఆవిష్కృతమవుతున్న ఈ అద్భుత నగరం తెలుగువారి కీర్తి కిరీటంలో కలికితురాయిగా నిలిచే ఆంధ్రప్రదేశ్ రాజధాని తన రాజసాన్ని ప్రపంచానికి చాటిచెప్పనున్నది.

- నీరుకొండ ప్రసాద్



కష్టపడిన కార్యకర్తకు దక్కిన



అసలైన గౌరవం

పార్టీ జెండా మోసిన చేతులకే నాయకత్వ పగ్గాలు అందిస్తున్న నారా లోకేష్

రాజకీయాల్లో పదవులు అనేవి కేవలం అధికారానికి చిహ్నాలు కావు. అవి ఒక వ్యక్తి చేసిన కృషికి దక్కే గుర్తింపు... పార్టీని నమ్ముకుని ఎన్నో ఏళ్లుగా పనిచేసిన కార్యకర్తకు లభించే గౌరవం... తన త్యాగాలకు, శ్రమకు ఒకరోజు తప్పకుండా గుర్తింపు వస్తుందనే నమ్మకానికి ప్రతిరూపం. అయితే రాజకీయాల్లో చాలా కాలంగా కొనసాగుతున్న ఒక సంప్రదాయం ఏమిటంటే పదవులు పలుకుబడి ఉన్న వారికి, ఆర్థికంగా బలమైన వారికి, నాయకత్వానికి దగ్గరగా ఉన్నవారికి మాత్రమే దక్కుతాయనే భావన. ఈ పరిస్థితిని మార్చి క్షేత్రస్థాయిలో పనిచేసిన సామాన్య కార్యకర్తకు కూడా అధికార బాధ్యతలు అప్పగించాలనే ఆలోచనతో తెలుగుదేశం పార్టీలో ఒక కొత్త రాజకీయ ఒరవడికి నాంది పలుకుతున్న నాయకత్వం నారా లోకేష్‌ది.



ఒకప్పుడు పార్టీ జెండాను భుజాన వేసుకుని ఊరూరా తిరిగిన కార్యకర్త, ఎన్నికల సమయంలో రాత్రింబవళ్లు కష్టపడిన యువకుడు, పార్టీ కార్యక్రమాల కోసం తన సమయాన్ని, శ్రమను వెచ్చించిన సామాన్యుడు... వీరంతా కేవలం ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చే వ్యక్తులుగా మిగిలిపోకూడదనే ఆలోచన నిజమైన సంస్థాగత నాయకత్వానికి నిదర్శనం. పార్టీ కోసం పని చేసిన వ్యక్తికి పార్టీలోనే ఎదిగే అవకాశం ఉండాలి. తన కష్టానికి గుర్తింపు లభిస్తుందనే నమ్మకం ఉండాలి. ఆ నమ్మకాన్ని కార్యరూపంలోకి తీసుకురావడానికి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల్లో కొత్త ఆశలను నింపుతున్నాయి.

పదవులు కొందరి గుప్పిట్లో కాదు...
కార్యకర్తల కష్టానికి ప్రతిఫలం కావాలి

వార్డు కౌన్సిలర్‌గా, కార్పొరేటర్‌గా, మున్సిపల్ చైర్మన్‌గా, కార్పొరేషన్ మేయర్‌గా, ఎంపీపీగా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రజలకు సేవ చేసే అవకాశాలు క్షేత్రస్థాయి నాయకులకు దక్కినప్పుడే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఉంటుంది. ఈ పదవులన్నీ కేవలం రాజకీయ పలుకుబడికి పరిమితం కాకుండా, పార్టీ కోసం పనిచేసిన వారి సామర్థ్యానికి, అంకితభావానికి గుర్తింపుగా మారాలి. ఇటీవల మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ మేయర్ అభ్యర్థిగా పేరం ఏడుకొండలును ఎంపిక చేయడం ఈ దిశగా ఒక ఆసక్తికరమైన ఉదాహరణ. సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి దాదాపు దశాబ్దకాలంగా పార్టీ కార్యకలాపాల్లో చురుకుగా ఉన్న ఒక క్షేత్రస్థాయి కార్యకర్తకు మేయర్ అభ్యర్థిగా అవకాశం కల్పించడం ద్వారా పార్టీ నాయకత్వం ఒక స్పష్టమైన సందేశాన్ని ఇచ్చింది. రాజకీయాల్లో ఎదగడానికి ఆర్థిక బలం ఒక్కటే అర్హత కాదని, పార్టీ పట్ల నిబద్ధత, ప్రజలతో అనుబంధం, నిరంతర కృషి కూడా ముఖ్యమని ఈ ఎంపిక చాటిచెప్పింది. ఎన్నికల ప్రక్రియ ఇంకా పూర్తికాకపోయినా ఒక సామాన్య కార్యకర్తకు ఇంతటి బాధ్యత కోసం అభ్యర్థిత్వం దక్కడం రాజకీయంగా ప్రాధాన్యత కలిగిన పరిణామం.

పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక వేదికలోనూ క్షేత్రస్థాయి గొంతుక

తెలుగుదేశం పార్టీ నూతన కమిటీల కూర్పులోనూ క్షేత్రస్థాయి నాయకత్వానికి ప్రాధాన్యత కనిపించింది. మండల పార్టీ అధ్యక్షురాలు గంట్యాడ శ్రీదేవి, క్లస్టర్ ఇన్‌చార్జి గుత్తికొండ ధనుంజయ్‌లకు పొలిట్‌బ్యూరోలో చోటు కల్పించడం సాధారణ విషయం కాదు. పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక వేదికలోకి క్షేత్ర స్థాయి నుంచీ ఎదిగిన నాయకులకు అవకాశం కల్పించడం ఒక బలమైన సంస్థాగత సందేశం. పార్టీ కోసం పనిచేసే వ్యక్తి ఎదుగుదలకు మండల స్థాయి ఒక చివరి మెట్టు కాదని, అతని ప్రతిభను బట్టి అత్యున్నత స్థాయికి చేరుకోవచ్చని ఈ పరిణామం నిరూపిస్తోంది. పార్టీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు ఆమోదంతో రూపుదిద్దుకున్న కమిటీల్లో ఈ తరహా ప్రాతినిధ్యం ఉండటం గమనార్హం. సామాజిక సమీకరణలు, మహిళలకు ప్రాతినిధ్యం, బలహీనవర్గాలకు అవకాశాలతో పాటు క్షేత్రస్థాయి నాయకత్వానికి ప్రాధాన్యత ఇవ్వడం పార్టీ భవిష్యత్తుకు ఉపయోగపడే నిర్మాణాత్మక ఆలోచన. ఈ మార్పుల్లో నారా లోకేష్ సంస్థాగత దృక్పథం కూడా స్పష్టంగా చర్చకు వస్తోంది.

కార్యకర్త అంటే ఎన్నికల సమయంలో గుర్తుకొచ్చే వ్యక్తి కాదు...

లోకేష్ కార్యకర్తలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలను వినడం, పార్టీ నిర్మాణంలో వారికి బాధ్యతలు అప్పగించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. 'ఇంటింటికీ తెలుగుదేశం' వంటి కార్యక్రమాల ద్వారా క్షేత్రస్థాయి నాయకత్వంతో అనుసంధానం పెంచడం, క్లస్టర్ వ్యవస్థను బలోపేతం చేయడం, పార్టీ కార్యక్రమాల్లో కార్యకర్తల భాగస్వామ్యాన్ని సాంకేతికంగా నమోదు చేయడం వంటి చర్యలు పార్టీని కేవలం ఎన్నికల యంత్రాంగంగా కాకుండా నిరంతరం పనిచేసే సంస్థగా తీర్చిదిద్దే ప్రయత్నాలు.

కార్యకర్తల సంక్షేమం పట్ల కూడా నాయకత్వం దృష్టి పెట్టడం అవసరం. పార్టీ కోసం పనిచేసే వారి ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులు, భవిష్యత్తు వంటి అంశాలను పట్టించుకున్నప్పుడే నాయకత్వంపై వారి విశ్వాసం మరింత బలపడుతుంది. కార్యకర్తను గౌరవించడం అంటే కేవలం ఒక పదవి ఇవ్వడం మాత్రమే కాదు; అతని కష్టాన్ని గుర్తించడం, అతని కుటుంబానికి అండగా నిలవడం, అతని అభిప్రాయానికి విలువ ఇవ్వడం కూడా.

యువతకు అవకాశం... రేపటి నాయకత్వానికి పునాది!

రాజకీయాల్లో యువతకు అవకాశాలు కల్పించడం అనేది కేవలం కొత్త ముఖాలను పరిచయం చేయడం కాదు. వారిలో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం, బాధ్యతలు అప్పగించడం, ప్రజా సమస్యలపై స్పందించే సామర్థ్యాన్ని పెంచడం. లోకేష్ సాంకేతికతను, యువత ఆలోచనా విధానాన్ని, క్షేత్రస్థాయి రాజకీయ అనుభవాన్ని కలిపి పార్టీకి కొత్త తరాన్ని సిద్ధం చేయాలనే దిశగా అడుగులు వేస్తున్నారు. యువగళం పాదయాత్ర ద్వారా ప్రజల మధ్యకు వెళ్లడం, యువత ఉద్యోగావకాశాలపై మాట్లాడడం, పార్టీ సంస్థాగత వ్యవస్థలో యువ కార్యకర్తలకు ప్రాధాన్యత కల్పించాలనే ప్రయత్నం... ఇవన్నీ రాజకీయ నాయకత్వం అనేది కేవలం ప్రసంగాలకు పరిమితం కాకుండా భవిష్యత్తు నాయకులను తయారు చేసే బాధ్యత కూడా అని గుర్తు చేస్తున్నాయి.

అసలైన నాయకత్వం అంటే... ?
తన వెనుక మరింత మంది నాయకులను తయారు చేయడం

ఒక నాయకుడి గొప్పతనం ఆయనకు లభించిన పదవుల సంఖ్యతో మాత్రమే కొలవలేం. తనతో పాటు ఎంతమందిని ఎదిగేలా చేశారు? ఎన్నో ఏళ్లుగా పార్టీని నమ్ముకొని పనిచేస్తున్న కార్యకర్తలకు ఎంత భరోసా కల్పించారు? సామాన్య కుటుంబాల నుంచి వచ్చిన వారికి ఎంతటి అవకాశాలు అందించారు? అనే అంశాలే ఆయన నాయకత్వ పరిణతిని తెలియజేస్తాయి. లోకేష్ ప్రస్తుత రాజకీయ ప్రయాణంలో గమనించదగిన అంశం ఇదే. పార్టీని నమ్ముకుని పనిచేసిన కార్యకర్తకు గుర్తింపు రావాలి, క్షేత్రస్థాయి నాయకుడికి నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగే అవకాశం ఉండాలి... సిఫార్సులకంటే పనితీరుకు ప్రాధాన్యత ఉండాలి అనే ఆలోచనను ఆయన బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు. ఈ విధానాలు మాటలకే పరిమితం కాకుండా నిరంతరంగా, పారదర్శకంగా అమలైతే తెలుగుదేశం పార్టీకి మరింత బలమైన నాయకత్వ పునాది ఏర్పడుతుంది.

రాజకీయాల్లో కార్యకర్తకు ఇచ్చే గౌరవం అనేది ఒక వ్యక్తికి ఇచ్చే పదవితో ముగిసిపోదు. అది వేలాది మంది కార్యకర్తల కుటుంబాల్లో కలిగించే ఆత్మవిశ్వాసం. "నేను కూడా పార్టీ కోసం కష్టపడితే ఎదగగలను... నా పనిని గుర్తించే నాయకత్వం ఉంది... నా భవిష్యత్తుకు ఈ పార్టీలో అవకాశం ఉంది" అనే నమ్మకాన్ని కలిగించడం ఏ రాజకీయ సంస్థకైనా గొప్ప విజయం. పార్టీ జెండాను మోసిన చేతులకే ఒకరోజు నాయకత్వ పగ్గాలు అందాలి. పార్టీ కోసం చెమటోడ్చిన కార్యకర్తకు గుర్తింపు రావాలి. సామాన్యుడి సామర్థ్యానికి రాజకీయాల్లో అందలం దక్కాలి.

ఈ ఆలోచనను ఆచరణలోకి తీసుకెళ్లే ప్రయత్నాలే లోకేష్ నాయకత్వానికి ప్రత్యేక గుర్తింపుగా నిలవాలి. ఎందుకంటే నిజమైన నాయకుడు తన కోసం అనుచరులను మాత్రమే తయారు చేయడు... తనతో పాటు నడిచే నాయకులను తయారు చేస్తాడు. కార్యకర్తను గౌరవించే పార్టీనే ప్రజల విశ్వాసాన్ని దీర్ఘకాలం నిలబెట్టుకోగలదు.

కార్యకర్తే పార్టీకి పునాది... కార్యకర్త ఎదుగుదలే పార్టీ బలం... కష్టపడిన కార్యకర్తకు దక్కే గౌరవమే నిజమైన ప్రజాస్వామ్య రాజకీయానికి చిరునామా!

ఎస్‌పీ సాహెబ్
టీడీపీ రాష్ట్ర కార్యదర్శి



మై టీడీపీ యాప్...

సిఫార్సుల రాజకీయాలకు
పనితీరు ఆధారిత ప్రత్యామ్నాయం



ఈ మార్పుల్లో అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశం మై టీడీపీ యాప్. రాజకీయాల్లో ఒక కార్యకర్త ఎంత కష్టపడుతున్నాడు? ఎన్ని పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నాడు? ప్రజలతో అతనికి ఎంత అనుబంధం ఉంది? పార్టీ అప్పగించిన బాధ్యతలను ఎంత సమర్థంగా నిర్వహిస్తున్నాడు? వంటి అంశాలను సాంకేతికత ద్వారా నమోదు చేసి, పనితీరును అంచనా వేసే ప్రయత్నం ఇది. నారా లోకేష్ ప్రతిపాదించిన విధానం ప్రకారం మై టీడీపీ యాప్‌లో ఐదుసార్లు లేదా అంతకంటే ఎక్కువసార్లు 'బెస్ట్ వర్కర్'గా గుర్తింపు పొందిన కార్యకర్తలకు కొన్ని నామినేటెడ్ పదవుల విషయంలో బాహ్య సిఫార్సులు లేకుండానే అర్హత కల్పించే ఆలోచన ఉంది. ఈ ప్రతిపాదనకు పార్టీ అధ్యక్షుడి ఆమోదం లభించిందని... తదుపరి నామినేటెడ్ పదవుల భర్తీ సమయంలో అమలు చేస్తామని ఆయన వెల్లడించారు. అంటే ఇది ఇప్పటికే ప్రతి పదవికి అమలవుతున్న హామీ కాదు, పనితీరుకు ప్రాధాన్యత ఇచ్చే దిశగా ప్రకటించిన ఒక కీలకమైన విధానం.

ఈ ఆలోచనలోని గొప్పతనం ఏమిటంటే... నాయకుల చుట్టూ తిరిగే పరిచయాల కంటే, పార్టీ కోసం చేసిన పని గుర్తింపునకు ఆధారంగా మారాలి. ఒక మారుమూల గ్రామంలో పనిచేసే కార్యకర్తకు, పెద్ద నాయకుడి పరిచయం లేకపోయినా తన కష్టాన్ని నిరూపించుకునే అవకాశం ఉండాలి. రాజకీయాల్లో సాంకేతికతను కేవలం ప్రచారానికి కాకుండా కార్యకర్తల పనితీరును గుర్తించడానికి ఉపయోగించడం ఒక కొత్త ఆలోచన. అయితే ఈ విధానం పారదర్శకంగా, నిష్పక్షపాతంగా అమలైతేనే కార్యకర్తల్లో మరింత విశ్వాసాన్ని పెంపొందిస్తుంది.

జోన్ - 1 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, అరకు)

చైతన్యరథం

టీమ్‌వర్క్‌తో గ్రామాభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీ శ్రీభరత్

● జెడ్పీ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌లకు ఎం.పి శ్రీభరత్ అభినందనలు



విశాఖపట్నం (చైతన్యరథం): విశాఖపట్నం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ ఎన్నికలు, ప్రమాణస్వీకార కార్యక్రమంలో విశాఖపట్నం పార్లమెంట్ సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ కో-ఆప్షన్ సభ్యుడిగా పాల్గొన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చైర్‌పర్సన్ గాడు అలివేణి, వైస్ చైర్మన్ సుకవాసి అజయ్ లకు శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే ఆనందపురం జెడ్ పి టి సి ఎన్ని శ్రీనివాసరావు, పద్మనాభం జెడ్ పి టి సి కోరాడ సత్యవతి లు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ, స్థానిక సంస్థలను బలోపేతం చేయడంతో పాటు గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రజాప్రతినిధులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కూటమి పెద్దలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌ల మధ్య జరిగిన చర్చల అనంతరం పొత్తు ధర్మంలో భాగంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్ పదవులను తెలుగుదేశం పార్టీకి కేటాయించినట్లు తెలిపారు. విశాఖపట్నం జిల్లాలో ఎక్కువ ప్రాంతం నగరపాలక సంస్థ పరిధిలోకి వెళ్లడంతో ప్రస్తుతం నాలుగు మండలాలు మాత్రమే జిల్లా పరిషత్ పరిధిలో ఉన్నాయని పేర్కొన్నారు. ఎస్ఐఆర్, జనగణన ప్రక్రియల నేపథ్యంలో తదుపరి పరిపాలనా మార్పులు, విలీన ప్రక్రియ పూర్తయ్యే వరకు ప్రస్తుత వ్యవస్థ కొనసాగుతుందని వివరించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజాప్రతినిధుల ద్వారా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఎన్నికలు నిర్వహించిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు స్థానిక సంస్థల నిధులను సమర్థవంతంగా వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ఎంపీ పేర్కొన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో గ్రామీణాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ నిధులు సమకూర్చేందుకు కృషి చేస్తోందన్నారు. జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రస్తుతం నాలుగు మండలాల పరిధిలోనే బాధ్యతలు నిర్వహించాల్సి ఉన్నందున ప్రతి గ్రామాన్ని సందర్శించి ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికి, వాటిని ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులకు మంచి అవకాశం ఉందన్నారు. నలుగురు జెడ్పీటీసీ సభ్యులు సమష్టి బాధ్యతతో, టీమ్‌వర్క్‌తో పనిచేస్తూ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని ఎంపీ శ్రీభరత్ ఆకాంక్షించారు. రాజకీయ సమన్వయాన్ని గ్రామాభివృద్ధికి అనుకూలంగా మలుచుకుంటూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పిలుపునిచ్చారు.

జనసేన చెల్లికి తెలుగుదేశం అన్నయ్యల అండ..!



కాకినాడ (చైతన్యరథం): కాకినాడ జిల్లా పరిషత్ చైర్మన్‌గా కూటమి తరఫున ఎంపికైన జనసేన నాయకురాలు డా. బుర్రా దివ్య సునీతరాజ్, తన ఎన్నికకి ముందు రాజ్యసభ ఎంపీ సానా సతీష్‌బాబు, తెలుగుదేశం పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌లను కాకినాడలో మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా డా. బుర్రా దివ్య సునీత రాజ్‌కు తెలుగుదేశం పార్టీ నుండి అన్నలుగా అండగా నిలుస్తామని ఎంపీ సానా సతీష్ బాబు, జ్యోతుల నవీన్ భరోసా ఇచ్చారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని, కూటమి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షిస్తూ ఆమెకు శుభాకాంక్షలు, ఆశీర్వాదాలు అందించారు.

పార్వతీపురం మన్యం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా నిమ్మల నీలిమ ఎన్నిక

● వైస్ చైర్మన్‌గా వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్ ప్రమాణ స్వీకారం



పార్వతీపురం (చైతన్యరథం): మన్యం జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్‌గా భామిని జడ్పీటీసీ సభ్యురాలు నిమ్మల నీలిమ ఎన్నికయ్యారు. శుక్రవారం నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రొసీడింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల ప్రక్రియలో ఆమె చైర్‌పర్సన్‌గా ఎన్నికై ప్రమాణస్వీకారం చేశారు. అదేవిధంగా వైస్ చైర్మన్‌గా వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ ప్రమాణస్వీకారం చేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా నిమ్మల నీలిమ పేరును వైరిచర్ల వీరేశ్ చంద్రదేవ్ ప్రతిపాదించగా, బలిజిపేట జడ్పీటీసీ సభ్యురాలు పాలూరు చాందిని బలపరిచారు. ఈ ఎన్నికల్లో నిమ్మల నీలిమకు 10 మంది జడ్పీటీసీ సభ్యుల మద్దతు లభించడంతో ఆమె విజయం సాధించినట్లు జాయింట్ కలెక్టర్ ఆర్. వైశాలి అధికారికంగా ప్రకటించారు. అనంతరం నూతన చైర్‌పర్సన్‌గా నిమ్మల నీలిమ, వైస్ చైర్మన్‌గా వైరిచర్ల వీరేశ్ చంద్ర దేవ్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి స్త్రీ, శిశు సంక్షేమం మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి, ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, జిల్లా ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్, పార్వతీపురం ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, పాలకొండ పరిశీలకులు కావలి గ్రీష్మ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ నిమ్మలనీలిమ, వైస్ చైర్మన్ వైరిచర్ల వీరేష్ చంద్ర దేవ్‌తో పాటు జడ్పీటీసీ సభ్యులకు ప్రజాప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీకాకుళం జిల్లా పరిషత్ పీఠంపై కొరికాన భవానీ... అచ్చెన్నాయుడు అభినందనలు



కోటబొమ్మాళి (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా కూటమి తరఫున జనసేన పార్టీ నుంచి నియమితులైన కొరికాన భవానీ, ఆమె భర్త, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ శుక్రవారం నిమ్మాడ క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు. నేడు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా భవానీ అధికారికంగా బాధ్యతలు స్వీకరించనున్న నేపథ్యంలో మంత్రి అచ్చెన్నాయుడు ఆమెకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జిల్లా పరిషత్ పరిధిలోని అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా కృషి చేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయాలని ఆకాంక్షించారు. ప్రజల అవసరాలను గుర్తించి, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో ప్రజలకు మెరుగైన పాలన అందించాలని, అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసం, మన్ననలు పొందాలని మంత్రి అచ్చెన్నాయుడు భవానీకి సూచించారు.

విజయనగరం జడ్పీ చైర్‌పర్సన్ ప్రమాణస్వీకారంలో ముఖ్యఅతిథిగా ఎంపీ కలిశెట్టి



విజయనగరం (చైతన్యరథం): విజయనగరం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్ రెడ్డి, ఐఏఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా పరిషత్ నూతన చైర్‌పర్సన్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, పార్లమెంటరీ శాసనసభ్యులు, కూటమి నాయకులతో కలిసి విజయనగరం పార్లమెంటు సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో నూతనంగా జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మజ్జి సిరి సహస్రకి ఎంపీ కలిశెట్టి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. అలాగే నూతనంగా ఎన్నికైన జడ్పీటీసీ సభ్యులందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ.. మహిళా సాధికారతకు, మహిళా నాయకత్వానికి కూటమి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మహిళలకు రాజకీయ, పరిపాలనా రంగాల్లో ఉన్నత బాధ్యతలు అప్పగించడం ద్వారా వారి నాయకత్వ సామర్థ్యాలకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పిస్తోందని తెలిపారు. మహిళల అభ్యున్నతికి, సమాజంలో వారికి సముచిత స్థానం కల్పించడానికి కట్టుబడి పనిచేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్‌కి, యువ నాయకులు నారా లోకేష్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా పరిషత్ స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం మరింత వేగవంతం కావాలని ఆకాంక్షించారు.

పాతపట్నం మండలం నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

పాతపట్నం (చైతన్యరథం): మండలంలో నూతనంగా ఎన్నికైన మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు ఎంపీటీసీ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవంలో నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు, ఉపాధ్యక్షులు మరియు సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని, బాధ్యతను గౌరవిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆకాంక్షించారు. గ్రామాల అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సమిష్టిగా పనిచేస్తూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన అందించాలని నూతన ప్రజాప్రతినిధులకు సూచించారు.

అనకాపల్లిలో ఎన్నికైన చైర్మన్, చైర్మన్‌ల ప్రమాణస్వీకారం

అనకాపల్లి (చైతన్యరథం): అనకాపల్లి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా మోటూరు నాగమణి, వైస్ చైర్మన్‌గా పెంటకోట స్వాతి ఎన్నికయ్యారు. అనకాపల్లి జిల్లా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్గా పరవాడ జడ్పీటీసీ జనసేన పార్టీకి చెందిన మోటూరు నాగమణి, వైస్ చైర్మన్‌గా మునగపాక మండలం జడ్పీటీసీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థిని పెంటకోట స్వాతిని ఎన్నుకోగా వారితో కలెక్టర్ విజయకృష్ణన్ ప్రమాణస్వీకారం చేయించారు. అంతకుముందు గెలుపొందిన జడ్పీటీసీలతో ప్రమాణస్వీకారం చేయించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్లను రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సత్కరించారు. ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పంచకర్ల రమేష్ బాబు, చంద్రపు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్‌కు పత్రాలు అందజేసిన టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కిడారి శ్రావణ్

పార్వతీపురం (చైతన్యరథం): పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, సాలూరు మున్సిపాలిటీలు మరియు పాలకొండ నగర పంచాయతీ వైస్ చైర్మన్ పదవులకు సంబంధించిన ఎన్నికల ప్రక్రియలో భాగంగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి Form--A, Form--B, Annexure--1, Annexure--2, Annexure--3 పత్రాలను స్వీకరించి, జిల్లా ఎన్నికల పరిశీలకులు దాడి రత్నాకర్‌కి అందజేశారు. రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్ ఈ పత్రాలను సమర్పించారు. ఆయా మున్సిపాలిటీలు, నగర పంచాయతీల వైస్ చైర్మన్ పదవులకు సంబంధించిన పార్టీ ప్రక్రియలో భాగంగా అవసరమైన పత్రాలను ఎన్నికల పరిశీలకులకు అందించారు.

జోన్ - 2
(కాకినాడ, అమలాపురం, నర్సాపురం, రాజమహేంద్రవరం, ఏలూరు)
చైతన్యరథం

మండల పరిషత్ ఎన్నికల్లో విజేతలకు గంటా సత్కారం



భీమిలి (చైతన్యరథం): మండల పరిషత్ అధ్యక్షులు, మండల ప్రాదేశిక సభ్యులుగా ఎన్నికైన విజేతలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సత్కరించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పద్మనాభం, ఆనందపురం, భీమిలి మండల పరిషత్ అధ్యక్షులు కుచ్చర్లపాటి అరుణ కుమారి, తాట్రాజు అప్పారావు, యరబాల కృష్ణవేణి, వైస్ ఎంపీపీలు కాళ్ల నగేష్ కుమార్, ఆబోతు యమున, నాగరాజులకు శాలువా కప్పి అభినందించారు. మూడు మండలాల మండల ప్రాదేశిక సభ్యులుగా ఎన్నికైన వారిని సన్మానించారు. ఈ సందర్భంగా గంటా మాట్లాడుతూ మండలాల్లో బలమైన ముద్ర వేసేలా అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు. వచ్చే నెల 2న జరిగే పంచాయతీ ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలుచుకునేలా ప్రణాళికలు రూపొందించాలని, జనసేన, భాజపా శ్రేణులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లాలన్నారు. పంచాయతీ కూటమి అభ్యర్థులను ఒకటి, రెండు రోజుల్లో ఖరారు చేస్తామన్నారు. జనసేన ఇన్ఛార్జి పంచకర్ల సందీప్, భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రామస్వామి నాయుడు, కార్పొరేటర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అన్నదాన సత్రం ద్వారా ఎంతోమంది భక్తులకు సేవలందించడం అభినందనీయం



గుంటూరు (చైతన్యరథం): గుంటూరు అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం ద్వారా నిత్యం ఎంతోమంది భక్తులకు, పేదలకు ఉపయోగం కలుగుతోందని, ఇలాంటి సేవా కార్యక్రమాలకు ఆధ్యాత్మిక కేంద్రాల నిర్మాణం మరింత తోడ్పాటునిస్తుందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. 60వ డివిజన్ అమరావతి రోడ్డులోని అన్నదాన సత్రం వద్ద శ్రీ ఉమా మహేశ్వర స్వామి (భీమేశ్వర స్వామి) దేవస్థాన పునర్నిర్మాణ పనులకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి లక్ష్మీ అపర్ణ శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణానికి పూర్తి ఖర్చును భరించేందుకు ముందుకొచ్చిన కోటేశ్వరరావును అభినందించారు. స్వామివారి ఆశీస్సులు స్థానిక ప్రజలందరికీ త్వరగా అందాలన్నదే తమ ఆకాంక్ష అని అన్నారు. దేవస్థానం ఈఓ, ఆలయ చైర్మన్ సాంబశివరావు పర్యవేక్షణలో నిర్మాణ పనులు వేగంగా ముందుకు సాగాలని, నిర్మాణానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు స్థానిక కార్పొరేటర్లు సిద్ధంగా ఉన్నారని, ఎలాంటి అవసరాలున్నా తమను సంప్రదించాలని సూచించారు. అందరూ సమన్వయంతో పనిచేసి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి, ఇతర కార్పొరేటర్లు, ఆలయ కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ముక్కా ముత్యాలనాయుడు మృతి పార్టీకి తీరనిలోటు : ఎం.వి. ప్రణవ్‌గోపాల్

విశాఖపట్నం (చైతన్యరథం): తెదేపా సీనియర్ నాయకుడు, మాజీ కార్పొరేటర్ ముక్కా ముత్యాలనాయుడు మృతి పార్టీకి తీరని లోటు అని వీఎంఆర్‌డీఏ ఛైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. గత 40 ఏళ్లుగా తెలుగుదేశంకి, విశాఖ ప్రజలకు ఆయన తన నిస్వార్థమైన సేవలను అందించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజల సంక్షేమానికి ఆయన అహర్నిశలు శ్రమించారని కొనియాడారు. అంతటి మహా వ్యక్తిని నేడు కోల్పోవటం దురదృష్టకరమని, ఆయన లేని లోటు తీరనదని, పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని తెలిపారు. ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ ధనలక్ష్మి, ఇతర కార్పొరేటర్లు, ఆలయ



కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఇందాద్కర్ సొసైటీకి నూతన కమిటీ ఏర్పాటు కావడం సంతోషకరం

●మసీదు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, స్థానిక వ్యాపారుల సంక్షేమానికి నూతన కమిటీ ప్రాధాన్యత ఇవ్వాలి : ఎంపీ కేశినేని శివనాథ్



విజయవాడ (చైతన్యరథం): విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని సరాయి మసీదు వక్ఫ్, ఇమ్దాద్‌ఘర్ కాంప్లెక్స్‌లో నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని), టీడీపీ పశ్చిమ నియోజకవర్గం ఇన్ఛార్జి బుద్ధ వెంకన్న, నూర్ భాషా కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కమిటీ సభ్యులకు అభినందనలు, ఎంపీ చిన్ని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) మాట్లాడుతూ.. 2019 సంవత్సరం నుంచి కమిటీ లేకుండా కొనసాగుతున్న ఇందాద్కర్ సొసైటీకి ఎట్టకేలకు నూతన కమిటీ ఏర్పాటు కావడం సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. నూతన కమిటీలోని ఏడుగురు సభ్యులు ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించడం అభినందనీయమన్నారు. నూతన కమిటీ సభ్యులు మసీదు అభివృద్ధితో పాటు ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మసీదు పరిధిలోని దుకాణాల ద్వారా జీవనోపాధి పొందుతున్న స్థానిక వ్యాపారుల సమస్యలను కూడా గుర్తించి, వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు. మసీదు అభివృద్ధి, సేవా కార్యక్రమాలు, స్థానిక వ్యాపారుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కమిటీ సభ్యులందరూ సమిష్టిగా పనిచేయాలని ఆకాంక్షించారు.నూతన కమిటీలో ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా తనకు అవకాశం కల్పించడం గౌరవంగా, సంతోషంగా భావిస్తున్నానని ఎంపీ తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా కలెక్టర్‌తో కలిసి కమిటీ సమావేశానికి హాజరై మసీదుకు సంబంధించిన సమస్యలు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై సమగ్రంగా చర్చిస్తామని వెల్లడించారు. గతంలో వివిధ కారణాలతో అసంపూర్తిగా మిగిలిపోయిన పనులను గుర్తించి, వాటిని పూర్తి చేసేందుకు తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. మసీదు అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవడంతో పాటు స్థానిక వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తామని స్పష్టం చేశారు.నూతన కమిటీ సభ్యులందరూ బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ, సమన్వయంతో పనిచేసి మసీదు అభివృద్ధికి, సమాజ సేవకు తమ వంతు కృషి చేయాలని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆకాంక్షించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఏడుగురు కమిటీ సభ్యులకు మరోసారి హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫతావుల్లా, ఆషా, ఫైజాన్ మాధవ్, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్‌గా చింతమనేని సాయి నవ్యశ్రీ ప్రమాణస్వీకారం



ఏలూరు (చైతన్యరథం): ఏలూరు జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్‌గా చింతమనేని సాయినవ్యశ్రీ ప్రమాణ స్వీకారం చేశారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ సమావేశపు హాలులో శుక్రవారం జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికలు నిర్వహించారు. జిల్లాలోని 27 మంది జడ్పీటీసీలు ముందుగా జడ్పీటీసీలుగా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నికలు నిర్వహించారు. ద్వారకా తిరుమల జడ్పీటీసీ సత్య శ్రావణి కరుటూరి పెదవేగి మండలం జడ్పీటీసీ చింతమనేని సాయి నవ్యశ్రీని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్‌గా ప్రతిపాదించగా, కామవరపుకోట మండల జడ్పీటీసీ జాహ్నవి మందలపు బలపరిచారు. జిల్లా ప్రజా పరిషత్ అధ్యక్ష పదవికి మరో ప్రతిపాదన లేకపోవడంతో చింతమనేని సాయి నవ్యశ్రీని జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్‌గా ఎన్నికైనట్లు జిల్లా కలెక్టర్ ప్రకటించారు. అనంతరం జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్ పర్సన్‌గా ముదినేపల్లి మండల జడ్పీటీసీ చలమయ్య బొర్రా పేరునుని జంగారెడ్డిగూడెం మండల జడ్పీటీసీ గొల్లమండల సంకీర్తన ప్రతిపాదించగా, టి.నర్సాపురం మండల జడ్పీటీసీ కూరపాటి సుజాత బలపరిచారు. జిల్లా ప్రజా పరిషత్ వైస్ చైర్ పర్సన్ పదవికి మరో ప్రతిపాదన లేకపోవడంతో చలమయ్య బొర్రా వైస్ చైర్ పర్సన్‌గా ఎన్నికైనట్లు కలెక్టర్ ప్రకటించారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను కలెక్టర్ వెట్రిసెల్వి అందజేశారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్పర్సన్‌గా చింతమనేని సాయి నవ్యశ్రీ, వైస్ చైర్ పర్సన్ చలమయ్య బొర్రా లకు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. జిల్లా ప్రజా పరిషత్ చైర్ పర్సన్‌గా ప్రమాణస్వీకారం చేసిన చింతమనేని సాయి నవ్యశ్రీని శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి), చింతమనేని ప్రభాకర్, డా.కామినేని శ్రీనివాస్‌లు పుష్పగుచ్ఛాలను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ జి. వెంకటనాయుడు, డిప్యూటీ సీఈఓ భీమేశ్వరరావు, ఆర్డీఓ లక్ష్మి ప్రసన్న, ఏలూరు తహసీల్దార్, ప్రభృతులు పాల్గొన్నారు. ఏలూరు డిఎస్పీ శ్రావణ్ కుమార్ బందోబస్త్ ఏర్పాట్లను పరిశీలించారు.

నూతన జడ్పీ చైర్మన్ కాడ పద్మకు దేవినేని ఉమా అభినందనలు

జడ్పీ వైస్ చైర్మన్, జడ్పీటీసీ సభ్యులకు ఘన సత్కారం



తూర్పుగోదావరి జిల్లా (చైతన్యరథం): తూర్పుగోదావరి జిల్లా పరిషత్ నూతన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన కాడ పద్మను మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్మన్‌తో పాటు జడ్పీ వైస్ చైర్మన్, జడ్పీటీసీ సభ్యులను రాజమండ్రిలో కలిసి దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. జిల్లా పరిషత్ ద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ, గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని దేవినేని ఉమా ఆకాంక్షించారు. ప్రజల ఆశయాలకు అనుగుణంగా పనిచేస్తూ జిల్లా సమగ్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రుడా చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా టీడీపీ అధ్యక్షుడు బొడ్డు వెంకటరమణ చౌదరి, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అనపర్తి టీడీపీ ఇన్‌ఛార్జ్ నల్లమిల్లి మనోజ్ రెడ్డి, మండపేట జనసేన ఇన్‌ఛార్జ్ వేగుళ్ల లీలా కృష్ణ తదితర ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ రెండున్నరేళ్ల పాలనకు ప్రజల ఎన్నికల తీర్పే నిదర్శనం : ఎమ్మెల్యే బొండా ఉమా

విజయవాడ (చైతన్యరథం): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇప్పటికే కొన్ని నెరవేర్చామని, మరికొన్నింటిని దశలవారీగా అమలు చేస్తున్నామని టీడీపీ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేని సమయంలో చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని ఎలా ముందుకు తీసుకెళ్తారని తాను భావించానని, అయితే కేవలం రెండేళ్లలోనే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రశంసించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వ పనితీరుకు ఎన్నికల ఫలితాలే నిదర్శనమని, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవడం తమ పాలనపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని తెలియజేస్తోందని . గత ఎన్నికల్లో వైసీపీ నాయకులు ఈవీఎంలపై నిందలు వేసినా, ప్రజలు అన్నింటినీ గమనిస్తూనే ఉంటారని, ప్రభుత్వ పనితీరును బట్టే ప్రజలు తమకు భారీ మెజారిటీ అందించారని. స్థానిక సంస్థల ఎన్నికలను సైతం వైసీపీ అడ్డుకోవాలని ప్రయత్నించిందని, ఆ పార్టీ నాయకుల వ్యవహారశైలి ప్రజలకు తెలుసునని విమర్శించారు.

జోన్ - 3 (మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు, బాపట్ల, నరసరావుపేట)

చైతన్యరథం

రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు దాఖలు



నందిగామ (చైతన్యరథం):: రెండో విడత పంచాయతీ ఎన్నికల నామినేషన్లు దాఖలు చేసేందుకు శుక్రవారం ఆఖరి రోజు. దీంతో టీడీపీ, వైసీపీ మద్దతుతో సర్పంచి, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం కొండూరు నామినేషన్ కేంద్రం వద్ద వైసీపీ, టీడీపీ కార్యకర్తలు భారీగా తరలి వచ్చారు. కేతవీరుని పాడు, లింగాలపాడు, గోల్లమూడి తదితర నామినేషన్ కేంద్రాల వద్ద చివరి రోజు ఎక్కువ మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయా కేంద్రాల వద్ద సీఐ శ్రీను ఆధ్వర్యంలో ఎస్సైలు సూర్య వంశీ తదితరులు బందోబస్తు నిర్వహించారు. ఐతవరంలో మాజీ హోం మంత్రి వసంత నాగేశ్వరరావు మద్దతుతో టీడీపీ సర్పంచ్ స్థానానికి ఎరమాసి అంకురావు నామినేషన్ వేశారు. మాగల్లులో వైసీపీ కార్యకర్తలు బైక్ ర్యాలీలు చేశారు.

కూటమి అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించండి

● మంగళగిరిలో ఇంటింటి ప్రచారం చేపట్టిన టీడీపీ నేత పాతర్ల రమేష్



మంగళగిరి (చైతన్యరథం): మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ ఎన్నికలో కూటమి బలపరిచిన తెలుగుదేశంకు మున్సిపల్ మేయర్ అభ్యర్థి పేరం ఏడుకొండలు తో పాటు 21 డివిజన్ తెలుగుదేశం అభ్యర్థి ఎస్కే సాధిక, 24వ డివిజన్ తెలుగుదేశం పార్టీ తెలుగుదేశం అభ్యర్థి కొదమల సురేష్ బాబు, 20వ డివిజన్ తెలుగుదేశం అభ్యర్థి షేక్ రియాజ్ లను అఖండ మెజార్టీతో గెలిపించాల్సిందిగా ఆయా డివిజన్లోని ప్రజలను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాతర్ల రమేష్ కోరారు గురువారం మూడో రోజు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి వివిధ ప్రాంతాల్లో పర్యటిస్తూ ఇంటింటికీ వెళ్లి ప్రజలను పాతర్లరమేష్ కలిసి ఓట్లు అభ్యర్థించారు. కూటమి అభ్యర్థులకు అమూల్యమైన ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను ఆయన అభ్యర్థించారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, కూటమి పాలనలో రెండున్నర సంవత్సరాలలో జరిగిన అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరిస్తూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సారధ్యంలో మంగళగిరి నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని ఆయన తెలిపారు ఆయా డివిజన్లో అభివృద్ధికి కృషి చేస్తామని కూటమి అభ్యర్థులను గెలిపిస్తే అభివృద్ధి మరింత వేగంగా జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, ముస్లిం రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండి ఇబ్రహీం తెలుగుదేశం పార్టీ జిల్లా బీసీ సెల్ ఉపాధ్యక్షులు చాగంటిపాటి పూర్ణచంద్రరావు తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ ఇంతియాజ్ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు షేక్ హుస్సేన్, ఆరుద్ర భూలక్ష్మి, విన్నకోట శ్రీనివాసరావు ఎండి నజీర్, షేక్ సేహేన్షా బుల్లా కోటి. బుల్లా పిచ్చియ్య కే వసంతరావు తదితరులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.

జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రమాదేవి

● వైస్ చైర్‌పర్సన్‌గా కీర్తన ఎన్నిక... జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల చేతుల మీదుగా ప్రమాణ స్వీకారం... ధ్రువీకరణ పత్రాలు అందజేత



నరసరావుపేట (చైతన్యరథం): జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా రమాదేవి, వైస్ చైర్‌పర్సన్‌గా కీర్తన ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం నరసరావుపేటలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తొలుత జెడ్పీటీసీ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఎన్నిక నిర్వహించగా రమాదేవి ఎన్నికయ్యారు. వైస్ చైర్‌పర్సన్‌గా కీర్తనను ఎంపిక చేశారు. అనంతరం నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్ రమాదేవి, వైస్ చైర్‌పర్సన్ కీర్తనలతో జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ప్రమాణ స్వీకారం చేయించి, వారికి ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. నూతనంగా ఎన్నికైన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్‌లకు పలువురు అభినందనలు తెలిపారు.

గ్రామాభివృద్ధికి సమర్థ నాయకత్వం... పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీయే మద్దతు అభ్యర్థులనే గెలిపించాలి : ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ

●గొడ్డలి పార్టీ వైసీపీ వస్తే హింస.. కూటమి ప్రభుత్వం ఉంటే అభివృద్ధి, ప్రగతి

●ప్రతి గ్రామం ప్రగతిపథంలో పయనించాలంటే ఉత్తమ నాయకత్వం అవసరం



వినుకొండ (చైతన్యరథం): గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమం, రైతుల శ్రేయస్సే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయకత్వంలోని ఎన్డీయే కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి మద్దతు అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రతి గ్రామం ప్రగతిపథంలో పయనించాలంటే ప్రజలకు అందుబాటులో ఉండే సమర్థవంతమైన ఉత్తమ నాయకత్వం అవసరమన్నారు. గ్రామాల్లో రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, సాగునీటి సదుపాయాలు, పేదలకు ఇళ్లు వంటి మౌలిక వసతుల కల్పనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని జీవీ పేర్కొన్నారు. రాష్ట్రంలో పల్లె ప్రగతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని వివరించారు. గ్రామాల్లో ఇప్పటికే 9,000 కిలోమీటర్ల రహదారులను నిర్మించడంతో పాటు మరో 13,000 కిలోమీటర్ల రోడ్ల నిర్మాణ పనులు చేపడుతోందన్నారు. 24,601 నివాస ప్రాంతాల్లో తాగునీటి సరఫరా సౌకర్యాలను విస్తరించిందని తెలిపారు. స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 2.1 కోట్ల కిలోల వ్యర్థాలను సేకరించడంతో పాటు 13 జాతీయ పంచాయతీ అవార్డులను సాధించడం గ్రామీణ అభివృద్ధి పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేస్తూ 15వ ఆర్థిక సంఘం ద్వారా రూ.4,136 కోట్ల నిధులను విడుదల చేసిందని సుమారు 25 సంవత్సరాల తర్వాత పంచాయతీరాజ్ శాఖలోని వివిధ హోదాల్లో పనిచేస్తున్న 10 వేల మంది ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిందని వివరించారు. సాగునీటి రంగంలో రెండేళ్లలో రూ.24,611 కోట్లు ఖర్చు చేయగా వచ్చే మూడేళ్లలో రూ.35,555 కోట్లతో 36 ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించిందన్నారు. 6,047 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించి రైతులకు ప్రాధాన్యతనిచ్చిందని తెలిపారు. వెలిగొండ, పోలవరం నిర్వాసితులకు పరిహారం, పునరావాసం కల్పించేందుకు వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందన్నారు. భూ సమస్యల పరిష్కారంలో భాగంగా ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేసి లక్షలాది మంది పట్టాదారులకు పాస్ పుస్తకాలు అందించిందని పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాలకు శాశ్వత పట్టాల పంపిణీ ద్వారా అండగా నిలుస్తోందని తెలిపారు. గొడ్డలి పార్టీ వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో రాష్ట్రం హింస, విధ్వంసం, అరాచకాలకు నిలయంగా మారిందని జీవీ విమర్శించారు. వైసీపీ వస్తే హింస కూటమి ప్రభుత్వం ఉంటే అభివృద్ధి, ప్రగతి ఉంటాయని స్పష్టం చేశారు.

ప్రజల గుండెచప్పుడు ప్రజాదర్బార్... ప్రతి సమస్యకూ పరిష్కారం

● గుంటూరులో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే నసీర్



గుంటూరు (చైతన్యరథం): ప్రజాదర్బార్ ప్రజల గుండెచప్పుడు వినే గొప్ప వేదిక అని, రాష్ట్రంలో త్వరలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందించబోతున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ తెలిపారు. శుక్రవారం స్థానిక తూర్పు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే స్వయంగా స్వీకరించారు. ప్రతి అర్జీకి జవాబుదారీగా ఉంటామని తెలిపారు. ప్రజాదర్బార్ కు వెళితే తమ సమస్యలు పరిష్కరించేందుకు భరోసా నిలుస్తుందనే నమ్మకం కలిగించామని చెప్పారు. తమ కార్యాలయంలో ప్రతి రోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని, ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్నామని తెలిపారు. ఎక్కువగా పింఛన్లు, ఇంటి స్థలాలు, శానిటేషన్, రేషన్ కార్డుల కోసం దరఖాస్తు వచ్చాయని, సంబంధిత అధికారులకు అర్జీలను పంపించి వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించామని చెప్పారు. పింఛన్ల కోసం గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే అర్హులైన వారిని గుర్తించామన్నారు. అర్హులైన ఏ ఒక్కరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించవచ్చని, ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సేవలందిస్తామని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో విజయం సాధించిన కార్పొరేటర్లు క్షేత్రస్థాయిలో కలిసికట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. గుంటూరు నగరంలో మరింత అభివృద్ధి సాధించే విధంగా పటిష్ట ప్రణాళిక రూపొందించబోతున్నామని చెప్పారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఎన్నడూలేని విధంగా అన్ని రంగాల్లో ప్రగతి సాధించామని తెలిపారు.

గుడివాడ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము!

●చైర్మన్ అభ్యర్థి మరీదు కరుణ.... కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం




గుడివాడ (చైతన్యరథం): గుడివాడ పట్టణంలో మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విస్తృతంగా పాల్గొన్నారు. పట్టణంలోని 2, 48, 6, 7, 8 వార్డుల పరిధిలోని వలివర్తిపాడు, నాగవరప్పాడు, రాజేంద్ర నగర్, శ్రీరామాపురం, గౌరీ శంకరపురం, ఏలూరు రోడ్డు, నెహ్రూ చౌక్, ముగ్గు బజార్ రోడ్డు, మార్కెట్ సెంటర్, జైన్ స్ట్రీట్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చైర్మన్ అభ్యర్థి మరీదు కరుణ, కూటమి కౌన్సిలర్ అభ్యర్థులు దొండపాటి మహేష్, వడ్డాది నాగరాజు, పొట్లూరి కృష్ణారావు, బూరగడ్డ శ్రీకాంత్, వేమూరి కనకదుర్గలను అఖండ మెజార్టీలతో గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. వారికి మద్దతుగా ఎమ్మెల్యే రాము ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రజలకు అభివాదాలు చేస్తూ వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యే రాముకు వివిధ ప్రాంతాల్లో ప్రజానీకం బ్రహ్మరథం పడుతూ ఘన స్వాగతం పలికారు. పలు కాలనీల్లో మహిళలు మంగళ హారతులతో ఆత్మీయ స్వాగతం పలికి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పలు చోట్ల భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించి ప్రచారాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే రాము, కూటమి శ్రేణులతో కలిసి నడుస్తూ ప్రచారంలో పాల్గొన్నారు. పలు చోట్ల పార్టీ శ్రేణుల్లో నెలకొన్న ఉత్సాహాన్ని చూసి ఎమ్మెల్యే రాము, ఏపీ ఎస్డబ్ల్యూసీ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు వారితో కలిసి నృత్యాలు చేయడంతో పార్టీ శ్రేణుల్లో మరింత జోష్ నెలకొంది. ఎమ్మెల్యే సరదాగా వేసిన స్టెప్పులతో ప్రచార వాతావరణం మరింత ఉత్సాహభరితంగా మారింది. అనంతరం వార్డుల ప్రధాన కూడళ్లలో స్థానిక ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే రాము మాట్లాడారు....గుడివాడలో అభివృద్ధి అంటే ఏంటో ప్రజలకు స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఏ వీధికి వెళ్లినా ప్రజలందరూ చాలా పాజిటివ్ గా స్పందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఏ ఎన్నికలు జరిగినా సైకిల్ కు బ్రేక్ లేదని, కూటమికి తిరుగు లేదని స్పష్టం చేశారు. 2024లో ప్రజలు వేసిన ఓట్ల ఫలితంగానే నేడు గుడివాడలో ఇంత అభివృద్ధి జరుగుతోందని, ఓటును సద్వినియోగం చేసుకుంటే జరిగే మంచిని గుడివాడలో ప్రత్యక్షంగా చూపించామని అన్నారు. ప్రజలందరూ అభివృద్ధికి మద్దతుగా రెండు ఓట్లను కూటమి అభ్యర్థులకే వేయాలని కోరారు. కూటమి అభ్యర్థులకు మద్దతు తెలిపి మన గుడివాడ భవిష్యత్తును మనమే తీర్చిదిద్దుకుందామని ఓటర్లకు ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు.

ఎమ్మెల్యే నల్లారి, జడ్పీ చైర్మన్ సుగవాసి భేటీ



పీలేరు (చైతన్యరథం): తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు శాసనసభ్యుడు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డిని అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్, రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తనపై విశ్వాసం ఉంచి అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఎంపిక చేసినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి ఆశీస్సులు, సూచనలు సలహాలు కోరారు. ఈ ఆత్మీయ భేటీలో పార్టీ పట్ల తనకున్న నిబద్ధతను, జిల్లా అభివృద్ధి కోసం తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలనే సంకల్పాన్ని ప్రసాద్ బాబు తెలియజేశారు. పార్టీ నాయకత్వం అందించిన బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తూ... అన్నమయ్య జిల్లా అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా ముందుకు సాగుతానని సుగవాసి ప్రసాద్ బాబు పేర్కొన్నారు.





ఒంగోలు నగరంలోని పాత జిల్లా పరిషత్ హాల్లో ప్రకాశం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఒంగోలు జడ్పీటీసీ కొక్కిలిగడ్డ ప్రభాకరరావు, వైస్ చైర్మన్ దర్శి జడ్పీటీసీ వరికూటి లక్ష్మి తయారు ప్రమాణస్వీకార కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవి కుమార్, మంత్రి స్వామి, శాసనసభ్యులు బీన్ విజయ్ కుమార్, ఉగ్ర నరసింహారెడ్డితో కలిసి పాల్గొన్న ఒంగోలు శాసనసభ్యుడు దామచర్ల జనార్దన్ రావు



కడప ఎంపీ అవినాష్‌రెడ్డి అరెస్టు

పులివెందుల (చైతన్యరథం): నియోజకవర్గంలో వైసీపీ ఎంపీ అవినాశ్ రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గొడవల నేపథ్యంలో ఎంపీని ముందస్తుగా అరెస్టు చేస్తున్నట్లు పోలీసులు ప్రకటించారు. ఉదయం పులివెందులలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పులివెందులలో 144 సెక్షన్ అమలులో ఉన్న ప్రాంతంలో భారీ సంఖ్యలో వాహనాలతో అవినాశ్ రెడ్డి ర్యాలీ నిర్వహించారు. సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడురు దగ్గర ఎంపీ అవినాశ్ రెడ్డి, టీడీపీ ఇన్‌ఛార్జ్ బీటెక్ రవి వాహనాలు ఎదురుపడ్డాయి. దీంతో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని అవినాశ్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు.

అగస్త్యేశ్వరుని సన్నిధిలో సుగవాసి

రాయచోటి (చైతన్యరథం): పాత రాయచోటిలోని ప్రసిద్ధ శ్రీ అగస్తేశ్వర స్వామి ఆలయాన్ని అన్నమయ్య జిల్లా పరిషత్ చైర్మన్, రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు సందర్శించారు.



స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దివ్య ఆశీస్సులతో అన్నమయ్య జిల్లా సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, జిల్లా మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ప్రార్థించారు.

పగిడ్యాల ఎంపీపీ ఎన్నిక మరోసారి వాయిదా

నంద్యాల (చైతన్యరథం): జిల్లాలోని పగిడ్యాల మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ) ఎన్నిక మరోసారి వాయిదా పడింది. కోరం లేకపోవడంతో ఎన్నిక నిర్వహించలేమని అధికారులు ప్రకటించారు. తదుపరి ఎన్నిక తేదీని త్వరలో ప్రకటిస్తామని రిటర్నింగ్ అధికారి (ఆర్వో) నగేష్ వెల్లడించారు. శుక్రవారం ఎంపీపీ ఎన్నిక నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేశారు. అయితే, అవసరమైన కోరం హాజరు కాకపోవడంతో ఎన్నిక ప్రక్రియ ముందుకు సాగలేదు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే జయసూర్య, ఎంపీ బైరెడ్డి శబరి వర్గీయుల మధ్య ఏకాభిప్రాయం కుదిర్చేందుకు టీడీపీ అబ్జర్వర్ చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ, ఆ చర్చలు ఫలించలేదు.ఇరువర్గాల నేతలు తమ పట్టు వీడకపోవడంతో సమస్య కొలిక్కి రాలేదు. చర్చల నేపథ్యంలో ఎంపీటీసీ సమావేశ మందిరం నుంచి వెనుదిరిగినట్లు తెలుస్తోంది. దీంతో కోరం లేకపోవడంతో అధికారులు ఎన్నికను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన పగిడ్యాల ఎంపీపీ ఎన్నిక మరోసారి వాయిదా పడటంతో స్థానికంగా ఉత్కంఠ కొనసాగుతోంది. తదుపరి ఎన్నిక తేదీని అధికారులు ప్రకటించిన తర్వాతే ఎన్నిక ప్రక్రియపై స్పష్టత రానుంది.








అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వానికి రెండు కళ్ళు

మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి

మార్కాపురం (చైతన్యరథం): మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, పొదిలి నగర పంచాయతీ ఎన్నికల సందర్భంగా కూటమి చైర్మన్ అభ్యర్థి వరికుంట్ల అనిల్, ఆ అవార్డుల కూటమి వార్డు సభ్యులకు మద్దతుగా పొదిలి పట్టణంలోని 25,26,27 వార్డులలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. వార్డుల్లో ప్రతి ఇంటికి వెళ్లి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇదే పొదిలి పట్టణంలో మహిళలపై రాళ్లు వేసిన మీకు చరిత్ర వైసిపి వాళ్ళదని ప్రతిపక్షంలో ఉంటేనే మహిళలపై ఈ విధంగా దాడులు చేస్తున్నారని అది అధికారంలోకి వస్తే వారి అరాచకాలకు హద్దే ఉండదని అన్నారు. పెన్షన్ 4000 రూపాయలకు పెంచిన చరిత్ర కూటమి ప్రభుత్వానిదని, మహిళలకు ఉచితంగా సంవత్సరానికి మూడు సిలిండర్లు, కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి పలికి వందనం లో సంవత్సరానికి 13 వేల రూపాయలు, రైతులకు అన్నదాత సుఖీభవ తో సంవత్సరానికి 20,000రూపాయలు ఇస్తున్నామని ఈ విధంగా అన్ని రకాల సంక్షేమాన్ని గత వైసీపీ ప్రభుత్వం కంటే మిన్నగా ప్రజలకు అందిస్తున్నామని అన్నారు. 20 కోట్ల రూపాయల తో పొదిలి పట్టణాన్ని త్వరలో అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తున్నామని, అతి ముఖ్యమైన పొదిలి పట్టణ త్రాగునీటి సమస్యకు పరిష్కారంగా 130 కోట్ల రూపాయలతో పొదిలి పట్టడానికి ఇంటింటికి ద్వారా త్రాగునీరు వచ్చే ఆరు నెలల్లో అందిస్తామని అన్నారు. పొదిలి పట్టణంలో మరింత అభివృద్ధి జరగాలంటే కూటమి చైర్మన్ అభ్యర్థిగా వరికుంట్ల అనిల్ గారిని, కూటమి వార్డు సభ్యులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మార్కాపురం జిల్లా పరిషత్ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేసిన కందుల రామిరెడ్డి, వైస్ చైర్మన్ గుంటిమడుగు శ్రీనివాస్ వర్మ, ఎంపీ మాగుంట శ్రీనివాస్ రెడ్డి, పార్లమెంట్ పరిశీలకులు బీటీ నాయుడు, ఎమ్మెల్యేలు ఉగ్ర నరసింహ రెడ్డి, కందుల నారాయణ రెడ్డి, ముత్తుముల అశోక్ రెడ్డి, యర్రగొండపాలెం టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు కలిసి ఘనంగా సన్మానించారు.

వీనుల విందుగా పరిటాల పట్టాభిషేకం







పుట్టపర్తి (చైతన్యరథం): శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా రాజకీయ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత మొట్టమొదటి జిల్లా ప్రజా పరిషత్ చైర్మన్ పీఠాన్ని దివంగత నేత పరిటాల రవీంద్ర వారసుడు, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్ అధిరోహించడంతో జిల్లాలో సరికొత్త పరిటాల శకం ప్రారంభమైంది. కూటమి పొత్తు ధర్మానికి అనుగుణంగా జనసేన పార్టీకి చెందిన గోరంట్ల జడ్పీటీసీ సునేత్ర వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఉదయం రామగిరి మండలం వెంకటాపురంలోని తన నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి పరిటాల శ్రీరామ్ ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఈ చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టారు. అనంతరం తన తండ్రి, కీర్తిశేషులు పరిటాల రవీంద్ర ఘాట్ వద్దకు చేరుకుని భావోద్వేగంగా నివాళులర్పించి ఆశీస్సులు తీసుకున్నారు. తదుపరి తమ ఇలవేల్పు శ్రీ యల్లమ్మ అమ్మవారి ఆలయంలో 201 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. అక్కడి నుంచి వందలాది వాహనాలు, వేలాది మంది టీడీపీ కార్యకర్తలు, అభిమానుల కోలాహలం మధ్య పుట్టపర్తికి బయలుదేరారు. మార్గమధ్యంలో అడుగడుగునా కార్యకర్తలు పూలవర్షం కురిపిస్తూ ఘనస్వాగతం పలికారు.

టీడీపీ కార్యాలయంలో నేతల భేటీ.. రెవెన్యూ భవన్‌లో ప్రమాణ స్వీకారం

ముందుగా పుట్టపర్తిలోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయానికి చేరుకున్న శ్రీరామ్.. జిల్లా ఎన్నికల పరిశీలకులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా టీడీపీ అధ్యక్షుడు ఎంఎస్ రాజు, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, హిందూపురం ఎంపీ బి.కె. పార్థసారథి, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, కందికుంట వెంకట ప్రసాద్, పల్లె సింధూర రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి, కూటమి జడ్పీటీసీ సభ్యులతో సమావేశమయ్యారు. అనంతరం నేతలందరూ కలిసి మామిళ్ళకుంట క్రాస్‌లోని రెవెన్యూ భవన్‌కు చేరుకున్నారు. అక్కడ జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆధ్వర్యంలో, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, శ్రేయోభిలాషుల సమక్షంలో నల్లచెరువు జడ్పీటీసీ సభ్యునిగా, శ్రీ సత్యసాయి పుట్టపర్తి జిల్లా ప్రథమ జడ్పీ చైర్మన్‌గా పరిటాల శ్రీరామ్ పదవీ స్వీకార ప్రమాణం చేశారు.

నమ్మకాన్ని నిలబెట్టుకుంటా జడ్పీ చైర్మన్ పరిటాల శ్రీరామ్

రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో యువతకు పెద్దపీట వేస్తూ, కొత్త రక్తం మరియు కొత్త ఆలోచనలు పరిపాలనలోకి రావాలని యువనేత నారా లోకేష్ గారు బలంగా నమ్మారని ఈ సందర్భంగా పరిటాల శ్రీరామ్ అన్నారు. ఆ నమ్మకంతోనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాకు తొలి జడ్పీ చైర్మన్‌గా ఈ అద్భుతమైన అవకాశాన్ని కల్పించారన్నారు. గతంలో జిల్లాకు, పార్టీకి ఏ కష్టం వచ్చినా పరిటాల కుటుంబం ముందుండి అండగా నిలబడిందని.. నా తండ్రి పరిటాల రవి పార్టీని, సామాన్యులను నిలబెట్టడానికి కృషి చేశారన్నారు. మా అమ్మ పరిటాల సునీతమ్మ ఏ విధంగా పనిచేశారో.. వారి పేరు నిలబెడుతూ అంతకంటే గొప్పగా పనిచేస్తానన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలందరి సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపిస్తాను. పార్టీ నాపై పెట్టిన బాధ్యతను, పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానని శ్రీరామ్ అన్నారు.

నా భర్త ఆశయం నెరవేరింది

ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. నాడు పరిటాల రవి గారు బి.కె.పార్థసారథిని, నేను చమన్ ను జడ్పీ చైర్మన్లుగా చేశామన్నారు. ఏ జడ్పీ చైర్మన్ పదవి కోసం అయితే పరిటాల రవి ప్రాణాలు పోగొట్టుకున్నారో, నేడు జిల్లా నేతలందరి సహకారంతో అదే చైర్మన్ పీఠంపై మా కుమారుడు శ్రీరామ్ కూర్చోవడం ఒక అదృష్టంగా, దైవ నిర్ణయంగా భావిస్తున్నానన్నారు. ఏ లోకాన ఉన్నా రవి ఎంతో సంతోషిస్తారన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని పరిటాల అభిమానులు, టీడీపీ కుటుంబ సభ్యులందరికీ ఇది పండగ రోజు అన్నారు. రాబోయే పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని చెప్పారు.

కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మాట్లాడుతూ.. "ఆకలైనప్పుడు అన్నం పెట్టమంటే పరమాన్నం పెట్టినంత సంతోషంగా ఉందని కదిరి ఎమ్మెల్యే కందికుంట ప్రసాద్ అన్నారు. పరిటాల కుటుంబానికి నాకు దశాబ్దాల సాన్నిహిత్యం ఉందన్నారు. అందుకే శ్రీరామ్‌ను బాధ్యతగా ఆహ్వానించి మా కదిరి నియోజకవర్గంలోని నల్లచెరువు నుంచి పోటీ చేయించామన్నారు. కదిరి ప్రజలు, కూటమి కార్యకర్తలు శ్రీరామ్‌ను తమ బిడ్డలా గుండెల్లో పెట్టుకుని ఆశీర్వదించి భారీ మెజారిటీతో గెలిపించారన్నారు. ఒకవైపు మా నియోజకవర్గ ప్రతినిధిగా గెలిపించుకోవడం, మరోవైపు నూతనంగా ఏర్పడిన సత్యసాయి జిల్లాకు ప్రథమ పౌరుడిగా నిలబెట్టుకోవడం ఒక డబుల్ బొనాంజా అన్నారు. గత ఏడెనిమిది ఏళ్లుగా ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొన్న యువకుడు శ్రీరామ్‌కు ఈ పదవి రావడం, ఎడారిలో ఒయాసిస్ మాదిరిగా కార్యకర్తలందరినీ సేదతీర్చిందన్నారు..

అభివృద్ధే మాకు వజ్రాయుధం : మంత్రి సవిత

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత మాట్లాడుతూ..కూటమి ధర్మాన్ని పాటిస్తూ టీడీపీకి చైర్మన్, జనసేనకు వైస్ చైర్మన్ పదవులు కేటాయించామని మంత్రి సవిత అన్నారు. జిల్లాలో ఫైటర్ జెట్ పరిశ్రమ, కియా సెకండ్ ఎక్స్‌పాన్షన్ ప్లాంట్, సాగునీటి ప్రాజెక్టులతో అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. అభివృద్ధే మా వజ్రాయుధం అని.. పరిటాల వారసుడిగా శ్రీరామ్ సారథ్యంలో జిల్లా మరింత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు.

అంబరాన్నంటిన సంబరాలు

ప్రమాణ స్వీకార కార్యక్రమం ముగిసిన అనంతరం సాయంత్రం ధర్మవరం పట్టణానికి చేరుకున్న పరిటాల శ్రీరామ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. ఎర్రగుంట సర్కిల్ వద్దకు భారీగా తరలివచ్చిన వేలాది మంది కార్యకర్తలు, అభిమానులకు అభివాదం చేస్తూ శ్రీరామ్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. అనంతరం ఎర్రగుంట సర్కిల్ నుంచి కదిరి గేట్ వరకు నిర్వహించిన భారీ విజయోత్సవ ర్యాలీతో ధర్మవరం పట్టణం పసుపుమయమైంది. ధర్మవరం పట్టణం మొత్తం పరిటాల నినాదంతో దద్దరిల్లింది...

వైసీపీ నేతల కవ్వింపు చర్యలను తిప్పికొడతాం

జిల్లా టీడీపీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు



అనంతపురం (చైతన్యరథం): తాడిపత్రి నియోజకవర్గంలో జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ వందకు వంద శాతం విజయం సాధించడాన్ని జీర్ణించుకోలేక మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకులు కవ్వింపు చర్యలకు, దాడులకు పాల్పడుతున్నారని అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు ఆరోపించారు. అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు వైసీపీ నాయకుల వ్యవహారశైలిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంతమైన తాడిపత్రిలో ఉద్దేశపూర్వకంగా అవాంఛనీయ సంఘటనలకు తెరలేపుతూ ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. ఇలాంటి దాడులు, కవ్వింపు చర్యలు కొనసాగిస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. తాడిపత్రిలో జరుగుతున్న అభివృద్ధిని, ప్రజలకు అందుతున్న సంక్షేమాన్ని చూసి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ తెలుగుదేశం పార్టీకి ప్రజలు మద్దతు తెలుపుతారనే భయంతోనే వైసీపీ నాయకులు ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని పూల నాగరాజు గారు పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములను ప్రజాస్వామ్యబద్ధంగా స్వీకరించాలని, ప్రజల ప్రశాంతతకు భంగం కలిగించే చర్యలకు స్వస్తి పలకాలని పూల నాగరాజు హితవు పలికారు. ఈ సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, జిల్లా ఉపాధ్యక్షుడు కృష్ణకుమార్, కూడేరు జడ్పీటీసీ మురళి పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ.. ఆకస్మిక తనిఖీ!

పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రిలో మంత్రి సవిత



పెనుకొండ (చైతన్యరథం): శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖల మంత్రి సవిత అర్ధరాత్రి వేళ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగుల వద్దకు వెళ్లి, వారికి అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి త్వరలో మరిన్ని వైద్య సేవలు, మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నామని మంత్రి సవిత పేర్కొన్నారు.



జడ్పీ విజేతలకు అభినందనలు

అనంతపురం (చైతన్యరథం): జిల్లా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా పరిషత్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల ప్రత్యేక సమావేశంలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో కలిసి అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, ఆర్టీసీ జోనల్ చైర్మన్ పూల నాగరాజు అనంతపురం జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగరాజు, వైస్ చైర్మన్‌గా ఎన్నికైన వెన్నపూస లలితకు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల జడ్పీటీసీలుగా ప్రమాణ స్వీకారం చేసిన వారికి శుభాకాంక్షలు తెలిపారు.







నెదర్లాండ్స్‌లో కనుల పండువగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం

ఐండ్‌హోవెన్ (నెదర్లాండ్స్): పవిత్ర కార్తీక మాసాన్ని పురస్కరించుకుని వసుదైక కుటుంబకం (SVK) శ్రీబాలాజీ ఆలయం ఆధ్వర్యంలో నెదర్లాండ్స్‌లోని ఐండ్‌హోవెన్‌లో 6వ శ్రీ శ్రీనివాస కల్యాణ మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. నెదర్లాండ్స్ నలుమూలల నుంచి 1,300 మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని కనులారా వీక్షించి తన్మయులయ్యారు. ఎస్వీకే ఆహ్వానం మేరకు తిరుమల నుంచి విచ్చేసిన వేద పండితులు సుప్రభాత సేవ, తోమాల సేవ, అర్చన శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై వేదమంత్రోచ్చారణలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణం, వస్త్ర సమర్పణ కనుల పండువగా సాగాయి. ఐరోపా లోనే తిరుమల వైభవాన్ని అనుభూతి చెందామని భక్తులు ఆనందం వ్యక్తం చేశారు. సేవల్లో పాల్గొన్న భక్తుల పేర్లు, గోత్రాలతో వేద పండితులు సంకల్పం చెప్పి స్వామివారికి సేవలు సమర్పించారు. వేద ఆశీర్వచనం అనంతరం భక్తులందరికీ సర్వదర్శనం, ప్రసాద వితరణ చేశారు. ప్రత్యక్ష ప్రసారం ద్వారా కూడా ఎందరో భక్తులు ఈ వేడుకను వీక్షించారు.



ఈ మహోత్సవ విజయవంతం వెనుక వాలంటీర్ల అవిశ్రాంత కృషి ఉంది. వారాల ముందు నుంచే ప్రణాళిక, రిజిస్ట్రేషన్, వేదిక అలంకరణ, ప్రసాద వితరణ తదితర బాధ్యతలను ఎంతో అంకితభావంతో నిర్వర్తించారు. పెద్దలతో పాటు యువత, చిన్నారులు సైతం సేవలో ఉత్సాహంగా పాల్గొనడం విశేషం.

2022 నుంచి ప్రతి కల్యాణంలోనూ అండగా నిలుస్తున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ నెదర్లాండ్స్ (TANE) సభ్యులు ఈసారి కూడా పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తులకు స్వాగతం పలకడం నుంచి ప్రసాద వితరణ వరకు ఎస్వీకే బృందంతో కలిసి సేవలందించారు. Shrigandha, SAMUKA, EMM, HSS Netherlands వంటి భారతీయ సమాజ సంస్థలు సహకారం అందించాయి. తెలుగు, కన్నడ, ఒడియా, మరాఠీ, హిందీ మాట్లాడే కుటుంబాలన్నీ ఒకే వేదికపై స్వామివారి సేవలో పాల్గొనడం 'వసుదైక కుటుంబకం' స్ఫూర్తికి నిదర్శనంగా నిలిచింది.





సేవ, ఐక్యతతో ఎదిగిన 'టాగ్కా'

చార్లెట్‌లో ఘనంగా 20వ వార్షికోత్సవ వేడుకలు

చార్లెట్ (నార్త్ కరోలినా): తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చార్లెట్ ఏరియా (TAGCA) 20వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపక సభ్యుడు, మాజీ అధ్యక్షుడు పురుషోత్తమ చౌదరి గూడె మాట్లాడుతూ... సంస్థ ఇంతలా అభివృద్ధి చెందడం తనకు ఎంతో సంతృప్తి, ఆనందం కలిగిస్తోందని పేర్కొన్నారు. ఈ చారిత్రాత్మక మైలురాయి వేడుకల్లో భాగం కావడం గర్వకారణమని, టాగ్కా కుటుంబ సభ్యులందరినీ ఒకే వేదికపై చూడటం తనకు ఎన్నో మధుర జ్ఞాపకాలను గుర్తు చేసిందని తెలిపారు. ఒక చిన్న ఆశయం, ఉమ్మడి నిబద్ధతతో మొదలైన ఈ ప్రయాణం నేడు ఎంతో బలమైన, చైతన్యవంతమైన సంస్థగా ఎదిగి ఎందరో సభ్యుల జీవితాలను, సమాజాన్ని ప్రభావితం చేస్తోందని ఆయన కొనియాడారు. ఈ అద్భుతమైన వేడుకను విజయవంతంగా నిర్వహించి అందరినీ ఒకే వేదికపైకి చేర్చిన ప్రస్తుత టాగ్కా కార్యవర్గానికి (ఎగ్జిక్యూటివ్ కమిటీ), ముఖ్యంగా అధ్యక్షుడు దిలీప్ తోటకూరకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత ఇరవై ఏళ్లలో పనిచేసిన, ప్రస్తుత కార్యవర్గ సభ్యులు, వాలంటీర్లు, మద్దతుదారుల దూరదృష్టి, అంకితభావం, నిస్వార్థ సేవ వల్లే ఈ ఘన విజయం సాధ్యమైందని, ప్రతి ఒక్కరూ టాగ్కా చరిత్రలో ఒక అర్థవంతమైన అధ్యాయాన్ని లిఖించారని ప్రశంసించారు. గత 20 ఏళ్లుగా సంస్థను నడిపించిన స్నేహం, ఐక్యత, సేవా దృక్పథం భవిష్యత్ తరాలకు కూడా స్ఫూర్తినివ్వాలని ఆయన ఆకాంక్షించారు. టాగ్కా కుటుంబ సభ్యులందరికీ 20వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే దశాబ్దాల్లోనూ సంస్థ మరింతగా అభివృద్ధి చెందుతూ సమాజానికి మేలు చేయాలని





'టాస్ఫ్' ఆధ్వర్యంలో క్రీడా, సాంస్కృతిక సంబరాలు





ఫోర్ట్ లాడర్‌డేల్ (ఫ్లోరిడా): దక్షిణ ఫ్లోరిడాలో తెలుగు సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణతో పాటు క్రీడలను ప్రోత్సహించడంలో ముందుంటున్న తెలుగు అసోసియేషన్ ఆఫ్ సౌత్ ఫ్లోరిడా (TASF) ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలకు విశేష స్పందన లభించింది. టాస్ఫ్ అధ్యక్షుడు వీర వట్టికూటి నాయకత్వంలో స్పోర్ట్స్ లీడ్ షణ్ముఖ మక్కపాటి సమన్వయంతో జరిగిన వివిధ క్రీడా పోటీల్లో 300 మందికి పైగా క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వాలీబాల్, పురుషులు, మహిళల పికిల్‌బాల్, చిన్నారుల చెస్ పోటీలు ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగాయి. తెలుగు కుటుంబాల మధ్య స్నేహభావాన్ని పెంపొందించడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. 'పీపుల్, కల్చర్, స్పోర్ట్స్' నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని తెలుగు వారిని ఒకే వేదికపైకి తీసుకురావడంతో పాటు భావితరాలకు తెలుగు సంప్రదాయాలను పరిచయం చేయడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు అధ్యక్షుడు వీర వట్టికూటి పేర్కొన్నారు. షణ్ముఖ మక్కపాటి ఆధ్వర్యంలో సమన్వయకర్తలు మనోజ్, మహేష్, అనూష, కామేష్, శ్వేత, కిషోర్, సంతోష్, శివ, ఆదిత్య, చందుల సహకారంతో క్రీడా పోటీలు విజయవంతమయ్యాయి.

క్రీడలతో పాటు టాస్ఫ్ కల్చరల్ టీమ్ లీడ్ రవళి కోట, శిరీష మల్లుల ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దాదాపు 150 మంది కళాకారులు గానం, నృత్యం, ఫ్యాషన్ షో వంటి అంశాల్లో ప్రతిభ కనబరిచారు. 'కామ్రేడ్ కళ్యాణ్' చిత్ర దర్శకుడు జానకిరామ్ మారెళ్ల ప్రత్యేక అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. విదేశాల్లో తెలుగు సంఘాలు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంతో కలిసి పనిచేసిన సుబ్బారావు, టాస్ఫ్ ట్రస్టీలు నందు ధనేకుల, రావు బండారుపల్లి, అనిల్ లాకుమ్, బోస్ యలమంచి, రాంబాబు రావిపాటి తదితరులు కార్యక్రమానికి మద్దతు తెలియజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన క్రీడాకారులు, కళాకారులు, వాలంటీర్లు, స్పాన్సర్లు, తెలుగు కుటుంబాలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.



టీటీఎస్ ఆధ్వర్యంలో ఉత్సాహభరితంగా బౌలింగ్ టోర్నమెంట్

నాష్‌విల్లె (టెన్నెస్సీ): పురుషుల దినోత్సవాన్ని పురస్కరించుకుని టెన్నెస్సీ తెలుగు సమితి (TTS) ఆధ్వర్యంలో నిర్వహించిన బౌలింగ్ టోర్నమెంట్ అత్యంత ఉత్సాహభరిత వాతావరణంలో ముగిసింది. ఇందులో ప్రవాస తెలుగు వారు స్నేహపూర్వక వాతావరణంలో క్రీడా స్ఫూర్తితో ఉత్సాహంగా పాల్గొన్నారు. మొత్తం 8 జట్లు సత్తా చాటాయి. పోటీపడిన జట్లు, వాటి కెప్టెన్ల వివరాలు:
బనానా స్ప్లిక్ (వంశీ)
డ్రాగన్ స్ట్రైక్స్ (సారథి)
టీమ్ డబ్ల్యూపీ (అశ్విన్)
ఫ్రాంక్లిన్ లెజెండ్స్ (వెంకట)
మ్యాజిక్ సిటీ రోలర్స్ (అభిషేక్)
బ్రేకింగ్ పిన్స్ (విష్ణు)
బ్యాడ్ బీట్ స్ట్రైకర్స్ (సుధాగోని)
అమిగోస్ (నందగోపాల్)

హోరాహోరీగా సాగిన ప్రాథమిక రౌండ్ల అనంతరం బ్యాడ్ బీట్ స్ట్రైకర్స్, టీమ్ డబ్ల్యూపీ, బనానా స్ప్లిక్, బ్రేకింగ్ పిన్స్, డ్రాగన్ స్ట్రైక్స్ జట్లు తుది దశ (ఫైనల్ స్టేజ్)కు అర్హత సాధించాయి. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్ పోరులో బనానా స్ప్లిక్ జట్టు విజేతగా (ఛాంపియన్స్) నిలవగా బ్రేకింగ్ పిన్స్ జట్టు రన్నరప్ స్థానాన్ని కైవసం చేసుకుంది. విజేతలకు, రన్నరప్ జట్టుకు టెన్నెస్సీ తెలుగు సమితి కార్యవర్గం హృదయపూర్వక అభినందనలు తెలిపింది. టోర్నమెంట్ విజయవంతం కావడానికి కృషి చేసిన జట్ల కెప్టెన్లు, క్రీడాకారులు, నిర్వాహకులు, వాలంటీర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసింది. ప్రవాస తెలుగు వారి మధ్య ఐక్యత, స్నేహం, ఆత్మీయ అనుబంధాన్ని మరింత బలోపేతం చేస్తూ ఈ టోర్నీ ఘనంగా ముగిసింది.



'టాగ్కా' ఆధ్వర్యంలో స్వచ్ఛత డ్రైవ్

చార్లెట్ (నార్త్ కరోలినా): తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ చార్లెట్ ఏరియా (TAGCA) ఆధ్వర్యంలో సామాజిక సేవా దృక్పథంతో స్వచ్ఛతా కార్యక్రమాన్ని అత్యంత ఉత్సాహంగా నిర్వహించారు. సంస్థ తరపున దత్తత తీసుకున్న ప్రాంతాల్లో పారిశుధ్య డ్రైవ్ చేపట్టారు. టాగ్కా వాలంటీర్లు, ప్రవాస భారతీయులు పెద్ద సంఖ్యలో పాల్గొని అంకితభావంతో శ్రమించారు. రహదారుల వెంబడి ఉన్న చెత్తాచెదారాన్ని శుభ్రం చేసి, వ్యర్థాలను ప్లాస్టిక్ సంచుల్లో సేకరించి సురక్షితంగా తరలించారు. దీనిని ఒక సామాజిక బాధ్యతగా భావించి తాము నివసిస్తున్న నగర వీధులను పరిశుభ్రంగా ఉంచుతున్నామని వాలంటీర్లు చెప్పారు.



స్థానిక ఉగ్రమూకల నుంచి కశ్మీర్‌కు విముక్తి



కేంద్ర హోం మంత్రి అమిత్ షా వెల్లడి

స్థానిక ఉగ్రవాదుల నుంచి కశ్మీర్‌కు 35 ఏళ్ల తరువాత విముక్తి లభించిందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. తాజాగా జరిగిన లష్కరే తోయిబా కమాండర్ లతీఫ్ భట్ ఎన్‌కౌంటర్‌ను ప్రస్తావిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. కొన్ని సంవత్సరాలుగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత్ చేస్తున్న పోరాటంలో ఈ పరిణామం కీలక మైలు రాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ నేతృత్వంలో జరుగుతున్న 'యాంటీ-టెర్రర్ కాన్ఫరెన్స్ 2026'లో అమిత్ షా పాల్గొన్నారు. దేశవ్యాప్త ఉగ్రవాద నెట్‌వర్క్‌పై సమగ్ర దర్యాప్తు జరిపి, దాన్ని నిర్మూలించాలని ఆయన ప్రసంగించారు. అందరూ ఏకమై పోరాడితేనే టెర్రరిజం అంతమవుతుందని వివరించారు. ఉగ్రవాదం విషయంలో తమ ప్రభుత్వం 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తోందని వెల్లడించారు. 2019 నుంచి పరారీలో ఉన్న 303 మంది ఉగ్రవాదులను, 36 దేశాల నుంచి తాము రప్పించామని చెప్పారు.

లతీఫ్ భట్ హతం

జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో గత బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో లష్కరే తోయిబా ఉగ్రవాది లతీఫ్ భట్ హతమయ్యాడు. ఓ మసీదులో దాక్కున్న లతీఫ్ భట్‌ను లొంగిపోవాలని భారత భద్రతా బలగాలు విజ్ఞప్తి చేశాయి. అందుకు నిరాకరించిన అతడు.. బలగాలపై కాల్పులు జరిపాడు. వెంటనే భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆ ఉగ్రవాది మృత్యువాత పడ్డాడు. దీంతో జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం జిల్లాలో భద్రతా బలగాలకు భారీ విజయం లభించింది. దీనిపై స్పందించిన అమిత్ షా.. స్థానిక ఉగ్రవాదుల నుంచి కశ్మీర్‌కు విముక్తి లభించిందంటూ హర్షం వ్యక్తం చేశారు.

ఎన్‌కౌంటర్‌లో గ్యాంగ్‌స్టర్ నసీమ్ దురానీ హతం

ఢిల్లీ పోలీసుల బృందం, నోయిడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సంయుక్త ఆపరేషన్ సక్సెస్



ఢిల్లీలో సంచలనం సృష్టించిన కాల్పుల ఘటనలో ప్రధాన నిందితుడు, గ్యాంగ్‌స్టర్ నసీమ్ దురానీ పోలీసుల ఎన్‌కౌంటర్‌లో హతమయ్యాడు. ఉత్తరప్రదేశ్‌లోని బులంద్‌షహర్‌లో ఢిల్లీ పోలీసుల బృందం, నోయిడా స్పెషల్ టాస్క్‌ఫోర్స్ సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో మృతిచెందాడు. నవంబర్ 16న ఢిల్లీ న్యాయశాఖ మంత్రి కపిల్ మిశ్రా కార్యాలయానికి సమీపంలో సమీర్ అనే యువకుడిపై దుండగులు కాల్పులు జరిపారు. బైక్‌పై వచ్చిన వ్యక్తులు సుమారు 20 రౌండ్ల కాల్పులు జరిపి పారిపోయారు. తీవ్రంగా గాయపడిన సమీర్‌ను ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ హత్య కేసులో నసీమ్ దురానీ ప్రమేయం ఉన్నట్లు ఢిల్లీ పోలీసులు అనుమానించారు. హత్యకు నసీమ్ దురానీ, హరూన్ సైఫీ గ్యాంగుల మధ్య కొనసాగుతున్న గ్యాంగ్‌వారే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ఈ మేరకు నిందితులను పట్టుకునేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో బులంద్‌షహర్‌లో నసీమ్ దురానీ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఢిల్లీ పోలీసుల బృందం, నోయిడా ఎస్టీఎఫ్ సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టాయి. ఘటనాస్థలికి వెళ్లగా పోలీసులు, దురానీకి మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన నిందితుడిని పోలీసులు ఆసుపత్రికి తరలించారు. అయితే, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మరణించినట్లు నిర్ధారించారు. కాగా, దురానీకి అండర్‌వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు చెందిన డీ-కంపెనీతో సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఉన్నాయి. అలాగే, దావూద్ ఇబ్రహీంకు సన్నిహితుడైన చోటా షకీల్‌తోనూ పరిచయాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2016లో తిహార్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ చోటా రాజన్‌ను హత్య చేసేందుకు చోటా షకీల్.. దురానీకే బాధ్యతలు అప్పగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



కావేరీ వివాదంలో తమిళనాడుకు ఎదురుదెబ్బ


అదనపు జలాల విడుదలకు సుప్రీం నిరాకరణ

కావేరీ నదీ జలాల పంపిణీ వివాదంలో తమిళనాడుకు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. కర్ణాటక నుంచి అదనంగా 11 టీఎంసీల నీటిని విడుదల చేయించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీం కోర్టు కొట్టివేసింది. రాష్ట్రంలో నీటి కొరత కారణంగా పంటలు దెబ్బతింటున్నాయని తమిళనాడు ప్రభుత్వం వాదించినప్పటికీ, అదనపు నీటిని విడుదల చేయాలని కర్ణాటకకు ఆదేశాలు జారీ చేసేందుకు కోర్టు నిరాకరించింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ నిర్ణయం తీసుకుంది. కావేరీ నదిలో తమకు రావాల్సిన నీటి వాటాను కర్ణాటక సక్రమంగా విడుదల చేయడం లేదని తమిళనాడు ప్రభుత్వం ఆరోపించింది. జూలై నుంచి తమకు సుమారు 11 టీఎంసీల నీరు బకాయి ఉందని పేర్కొంది. ఈ నీటిని విడుదల చేయకపోవడంతో రాష్ట్రంలోని వ్యవసాయ రంగంపై ప్రభావం పడుతోందని, ముఖ్యంగా కావేరీ డెల్టా ప్రాంతంలోని పంటలు దెబ్బతింటున్నాయని కోర్టుకు వివరించింది. కావేరీ జల నిర్వహణ ప్రాధికార సంస్థ, కావేరీ జల నియంత్రణ కమిటీ ఆదేశాలు ఇచ్చినప్పటికీ తమకు రావాల్సిన నీరు అందడం లేదని తమిళనాడు వాదించింది. తమిళనాడు వాదనలను కర్ణాటక ప్రభుత్వం వ్యతిరేకించింది. తమ రాష్ట్రంలోని పలు జిల్లాలు కూడా కరవు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని కోర్టుకు తెలిపింది. కావేరీ పరీవాహక ప్రాంతంలోని జలాశయాలకు నీటి రాక గణనీయంగా తగ్గిందని, ఇలాంటి పరిస్థితుల్లో అదనపు నీటిని విడుదల చేయాలని ఆదేశించడం సాధ్యం కాదని కర్ణాటక తరఫు న్యాయవాదులు వాదించారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన సుప్రీం ధర్మాసనం తమిళనాడు పిటిషన్‌ను కొట్టివేసింది.

ధైర్యసాహసాలకు మరోపేరు 9 పారా స్పెషల్ ఫోర్స్



జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాది లతీఫ్ భట్‌ను మట్టుబెట్టేందుకు భద్రతా బలగాలు చేపట్టిన ఆపరేషన్ విజయవంతమైన సంగతి తెలిసిందే. అత్యంత ధైర్యసాహసాలు ప్రదర్శించిన భారత సైన్యం ఈనెల 18 తెల్లవారుజామున లతీఫ్ భట్‌ను హతమార్చింది. ఈ సందర్భంగా భారత సైన్యానికి చెందిన ఓ కమాండో వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. గుబురు గడ్డం, ఖాకీ దుస్తులు, ఏకే-203 రైఫిల్, మిలిటరీ పరికరాలతో అతడి లుక్ నెటిజన్లను ఆకట్టుకుంటోంది. ఈ సందర్భంగా భారత సైన్యంలోని ప్రతిష్ఠాత్మక దళమైన 9 పారా స్పెషల్ ఫోర్స్ మరోసారి చర్చనీయాంశంగా మారింది.



తాజ్‌మహల్ సందర్శన కుదరదు

పాక్ వాతావరణ శాఖ మంత్రి ముసాదిక్ మాలిక్‌కు తేల్చి చెప్పిన భారత్, ముసాదిక్‌పై విరుచుకుపడిన విపక్షాలు

షాంఘాయ్ కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సీఓ) సివిలైజేషనల్ డైలాగ్ ఫోరమ్ సదస్సులో పాల్గొనేందుకు పాక్ మంత్రి ముసాదిక్ మాలిక్ న్యూఢిల్లీకి వచ్చారు. అయితే, తాజ్‌మహల్ సందర్శించేందుకు ఆయనకు అనుమతి లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తాజాగా స్పష్టం చేశాయి. ఆగ్రాలోని తాజ్‌మహల్‌తో పాటు న్యూఢిల్లీలోని హజ్రత్ నిజాముద్దీన్ దర్గా సందర్శనకు ఆయన అనుమతి కోరగా కేంద్రం నిరాకరించినట్లు తెలిసింది. ఆయన వీసా కేవలం ఎస్‌సీఓ సదస్సులో పాల్గొనేందుకు మాత్రమేనని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. నేటి నుంచి ఈ సదస్సు ప్రారంభమైంది. నవంబర్ 22 వరకూ కొనసాగుతుంది. ఇందులో పాల్గొనేందుకు మంత్రి ముసాదిక్ మాలిక్ సారథ్యంలో పాక్ బృందం కూడా వచ్చింది. ఎస్‌సీఓ దేశాల నాగరికతలు, సంస్కృతిపై చర్చకు ఇది అద్భుత అవకాశమని పాక్ మంత్రి ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సంస్కృతి, నాగరికతలకు ఎలాంటి సరిహద్దులు ఉండవని అన్నారు.

'మన చరిత్ర, సంస్కృతి, భౌగోళిక అంశాలు, నాగరికతలపై చర్చించేందుకు భారత్‌కు రావడం ఎంతో ఆనందంగా ఉంది' అని వ్యాఖ్యానించారు. ఎస్‌సీఓ కౌన్సిల్ ఆఫ్ హెడ్స్ ఆఫ్ స్టేట్‌కు 2026-27 సంవత్సరానికి గాను పాక్ సారథ్యం వహిస్తోంది. వచ్చే ఏడాది జరగనున్న శిఖరాగ్ర సమావేశాల్లోపు అనేక సదస్సులకు పాక్ ఆతిథ్యం ఇవ్వనుంది. ఇక ఎస్‌సీఓ దేశాల మధ్య ఉమ్మడి నాగరికతపై చర్చించేందుకు, సహకారాన్ని మరింత పెంపొందించేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కేంద్రం అనుసరిస్తున్న విదేశాంగ విధానాలపై ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. సింధూ జలాల ఒప్పందం నిలిపివేత సమయంలో ముసాదిక్ మాలిక్ తీవ్ర, అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. 'మా నీళ్లను ముట్టుకుంటే చేతులు నరికేస్తాం' అంటూ ఆయన అప్పట్లో హెచ్చరికలు చేశారు. అయితే ఇప్పుడు ముసాదిక్ మాలిక్ భారత్‌లో పర్యటించడం వివాదానికి దారి ఇచ్చింది. బీజేపీ విదేశాంగ విధానం గందరగోళ మయంగా ఉందని సమాజ్‌వాది పార్టీ నాయకుడు ఫక్రుల్ హసన్ విమర్శించారు. మరోవైపు కాంగ్రెస్ ముసాదిక్ మాలిక్ రాకపై సెటైర్లు పేల్చింది. ఉగ్రవాదానికి ఎప్పుడూ వ్యతిరేకమని చెప్పే బీజేపీ.. పాకిస్థాన్ మంత్రిని స్వాగతిస్తోందని చురకలంటించింది. 'విదేశీ వ్యవహారాల అంశంలో కేంద్రం అయోమయ స్థితిలో ఉంది. భారతీయ క్రికెటర్లను పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా ఆడాలని బీజేపీ కోరుతుంది. మరోవైపు అదే పార్టీ.. పాక్ మంత్రులకు ఆహ్వానం పలుకుతోంది. గందరగోళ ప్రధానమంత్రి మోదీ ఒత్తిడిలో పని చేస్తున్నట్టున్నారు' అని ఇండి కూటమి నాయకుడు సురేంద్ర రాజ్‌పూత్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారి.. పాకిస్థాన్ వాతావరణ శాఖ మంత్రిపై మండిపడ్డారు. గతంలో ముసాదిక్ మాలిక్ చేసిన వ్యాఖ్యలు ఉగ్రవాదుల హెచ్చరికలకు ఏమాత్రం తీసిపోవని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా నవంబర్ 20 నుంచి 22 వరకు ఎస్‌సీఓ సమావేశం జరగనుంది. ఇందులో చైనా, రష్యా, భారత్, పాకిస్థాన్, ఇరాన్, కజకిస్థాన్, కిర్గిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, బెలారస్ దేశాలు పాల్గొంటాయి.

మళ్లీ ముదురుతున్న ఉద్రిక్తతలు

అమెరికా ఆరోపణలను తీవ్రంగా ఖండించిన ఇరాన్



అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి పెరుగుతున్నాయి. ఇరాన్ జీవ, రసాయన ఆయుధాలను తయారు చేసేందుకు ప్రయత్నిస్తోందంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ ఆరోపణలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. అమెరికా గతంలో ఇరాక్‌పై చేసిన ఆరోపణలను గుర్తుచేస్తూ ఘాటుగా స్పందించింది. ఇరాన్ అణ్వాయుధాలను పొందకుండా అమెరికా అడ్డుకుందని, దీంతో ఇప్పుడు ఆ దేశం జీవ, రసాయన ఆయుధాల తయారీపై దృష్టి పెట్టే అవకాశముందని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఒకవేళ అమెరికాపై ఇరాన్ దాడికి ప్రయత్నిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ట్రంప్ ఆరోపణలపై ఇరాన్ విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయీ స్పందించారు. 2003లో ఇరాక్‌పై దాడికి ముందు సామూహిక విధ్వంసక ఆయుధాల పేరుతో చేసిన ప్రచారాన్నే అమెరికా ఇప్పుడు మళ్లీ తెరపైకి తెస్తోందని పేర్కొన్నారు. గతంలో ఇరాక్‌పై కూడా అమెరికా ఇలాంటి ఆరోపణలే చేసిందని గుర్తుచేశారు. 2003లో అప్పటి అమెరికా విదేశాంగ మంత్రి కోలిన్ పావెల్ ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో ప్రసంగిస్తూ ఇరాక్ వద్ద సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయంటూ చిన్న సీసాను ప్రదర్శించిన విషయాన్ని బఘాయీ ప్రస్తావించారు. అసత్య ప్రచారాలు చేసి ఇరాక్‌పై సైనిక దాడికి ప్రజల మద్దతు కూడగట్టేందుకు అమెరికా ప్రయత్నించిందని అన్నారు. ఇప్పుడు ఇరాన్‌పై కూడా అదే తరహా ప్రచారానికి తెర తీశారని విమర్శించారు.



బాలీలో భారీ వినాయక విగ్రహం

గిన్నిస్ రికార్డులకెక్కిన అతిపెద్ద కళాఖండం

బాలీలో ఇటీవల ఏర్పాటు చేసిన 50 అడుగుల వినాయక విగ్రహం గిన్నిస్ రికార్డులోకెక్కింది. సింథటిక్ రట్టన్‌తో (పాలీఇథినీల్ ప్లాస్టిక్) నిర్మించిన అతిపెద్ద కళాఖండంగా గుర్తింపు సొంతం చేసుకుంది. అలాస్ హరూమ్ బాలీ అనే కళాకారుడు ఈ విగ్రహాన్ని రూపొందించారు. న్యూఢిల్లీలోని ఇండోనేషియా ఎంబసీ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించింది. బాలీలోని గియాన్యార్‌లో ఈ కళాఖండాన్ని ఏర్పాటు చేసినట్టు వెల్లడించింది. ఈ విషయాలను ఇండోనేషియాలోని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ కూడా ధ్రువీకరించింది. ముస్లిం జనాభా అత్యధికంగా ఉన్న దేశాల్లో ఇండోనేషియా మొదటి స్థానంలో ఉన్న విషయం తెలిసిందే. అయితే, ఆ దేశంపై హిందూ, బౌద్ధమతాల ప్రభావం కూడా ఉంది. అక్కడి ఆలయాలు, శిల్పాలు, కళలు, సంప్రదాయాల్లో ఈ ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తుంటాయి. ఇక బాలీలో హిందూమత ప్రభావం మరింత ఎక్కువ. అక్కడి దైనందిన జీవితంలో అడుగడుగునా ఈ ప్రభావం కనిపిస్తుంటుంది. బాలీ ద్వీపంలో అనేక హిందూ దేవాలయాలు ఉన్నాయి. స్థానికంగా వీటిని పురా అని పిలుస్తుంటారు. రామాయణం నేపథ్యంగా అక్కడి నాటకాల్లో సంప్రదాయక నృత్యాలను ప్రదర్శిస్తుంటారు.

అవాంతరాలు లేకుండా అందరికీ ఇంధనం

అమెరికా, చైనా, రష్యా అధినేతల సంయుక్త ప్రకటన



ప్రపంచంలోని అన్ని దేశాలకు ప్రయోజనం కలిగేలా ఎలాంటి అవాంతరాలు లేకుండా ఇంధన సరఫరా కొనసాగేలా చూడాలని అమెరికా, చైనా, రష్యా నిర్ణయించాయి. చమురు ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో ఉత్పత్తి, సరఫరాను పెంచుతామని ప్రకటించాయి. ప్రపంచ శాంతి సుస్థిరతలను కాపాడే బాధ్యత తమపై ఉందని ఈ మూడు దేశాల అధ్యక్షులు డొనాల్డ్ ట్రంప్, జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ అన్నారు. ఈ ప్రకటన నేపథ్యంలో రష్యా చమురుపై అమెరికా విధించిన ఆంక్షలను ఎత్తివేసే అవకాశం ఉంది. దీనివల్ల రష్యాతోపాటు ఆ దేశ చమురును భారీగా దిగుమతి చేసుకునే భారత్, చైనా అధికంగా ప్రయోజనం పొందుతాయి. చైనాలోని షెంజెన్‌లో జరిగిన ఆసియా – పసిఫిక్ ఎకనమిక్ కో ఆపరేషన్ (అపెక్) 33వ వార్షిక సదస్సు ముగింపు సందర్భంగా ఈ ముగ్గురు అగ్ర రాజ్యాల అధినేతలు గురువారం త్రైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఉమ్మడిగా 'ప్రపంచ శాంతి కోసం రష్యా, చైనా, అమెరికా అధినేతల ఉమ్మడి ప్రకటన' పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు. పుతిన్, ట్రంప్‌తో జిన్‌పింగ్ వేర్వేరుగా ద్వైపాక్షిక చర్చలు కూడా జరిపారు. ఉమ్మడి ప్రకటనలో ప్రధానంగా ప్రపంచ శాంతి, అవాంతరాలు లేని ఇంధన సరఫరా, అణ్వాయుధాల నియంత్రణ, ఐక్యరాజ్య సమితిలో సంస్కరణలను ప్రస్తావించారు. 'ఐక్యరాజ్య సమితి తన ప్రాథమిక లక్ష్యాలైన ప్రపంచ శాంతిభద్రతలను కాపాడటంలో మరింత సమర్థంగా పనిచేసేలా ఆ సంస్థలో అర్థవంతమైన సంస్కరణలు చేపట్టేందుకు.. భద్రతా మండలిలో శాశ్వత సభ్యదేశాలుగా మేము కట్టుబడి ఉన్నాం. ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరా స్థిరంగా కొనసాగేందుకు, అన్ని దేశాలకు ఉపయోగపడేలా శుద్ధిచేసిన పెట్రోలియం ఉత్పత్తుల తయారీ, సరఫరాను మరింత పెంచాలని తీర్మానించాం. అంతర్జాతీయ నేర న్యాయస్థానం.. అలాంటి ఇతర సంస్థలు తమ పరిధిని దాటి దేశాల అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోరాదన్న అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తంచేస్తున్నాం. అణ్వాయుధాలతో జరిగే యుద్ధంలో గెలుపు అంటూ ఉండదు. అలాంటి యుద్ధాలు ఎట్టిపరిస్థితుల్లో జరగకూడదు. ప్రపంచానికి అణ్వాయుధ ముప్పును తప్పించేందుకు, అణ్వాయుధాల సంఖ్యను నియంత్రించేందుకు చర్చలు జరపాలని నిర్ణయించాం' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ చర్చల్లో అణ్వాయుధాల నియంత్రణ అంశాన్ని ట్రంప్ ప్రధానంగా ప్రస్తావించారు. 'మనం నిజంగానే చరిత్ర సృష్టిస్తున్నాం. భూమిపై అణ్వాయుధాల సంఖ్యను తగ్గించే అంశంపై చర్చల కోసం మన మూడు దేశాలు తమవైన విధానాలతో సిద్ధంగా ఉన్నాయి' అని పేర్కొన్నారు. 'అగ్రరాజ్యాల మధ్య స్నేహపూర్వక చర్చలు ఆప్షన్‌లా ఉండకూడదు. చర్చలు తప్పనిసరి అంశంగా ఉండాలి. అగ్రరాజ్యాలు యుద్ధం చేసుకుంటే ప్రపంచం అల్లకల్లోలం అవుతుంది. ప్రపంచ శాంతి సుస్థిరతలకు మన మూడు దేశాలు రక్షకులుగా ఉండాలి' అని జిన్‌పింగ్ అన్నారు. 'మన మూడు దేశాలు నిర్మాణాత్మక సహకారంతో మెలిగితే ప్రపంచం సుస్థిరంగా ఉంటుంది' అని పుతిన్ పేర్కొన్నారు.

అమెరికా కాంగ్రెస్ సభ్యుల మానవీయ కోణం



భారతీయ వృద్ధురాలికి న్యాయం కోసం చట్టసభలో ప్రతిపాదనలు

అమెరికాలో మూడు దశాబ్దాలుగా ఉంటున్న ఓ భారతీయ వృద్ధురాలిని డిపోర్టు చేయడం యావత్ దేశాన్ని కదిలించింది. ఇంతటి అన్యాయం మరొకరి విషయంలో జరగకూడదని కంకణం కట్టుకున్న నలుగురు కాంగ్రెస్ (అమెరికా చట్టసభలు) సభ్యులు కొత్త బిల్లును తీసుకొచ్చారు. ప్రొటక్ట్ అవర్ నైబర్స్ యాక్ట్ పేరుతో ఈ బిల్లును కాంగ్రెస్‌మన్ జూన్ జెరామెండీ ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు ప్రతినిధుల సభ సభ్యులు లతీఫా సైమన్, జో లాఫ్‌గ్రెన్, వాన్ వార్గాస్ మద్దతు తెలిపారు. కాలిఫోర్నియాలోని శాన్‌ఫ్రాన్సిస్కో బే ఏరియాలో దాదాపు 30 ఏళ్లగా ఉంటున్న హర్జీత్ కౌర్ (73), ఇమిగ్రేషన్ శాఖ అధికారులు గతేడాది బలవంతంగా భారత్‌కు పంపించేశారు. ఆమె తన డిస్ట్రిక్ట్‌లోనే దశాబ్దాలుగా ఉంటున్నారని ప్రతినిధుల సభ సభ్యుడు సైమన్ పేర్కొన్నారు. ఆమెపై ఎలాంటి నేరారోపణలు లేకపోయినా పంపించేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇమిగ్రేషన్ శాఖ నిబంధనలన్నీ ఆమె తూచా తప్పకుండా పాటించిందని చెప్పారు. అధికారుల సూచన మేరకు హర్జీత్ కౌర్ ప్రతి ఆరు నెలలకు ఒకసారి వారి ముందు విచారణకు హాజరయ్యేవారని చెప్పారు. గత 13 ఏళ్లుగా ఆమె క్రమం తప్పకుండా ఇలాగే చేశారని అన్నారు. కానీ, ట్రంప్ సర్కారు ఆదేశాల నేపథ్యంలో ఇమిగ్రేషన్ అధికారులు కౌర్‌ను అన్యాయంగా, నిర్హేతుకంగా నిర్బంధించి ఆ తరువాత పంపించేశారని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా అమెరికాలో తమకంటూ ఓ జీవితాన్ని నిర్మించుకున్న కౌర్ లాంటి వేల మందిని అన్యాయంగా డిపోర్ట్ చేశారని జెరామెండీ ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికన్ ఇమిగ్రేషన్ కౌన్సిల్ లెక్కల ప్రకారం, డిపోర్టేషన్ ఆదేశాలు ఎదుర్కొంటున్న 1.19 మిలియన్ల మంది ప్రస్తుతం అమెరికాలోనే ఉంటున్నారు. ఇప్పటికే వేల మంది అక్కడ సుస్థిర నివాసం ఏర్పాటు చేసుకుని స్థిరపడ్డారు. అయినప్పటికీ ట్రంప్ సర్కారు కఠిన వైఖరి ఆధారంగా ఇమిగ్రేషన్ అధికారులు తుది డిపోర్టేషన్ ఆదేశాల అమలుకు దిగారు. ఈ నేపథ్యంలో తుది డిపోర్టేషన్ ఆదేశాలు జారీ చేసిన 10 ఏళ్ల కాల పరిమితి తరువాత అవి వాటంతట అవే రద్దైపోయేలా నలుగురు కాంగ్రెస్ సభ్యులు కొత్త బిల్లు తీసుకొచ్చారు. అమెరికా అంతర్గత భద్రతా విభాగం విజ్ఞప్తి మేరకు ఇమిగ్రేషన్ జడ్జ్ ఈ ఆదేశాలను పునరుద్ధరించే అవకాశం ఉంటుంది. అయితే, ఇందుకోసం స్పష్టమైన కారణాలను కూడా చెప్పాల్సి ఉంటుంది. ఇక తుది డిపోర్టేషన్ ఆదేశాల కాలగడువు ముగిశాక విదేశస్తులు చట్టబద్ధంగా అమెరికాలో ఉండేందుకు అనుమతికి దరఖాస్తు చేసుకోవచ్చు. 10 ఏళ్ల పాటు నిరంతరంగా అమెరికాలోనే ఉన్న వారికే ఈ అనుమతి లభించేలా బిల్లులో ప్రతిపాదనలు చేర్చారు.

రాహుల్, యశస్వి అర్ధ శతకాలు



కివీస్‌కు టీమిండియా దీటైన జవాబు.. 39 ఓవర్లలో 159/1

న్యూజిలాండ్‌తో జరుగుతున్న తొలి టెస్ట్‌లో టీమిండియా దీటుగా బదులిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ 368 పరుగులకు అలౌటవ్వగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 39 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 159 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ అర్ధ శతకంతో క్రీజులో నిలవగా.. యశస్వి జైస్వాల్ శతకానికి చేరువగా వచ్చి వెనుదిరిగాడు. దేవదత్ పడిక్కల్ మరో ఎండ్‌లో ఉన్నాడు.

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో చేసిన 368 పరుగుల కంటే భారత్ ఇంకా 209 పరుగులు వెనుకబడి ఉంది. 368 పరుగుల లక్ష్యంతో తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన భారత్‌కు ఓపెనర్లు జైస్వాల్, రాహుల్ శుభారంభం అందించారు. న్యూజిలాండ్ పేసర్లను సమర్థంగా ఎదుర్కొంటూ తొలి వికెట్‌కు 125 పరుగులు జోడించారు. జైస్వాల్ దూకుడుగా ఆడుతూ బౌండరీలతో అలరించగా.. రాహుల్ ఆచితూచి బ్యాటింగ్ చేశాడు.

ఈ క్రమంలో వీరిద్దరూ అర్ధశతకాలు సాధించారు. భారత్ టెస్టు చరిత్రలో 17 మ్యాచ్‌లు, 30 ఇన్నింగ్స్‌ల తర్వాత తొలి వికెట్‌కు శతక భాగస్వామ్యం నమోదైంది. ధాటిగా ఆడిన జైస్వాల్ 89 బంతుల్లో 16 ఫోర్లతో 85 పరుగులు చేసి ఔటయ్యాడు. మాట్ హెన్రీ బౌలింగ్‌లో టామ్ బ్లండెల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం క్రీజులోకి వచ్చిన పడిక్కల్.. రాహుల్‌తో కలిసి మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడాడు. రాహుల్ 116 బంతుల్లో ఐదు ఫోర్లతో 52 పరుగులు చేయగా పడిక్కల్ 35 బంతుల్లో మూడు ఫోర్లతో 16 పరుగులు చేశాడు. రెండో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ స్కోరు 39 ఓవర్లలో 159/1గా ఉంది.

రాహుల్ ఖాతాలో అరుదైన ఘనత

ఈ అర్ధ శతకంతో కేఎల్ రాహుల్ అరుదైన ఘనత సాధించాడు. దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, న్యూజిలాండ్ (సేనా) దేశాల్లో టెస్టు ఇన్నింగ్స్‌లో 50కిపైగా పరుగులు చేసిన భారత తొలి ఓపెనర్‌గా నిలిచాడు. న్యూజిలాండ్‌పై టెస్టుల్లో రాహుల్‌కు ఇదే తొలి అర్ధ శతకం.



టైటిలే లక్ష్యంగా...
దిల్లీ క్యాపిటల్స్‌కు మహేల జయవర్ధనే



శ్రీలంక స్టార్ క్రికెటర్ మహేల జయవర్ధనే 13 ఏళ్ల విరామం తర్వాత మళ్లీ ఢిల్లీ ఫ్రాంచైజీలోకి అడుగుపెడుతున్నారు. ఐపీఎల్ 2012, 2013 సీజన్లలో ఆయన ఢిల్లీ డేర్‌డెవిల్స్ తరపున ఆడటంతో పాటు కెప్టెన్‌గా కూడా వ్యవహరించారు. గత సీజన్ వరకు ముంబై ఇండియన్స్ టీంకు హెడ్ కోచ్‌గా పని చేసి మూడు ఐపీఎల్ టైటిళ్లు (2017, 2019, 2020) నెగ్గడంలో కీలక పాత్ర పోషించారు. నేడు మహేలను ఢిల్లీ క్యాపిటల్స్ తమ వుమెన్ ప్రీమియర్ లీగ్ జట్టుకు 'డైరెక్టర్ ఆఫ్ క్రికెట్'గా నియమించింది. జట్టు వ్యూహం, ప్రతిభను గుర్తించడం, ఆటగాళ్లు, కోచింగ్ సిబ్బంది అభివృద్ధి సహా ఫ్రాంచైజీకి సంబంధించిన అన్ని క్రికెట్ విషయాలను జయవర్ధనే పర్యవేక్షిస్తారని ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో ధ్రువీకరించింది. 2027 డబ్ల్యూపీఎల్ సీజన్‌కు ముందు ఢిల్లీ క్యాపిటల్స్ ఫ్రాంచైజీ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. ఇప్పటివరకు డబ్ల్యూపీఎల్‌లో నాలుగు సార్లు రన్నరప్‌గా నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్, మెన్స్ ఐపీఎల్‌లో తొలి టైటిల్ సాధించాలనే లక్ష్యంతో జయవర్ధనే అనుభవాన్ని వినియోగించుకోనుంది. హెడ్ కోచ్ జోనాథన్ బాటీ, కెప్టెన్ జెమీమా రోడ్రిగ్స్‌తో కలిసి ఆయన పని చేస్తారు. 2027 డబ్ల్యూపీఎల్ సీజన్ జనవరి 14న ప్రారంభం కానుండగా... ఢిల్లీ క్యాపిటల్స్ తమ తొలి మ్యాచ్‌ను జనవరి 16న వడోదరలో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో ఆడనుంది.

వరల్డ్ నెం.4కు రక్షిత ఝలక్

- క్వార్టర్ ఫైనల్లో భారత షట్లర్

- సాత్విక్ జోడీ, లక్ష్యసేన్, శ్రీకాంత్ కూడా...



కౌలూన్ (హాంకాంగ్): భారత టీనేజ్ షట్లర్ రక్షితా రామ్‌రాజ్ తన అంతర్జాతీయ కెరీర్‌లో అతి పెద్ద సంచలనం నమోదు చేసింది. హాంకాంగ్ ఓపెన్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో ఏకంగా టోక్యో ఒలింపిక్ చాంపియన్‌కు షాకిచ్చింది. ఇక లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ ద్వయం కూడా టోర్నీలో ముందంజ వేశారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో 19 ఏళ్ల రక్షిత వరుస గేముల్లో 21-18, 24-22తో వరల్డ్ నెం.4, టోక్యో ఒలింపిక్ చాంపియన్ చెన్ యూఫీ (చైనా)ని చిత్తు చేసి క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. క్వార్టర్స్‌లో థాయ్‌లాండ్‌కు చెందిన పోర్న్‌పవీ చొచువాంగ్‌తో రక్షిత ఆడనుంది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో సాత్విక్/చిరాగ్ ద్వయం 21-19, 21-16తో నూర్ మహ్మద్/టాన్‌వీ రియాంగ్ (మలేసియా) జోడీని ఓడించింది. కాగా లక్ష్యసేన్ 21-11, 21-18తో రాస్ముస్ (డెన్మార్క్)పై, శ్రీకాంత్ 12-21, 21-18, 21-14తో యో టీ బిన్(కొరియా)పై విజయంతో క్వార్టర్ ఫైనల్‌కు చేరారు. మహిళల డబుల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్లో గాయత్రి/ట్రీసా జోడీ 20-22, 13-21తో అమెరికా ద్వయం లారెన్/అలీసన్ చేతిలో పరాజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించింది.

ప్రధానిని కలిశాక అదృష్టం కలిసొచ్చింది: సూర్యకుమార్ యాదవ్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసిన తర్వాత తనకు అదృష్టం కలిసి వచ్చిందని, మళ్లీ పరుగుల వరద పారించడం మొదలుపెట్టానని స్టార్ క్రికెటర్ సూర్యకుమార్ యాదవ్ తెలిపారు. 2026 టీ20 ప్రపంచకప్ విజయంలో కీలక పాత్ర పోషించినందుకు న్యూఢిల్లీలో జరిగిన 'ఇండియన్ ఆఫ్ ద ఇయర్' వేడుకలో ఆయనకు 'అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్' అవార్డు లభించింది. ఈ సందర్భంగా సూర్య మాట్లాడుతూ... నవంబరు 6న ప్రధాని మోదీతో జరిగిన సమావేశం తన కెరీర్‌లో మలుపుగా నిలిచిందని పేర్కొన్నారు. సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో హైదరాబాద్‌పై 21 బంతుల్లో 60లి, గుజరాత్‌పై 29 బంతుల్లో 82 పరుగులతో వరుస హాఫ్ సెంచరీలు బాదిన సూర్య, గోవాపైనా 12 బంతుల్లో 25 పరుగులతో మెరిశారు. దేశవాళీ క్రికెట్‌లో ఈ జోరును కొనసాగిస్తూ మళ్లీ భారత జట్టులో చోటు దక్కించుకోవడమే తన లక్ష్యమని, 2027 ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు టైటిల్ అందించాలని ఆశిస్తున్నట్టు ఆయన వెల్లడించారు.

'ప్రధాని మోదీతో భేటీ తర్వాత నాకు అదృష్టం కలిసి వచ్చింది. మళ్లీ పరుగులు చేయడం మొదలుపెట్టా. కేవలం 5 నుంచి 10 నిమిషాలే ఉంటాయనుకున్న సమావేశంలో ఆయన నాకు, నా కుటుంబానికీ దాదాపు 40-45 నిమిషాలు కేటాయించారు. అది ఎంతో మధురమైన క్షణం. క్లిష్ట పరిస్థితులను, ఒత్తిడిని ఎలా ఎదుర్కొంటారనే విషయంపై ఆయన్ను అడిగాను. అన్ని ప్రశ్నలకూ ఎంతో ఓపికగా, తేలికగా సమాధానమిచ్చారు.' అని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

ఆ పేరు కారణంగానే సిరాజ్‌ను సెలెక్ట్ చేయలేదు

దుమారం రేపుతున్న రాజకీయ విమర్శలు



న్యూజిలాండ్‌తో జరిగే టెస్ట్ తుది జట్టు నుంచి స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్‌ను తొలగించడంపై రాజకీయ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అతడిని జట్టు నుంచి తొలగించడం మత వివక్ష అని... కేవలం అతడి పేరు కారణంగానే పక్కనబెట్టారని కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ తీవ్ర ఆరోపణలు చేశారు. అతను గత పర్యటనల్లో బాగా రాణించినప్పటికీ తుది జట్టులో చోటు దక్కించుకోలేకపోయాడని, దీనికి ప్రధాన కారణం అతడి పేరు 'సిరాజ్' కావడమే. కేవలం పేరు కారణంగానే అతడికి తుది జట్టులో అవకాశమివ్వడం లేదని విమర్శించారు. బాగా ఆడుతున్నప్పటికీ అతడిని ఎంపిక చేయకపోతే అది వివక్షే అవుతుందని ఎంపీ మసూద్ మండిపడ్డారు. మసూద్ ఆరోపణలను బీజేపీ 'అసంబద్ధమైనవి'గా కొట్టిపారేసింది. అన్ని నిర్ణయాలు ఆట పరిస్థితుల ఆధారంగానే తీసుకున్నామని భారత జట్టు యాజమాన్యం పేర్కొంది. బీజేపీ అధికార ప్రతినిధి ప్రదీప్ భండారీ తిప్పికొట్టారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసమే కాంగ్రెస్ ఈ డ్రామా ఆడుతుంది. నిజంగా కాంగ్రెస్ పార్టీకి ఇది సిగ్గుచేటని ఇప్పుడు క్రికెట్ జట్టు ఎంపికలోనూ రాజకీయాలు మొదలుపెట్టిందని విమర్శించారు. మరోవైపు సునీల్ గవాస్కర్, రవిశాస్త్రి వంటి భారత క్రికెట్ దిగ్గజాలు కూడా సిరాజ్‌ను జట్టు నుంచి తొలగించడాన్ని ప్రశ్నించారు. ఆట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జట్టు ప్రాధాన్యతల ప్రకారమే తీసుకున్నామని భారత జట్టు యాజమాన్యం పేర్కొంది.

ధోనీ ఆటకు ముషారఫ్ ఫిదా

బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా



టీమిండియా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాడు. తన సారథ్యంలో చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు ఐదు సార్లు టైటిల్స్ అందించాడు. ధోనీ 19 ఏళ్ల సుదీర్ఘ ఐపీఎల్ ఆటగాడి ప్రస్థానానికి వీడ్కోలు పలకడంపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. ధోనీ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు. ఆట పట్ల ధోనీ అత్యంత నిజాయతీపరుడని, 100 శాతం శ్రమించగలనని భావించినప్పుడే మైదానంలోకి దిగుతాడని ప్రశంసించారు. ధోనీ ప్రదర్శనకు నాటి పాక్ ప్రధాని పర్వేజ్ ముషారఫ్ సైతం ముగ్ధులయ్యారని శుక్లా గుర్తు చేశారు.

రాజీవ్ శుక్లా మీడియాతో మాట్లాడుతూ... జట్టు విజయం అనేది తన వల్ల 99 శాతం సాధ్యమవుతుందని, ఒక్క శాతం మాత్రం తగ్గుతుందని అనిపించినా కూడా వెంటనే తప్పుకునే వ్యక్తిత్వం ధోనిదని పేర్కొన్నారు. ఎంతో ఆలోచించే ఐపీఎల్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడని, ఇకపై చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే) మెంటార్‌గా జట్టుకు ఎంతో మేలు చేస్తాడని విశ్వాసం వ్యక్తం చేశారు. తమిళనాడులో ధోనికి 'తలా'గా విశేష ఆదరణ ఉన్నప్పటికీ, అంతకుమించి కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు దేశవ్యాప్తంగా అభిమానులున్నారని శుక్లా గుర్తు చేశారు. 2007లో టీమిండియా కెప్టెన్‌గా ధోనిని నియమించినప్పుడు తొలుత అనేక సందేహాలు వ్యక్తమయ్యాయని తెలిపారు. సచిన్ సైతం ఆ బాధ్యతను తిరస్కరించిన వేళ ధోనీ సారథ్యం చేపట్టి తన ఆటతీరుతో విమర్శకుల నోళ్లు మూయించాడని శుక్లా వెల్లడించారు.

క్లిష్టమైన, ప్రతికూల పరిస్థితుల్లోనూ జట్టును విజయతీరాలకు చేర్చడం ధోనీ ప్రత్యేకతని రాజీవ్ ప్రశంసించారు. 2006 పాకిస్థాన్ పర్యటన నాటి మధుర జ్ఞాపకాలను ఈ బీసీసీఐ ఉపాధ్యక్షుడు పంచుకున్నారు.

చైతన్య రథం
సినిమా
శనివారం 21 నవంబరు 2026 X

పెళ్లి పీటలెక్కనున్న టాలీవుడ్ నటుడు



ప్రముఖ నిర్మాత రాజ్ కందుకూరి తనయుడు, టాలీవుడ్ యువ నటుడు శివ కందుకూరి త్వరలో వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారు. హైదరాబాద్‌కు చెందిన ఆర్కిటెక్ట్ శిశిర సింహతో ఆయన వివాహం వచ్చే నెలలో జరగనుంది. తన కాబోయే జీవిత భాగస్వామి శిశిర సింహతో కలిసి దిగిన ఫొటోలను శివ కందుకూరి సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

జీవితంలో మొదలైన ఈ కొత్త, అందమైన ప్రయాణం జీవితాంతం కొనసాగాలని ఆయన ఆకాంక్షించారు. ఇరు కుటుంబాల పెద్దల అంగీకారంతో, సన్నిహితుల మధ్య వీరి నిశ్చితార్థ వేడుక జరిగినట్టు సమాచారం. కాగా కందుకూరి కుటుంబంలో పెళ్లి సందడి మొదలైంది. ఈ జంట తమ కొత్త జీవితాన్ని ప్రారంభించబోతున్న సందర్భంగా సినీ ప్రముఖులు, అభిమానులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.

2020లో వచ్చిన 'చూసి చూడంగానే' సినిమాతో శివ కందుకూరి హీరోగా తెలుగు తెరకు పరిచయమయ్యారు. ఆ తర్వాత గమనం, మనుచరిత్ర, భూతద్దం భాస్కర్ నారాయణ, మనమే, అనగనగా వంటి చిత్రాలతో పాటు దేవిక అండ్ డానీ వెబ్ సిరీస్‌లోనూ నటించి మంచి గుర్తింపు పొందారు. ఇటీవలే ఆయన నటించిన టాల్కమ్ పౌడర్ అనే చిత్రం కూడా ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

'జనవరి 12 విడుదల' నుంచి ఫస్ట్ సింగిల్



విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్‌రామ్ ప్రధాన పాత్రల్లో సెన్సేషనల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న మోస్ట్ అవైటెడ్ చిత్రం 'జనవరి 12 విడుదల'. సంక్రాంతి కానుకగా 2027 జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా భారీ స్థాయిలో విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లను చిత్ర బృందం ఘనంగా ప్రారంభించింది. ఇందులో భాగంగా సినిమాలోని తొలి పాట 'దివికి దివికి' సంబంధించిన సాంగ్ ప్రోమోను తాజాగా విడుదల చేసింది. సంగీత దర్శకుడు జీవీ ప్రకాష్‌కుమార్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తుండగా... ఈ పాటతో మ్యూజికల్ మ్యాజిక్ ఖాయమని టీమ్ పోస్ట్‌ల్లో ఆసక్తి రేకెత్తించింది.

'ఆకాశంలో ఒక తార' నాకు ఎంతో ప్రత్యేకం: ఎన్టీఆర్



దుల్కర్ సల్మాన్, సాత్విక వీరవల్లి జంటగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. ఈ సినిమా బృందానికి అగ్ర కథానాయకుడు జూనియర్ ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. తనకు అత్యంత సన్నిహితులైన పలువురు ఈ ప్రాజెక్టులో భాగమయ్యారని, అందుకే ఈ చిత్రం తనకు ఎంతో ప్రత్యేకమని ఆయన పేర్కొన్నారు. కొత్తదనం ఉన్న కథలను ప్రోత్సహించడంలో 'స్వప్న సినిమాస్' ఎప్పుడూ ముందుంటుందని ఎన్టీఆర్ ప్రశంసించారు. మంచి సినిమాలపై నిర్మాత అల్లు అరవింద్, 'గీతా ఆర్ట్స్'కు ఉన్న నమ్మకం ఈ చిత్రంతో మరోసారి నిరూపితమైందన్నారు. ఈ చిత్ర నిర్మాతలు సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం ఈ ప్రాజెక్టు కోసం ఎంతగానో శ్రమించారని కొనియాడారు.

హీరో దుల్కర్ సల్మాన్, కథానాయిక సాత్విక వీరవల్లి, దర్శకుడు పవన్ సాధినేనిలకు ప్రత్యేక అభినందనలు తెలిపిన ఎన్టీఆర్... సినిమా చాలా ఆసక్తికరంగా ఉందని, ప్రేక్షకుల ఆదరణను తప్పకుండా సొంతం చేసుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తారక్ పోస్ట్‌పై నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ స్పందిస్తూ... ఆయన విషెస్ తమకు ఎంతో ప్రత్యేకమని కృతజ్ఞతలు తెలిపింది.

మరోవైపు ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి దంపతులు హైదరాబాద్‌లోని అల్లు సినిమాస్‌లో 'ఆకాశంలో ఒక తార' చిత్రాన్ని వీక్షించారు. సినిమా చూసిన అనంతరం చిత్ర బృందంపై రాజమౌళి ప్రశంసలు కురిపించారు. అల్లు సినిమాస్‌లో రాజమౌళి దంపతులు సందడి చేసిన దృశ్యాలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

బాబుకి జన్మనిచ్చిన సమంత



టాలీవుడ్ నటి సమంత రూత్ ప్రభు, రాజ్ నిడిమోరు తల్లిదండ్రులయ్యారు. ఈ జంటకు పండంటి మగబిడ్డ జన్మించగా... చిన్నారికి 'దేవ్ నిడిమోరు' అని పేరు పెట్టినట్టు తెలుస్తోంది. ఇంటికి కొత్త సభ్యుడి రాకతో ఇరు కుటుంబాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సంతోష కర విషయాన్ని పంచుకుంటూ సమంత సోషల్ మీడియాలో ఒక ఎమోషనల్ ఫొటోను పోస్ట్ చేసింది. తమ ముద్దుల కొడుకు చిట్టి వేళ్లను పట్టుకుని ఉన్న ఆ చిత్రం నెటిజన్లను ఎంతగానో ఆకట్టుకుంటోంది. ఇక తల్లిదండ్రులుగా కొత్త బాధ్యతల్లోకి అడుగుపెట్టిన సమంత, రాజ్‌లకు సినీ పరిశ్రమలోని సహచరులు, స్నేహితులు, అభిమానులు పెద్దఎత్తున శుభాకాంక్షలు తెలుపుతున్నారు. చిన్నారి దేవ్ నిడిమోరుకు ఆయురారోగ్యాలు, సకల సంతోషాలు కలగాలంటూ కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు.

'రామాయణ' ఓ ఎజెండా చిత్రం
విదేశీ నిధులపై దర్యాప్తు జరపాలి: నితీశ్ భరద్వాజ్



భారీ బడ్జెట్‌తో తెరకెక్కి ప్రపంచవ్యాప్తంగా వసూళ్ల వర్షం కురిపిస్తున్న 'రామాయణ' చిత్రంపై ప్రముఖ నటుడు, మాజీ ఎంపీ నితీశ్ భరద్వాజ్ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

బీఆర్ చోప్రా 'మహాభారత్'లో కృష్ణుడి పాత్రతో చెరగని ముద్ర వేసిన నితీశ్ భరద్వాజ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'రామాయణ'ను దురుద్దేశంతో రూపొందించిన 'ఎజెండా చిత్రం'గా అభివర్ణించారు. ఈ చిత్రంలో రావణుడిని ఓ హీరోలా, న్యాయబద్ధంగా పాలించే రాజులా చూపిస్తూ, మర్యాద పురుషోత్తముడైన శ్రీరాముడిని మాత్రం ఓ సాధారణ మానవుడిలా చిత్రీకరించడం దైవదూషణతో సమానమని మండిపడ్డారు. రావణుడిలోని చెడు, ప్రతికూల లక్షణాలను పూర్తిగా దాచిపెట్టారని, దీనివల్ల పుస్తకాలు చదివే అలవాటు లేని నేటి తరం యువత రావణుడిని మంచివాడిగా భావించే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. రావణుడు నిజంగా మంచోడే అయితే అతడిని సంహరించేందుకు సాక్షాత్తూ శ్రీమహావిష్ణువు రామావతారం ఎత్తాల్సిన అవసరం ఎందుకొచ్చిందని ఆయన ప్రశ్నించారు. భారతీయ సంస్కృతిని, నాగరికతను ధ్వంసం చేసే లక్ష్యంతో ఈ సినిమాను విదేశీ నిధులతో నిర్మించి ఉండొచ్చని నితీశ్ అనుమానం వ్యక్తం చేశారు. ఈ సినిమా ఫండింగ్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం మౌనం వీడి తక్షణం విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు.

'ఓం'లో రాజకీయ సందేశం లేదు
దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి

చెన్నై: కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ రాజకీయ రంగప్రవేశంపై జోరుగా ఊహాగానాలు సాగుతున్న వేళ



ఆయన నటించిన తాజా చిత్రం 'ఓం'పై ఆసక్తి నెలకొంది. అయితే ఈ సినిమాలో ఎలాంటి రాజకీయ సందేశం లేదని దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి స్పష్టం చేశారు. సినిమా ప్రచారంలో భాగంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన... 'ఓం' కేవలం స్పై థ్రిల్లర్ మాత్రమే కాదని, అండర్‌కవర్ ఎమోషనల్ డ్రామా అని తెలిపారు. ఇందులో రెండు జానర్లు కలగలిసి ఉంటాయని పేర్కొన్నారు. సినిమాలో రాజకీయ సందేశం ఉందా అన్న ప్రశ్నకు స్పందిస్తూ... రాజకీయ సందేశం లేకపోయినా ప్రజలకు ఉపయోగపడే ఒక సందేశం మాత్రం తప్పకుండా ఉంటుందని వివరించారు. మరోవైపు ధనుష్ తన అభిమాన సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించడం, అభిమాన సంఘం పేరు మార్పు వంటి పరిణామాలు ఆయన రాజకీయ ప్రవేశంపై చర్చకు దారితీశాయి. అయినప్పటికీ ధనుష్ ఇప్పటివరకు రాజకీయ ప్రవేశంపై ఎలాంటి అధికారిక ప్రకటనా చేయలేదు.